


epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

హైదరాబాద్ fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-11-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 287 పేజీలు: 10+4 వెల: 6.50

బిల్కిస్ బానో కేసులో కీలక మలుపు — 5

ఛత్తీస్‌గఢ్ మాజీ సిఎం కుమారుడి ఆస్తుల జప్తు



మోడీ నేతృత్వంలో భారత్ ముందంజ — 2

రెండున్నరేళ్లలో రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించిన సిఎం చంద్రబాబు

విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

సోషల్ మీడియా ఓ వ్యసనం — 5



యువత బానిసగా మారుతోంది

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆందోళన

ఆసియాలో మరింత ఆర్థిక
సహకారం

ఫిలిప్పీన్స్‌తో పటిష్ట వాణిజ్య బంధం

మనీలాలో ప్రధాని మోడీకి ఘనస్వాగతం

21వ 'ఆసియాన్' సమ్మిట్‌కు హాజరవుతున్న ప్రధాని



మనీలాలో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

మనీలా, నవంబరు 16: ఫిలిప్పీన్స్‌లో రెండురోజుల పర్యటనకువెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఆ దేశ రాజధాని మనీలాలో ఘనస్వాగతం లభించింది. సోమవారం మనీలా విమానాశ్రయంలో ప్రధానమంత్రికి సాంస్కృతిక ప్రదర్శనతో ప్రవాస భారతీయులు స్వాగతం పలికారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మనీలాలో పర్యటనను ప్రవాస భారతీయులు స్వాగతించారు. ఈ పర్యటన వల్ల ద్వైపాక్షిక సంబంధాలు బలపడతాయని, వాణిజ్య అవకాశాలు విస్తరిస్తాయని, అలాగే ఈ ప్రాంతం అంతటా ఆర్థిక సహకారం మరింత లోతుగా మారుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. "ప్రధాని మోడీ నాయకత్వంలో అంతర్జాతీయ వేదికపై భారత్ స్థాయి పెరిగింది. దీనివల్ల విదేశాల్లో నివసిస్తున్న భారతీయులకు గుర్తింపు లభించడమే కాకుండా, భారత్‌తో వ్యాపారాలు చేసే దేశాలకు కూడా మరిన్ని అవకాశాలు మెరుగుపడ్డాయి" అని పేర్కొన్నారు. "ప్రధాని మోడీ చాలా గొప్పగా పనిచేస్తున్నారు. ఆయన గురించి అందరికీ తెలుసు. ఆయన >>2



సోమవారం న్యూఢిల్లీలో ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక తదితరులు

రాజీవ్‌తో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న కాంగ్రెస్ అగ్రనేత

విమర్శల్లో నిజాయితీ ఉంది

హాజరైన ఖర్గే, రాహుల్, ప్రియాంక, సిఎంలు రేవంత్, డికె, విజయ్ సహా పలువురు ముఖ్యనేతలు

'బిలాంగింగ్' ఓ హిస్టరీ

అవాస్తవ కథనాలను తిప్పికొట్టడానికే ఆత్మకథ రాశా: పుస్తకావిష్కరణలో సోనియా గాంధీ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు16: తన ఆత్మకథను ఎందుకు రాయాల్సి వచ్చిందో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ వివరించారు. తనకుటుంబం గురించి బయట ప్రచారంలో ఉన్న కథనాల్లో చాలా వరకు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని అన్నారు. తన అత్త (ఇందిరాగాంధీ), భర్త (రాజీవ్‌గాంధీ), కుమార్తె (ప్రియాంకగాంధీ), కుమారుడు (రాహుల్ గాంధీ) సహా తన గురించి ఎన్నో అసత్యాలు, కల్పిత కథనాలు అల్లారని వాటిని తిప్పికొట్టడానికే తాను ఆత్మకథ పుస్తకం రాయాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. సోమవారం >>2

'సర్'కు ఆమోదం
ఎవరిది?


ఇసికి 48 ప్రశ్నలు సంధించిన ఇండియా కూటమి

సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసిన రాహుల్, మరికొందరు నేతలు



న్యూఢిల్లీ, నవంబరు 16: ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఎన్నికల సంఘాన్ని టార్గెట్ చేసేందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష కూటమి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ ప్రక్రియకు ఆమోదం ఎలా లభించింది.? ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయా?, ఓటర్ల డేటా, ఇసిఐ నెట్ వ్యవస్థ, ఫారం6 దరఖాస్తుల నిర్వహణలో ఎలాంటి విధానాలు అనుసరిస్తున్నారు? వంటి >>2

మూడు పంద్రాగస్టులు దాటినా
రుణమాఫీ హుళక్కి



సోమవారం సిద్దిపేటలో బహిరంగ లేఖ విడుదల చేస్తున్న హరీష్‌రావు

దేవుళ్లపై ఒట్టువేసి మాట తప్పినందుకే రాష్ట్రానికి అరిష్టం

నిలిచిపోయిన రూ.1070 కోట్ల నిధులు విడుదల చేయాలి

సిఎం రేవంత్‌రెడ్డికి హరీష్‌రావు బహిరంగ లేఖ

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: సిఎం రేవంత్‌రెడ్డి ఈనెల 19న సిద్దిపేటకు వస్తున్నా నేపథ్యంలో ప్రజల పక్షాన మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం బహిరంగ లేఖను విడుదల చేసి మాట్లాడారు. సిఎం వస్తున్నారంటే మేలు జరుగుతుందని.. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని ప్రజలు నమ్ముతారని తెలిపారు. 2024 మేలో సిద్దిపేటకు మొదటిసారి వచ్చిన రేవంత్‌రెడ్డి అంబేద్కర్ చౌరస్తాలో కొమురవెల్లి మల్లన్న సాక్షిగా పంద్రాగస్టులోపల 2లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మూడు పంద్రాగస్టులు దాటిన రైతు రుణమాఫీ కాని పరిస్థితి ఉందన్నారు. రేవంత్‌రెడ్డి స్వంత నియోజకవర్గం,గ్రామంలో రుణమాఫీ కాలేదన్నారు.రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టువేసి మాట తప్పనందుకు రాష్ట్రానికి అరిష్టం పట్టుకుందన్నారు. రేవంత్ పాపం వలనే రాష్ట్రానికి కరువు వచ్చిందన్నారు. మూడోసారి సిద్దిపేటకు వస్తున్నావు అందరికీ రుణమాఫీచేసి సిద్దిపేటకు రావాలన్నారు. 2026 మార్చిలో 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు వేస్తానని మాట ఇచ్చి 230 రోజులు గడిచిన నేటికి రైతు భరోసా ఇవ్వలేదన్నారు. చీము నెత్తురు ఉంటే, కనీసం నీకు ప్రజలంటే గౌరవం, దేవుళ్ల మీద భక్తి ఉంటే రైతు బంధు హామీ అమలు చేసి సిద్దిపేటకు రావాలన్నారు. సిద్దిపేటలో వివిధ పనులకు సంబంధించి 1070 కోట్ల పనులను రద్దు చేశారు నిధులు నిలిపి వేశారు నిలిపివేసిన రూ.1070 కోట్ల >>2



నేడు ప్రభుత్వ ఉద్యోగుల

సామూహిక సెలవు

అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్మ దీక్షలు

పాత పెన్షన్ అమలు కోసం పోరు బాట

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: తెలంగాణలో పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) పునరుద్ధరణ కోసం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరోసారి ఆందోళనకు సిద్ధమయ్యారు. కర్ణాటక, తమిళనాడు, >>2

సొంతింటి కల 'భద్రం'

ఉమ్మడి ఎపిలోని ఇళ్ల పథకాల లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని సర్కార్ నిర్ణయం


2014 ముందు నాటి లబ్ధిదారులకు ఊరట

7 లక్షల మందికి ప్రయోజనం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్,నవంబరు16,ప్రభాతవార్త: దశాబ్దాలుగా పేదలు కన్న సొంతింటి కలను సాకారం చేస్తూ వారి ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తున్న ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇందిరమ్మ సహా వివిధ ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్లు నిర్మించుకున్న పేదలకు గతంలో జారీ చేసిన పట్టాలను తిరిగి అందించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు పేదల సొంతింటిపై హక్కును మరింత భద్రం చేస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పించే దిశగా ప్రజా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం లక్షలాది పేదకుటుంబాలకు ఊరటనివ్వనుందన్నారు. గతంలో అమలుచేసిన విధానం ప్రకారం ప్రభుత్వం వద్దనే ఉన్న లబ్ధిదారుల ఇండ్ల పట్టాలు/పొజిషన్ సర్టిఫికేట్లను తిరిగి వెనక్కి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా 7 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. దాదాపు దశాబ్దానికి పైగా లబ్ధిదారులకు సంబంధించిన వారి ఇంటి పట్టా సర్టిఫికేట్లు తిరిగి రాకపోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నట్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తనకు అనేక విజ్ఞాపనలు వచ్చిన దరిమిలా ఈ అంశంలో ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రాష్ట్రంలో 22ఎ మీద సమీక్షలు జరుగుతున్న సమయంలో ఈ పట్టాలు తహసీల్దార్ ఆఫీస్‌లలో భారీగా ఉన్నాయని ముఖ్యమంత్రి దృష్టికి రాగా వెంటనే పేదలకు వాటిని వాపస్ చేయాలంటూ ఆదేశించారని దానికి అనుగుణంగా జిల్లా కలెక్టర్లకు ఈ ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. 2014 కంటే ముందు అమలు చేసిన పథకంలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సబ్సిడీతోపాటు, లబ్ధిదారుల వాటా తోపాటు, బ్యాంకు రుణం ద్వారా ఆర్థిక సహాయం అందించే వారు. ఈ రుణాల కోసం లబ్ధిదారుల ఇండ్లకు చెందిన పట్టాలను ష్యూరిటీగా ఉంచుకునేవారు. రుణ వాయిదాలన్నిటిని సక్రమంగా కట్టి, మొత్తాన్ని తిరిగి చెల్లించిన వారికి పట్టాలను తిరిగి >>2

తీవ్ర వాయు'గండం'!



20 నుంచి భారీ వర్ష సూచన

పలు జిల్లాల్లో 150 మి.మీపైగా వర్షపాతానికి అవకాశం

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: ఆగ్నేయ, ఆనుకొని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం బలపడిందని, ఇది మంగళవారం నాటికి తుఫాన్‌గా మారనుందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం చెన్నైకు 720 కి.మీ, విశాఖపట్నంకు 820 కి.మీ, గోపాల్‌పూర్ కు 940 కి.మీ దూరంలో కేంద్రీకృతమైంది. తుపానుగా మారిన తర్వాత ఆ తదుపరి 48 గంటల్లో అతి తీవ్ర తుపాన్ గా కోస్తాంధ్ర తీర ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉంది. తుఫాన్‌గా మారాక అక్వాన్‌గా నామకరణం చేయనున్నారు. ఈ తుఫాను ప్రభావంతో ఈ నెల 20 నుండి 22 మధ్య తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్ మ్యాన్ అంచనా వేశారు. కాగా ఈ తుపాను ప్రభావంతో తూర్పు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ నెల 21న దీని తీవ్రత గరిష్టంగా ఉండనుండగా, కొన్ని ప్రాంతాల్లో 150 మిల్లీమీటర్ల నుంచి 200 మిల్లీమీటర్లు కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి. ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, >>2



నల్లగొండలో సోమవారం కిసాన్ సభలో ప్రసంగిస్తున్న ఆల్‌ఇండియా కిసాన్ సభ జనరల్ సెక్రెటరీ విజూ కృష్ణన్

26న దేశవ్యాప్తంగా
రైతు ఉద్యమాలు

కిసాన్ మోర్చా ఉద్యమం దేశవ్యాప్త పోరాటాలకు స్ఫూర్తి: ఉద్యమనేత రాకేశ్ టికాయత్

నల్గొండ టౌన్ నవంబరు16, ప్రభాతవార్త: రైతాంగ,వ్యవసాయ కార్మిక,భూమిలేని పేదలు, ఆదివాసీ సంఘాల ఐక్య పోరాటాలతోనే కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమని రైతు ఉద్యమ నాయకుడు రాకేష్ టికాయత్ పిలుపునిచ్చారు. దేశ రాజధాని ఢిల్లీని 13 నెలల పాటు దిగ్బంధించి మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయించిన రైతాంగ >>2

భగ్గుమన్న బోగీలు

చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం

ఖాళీ బోగీల్లో

వరుసగా మంటలు



సోమవారం చర్లపల్లిలో ఎగసిపడుతున్న మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హైదరాబాద్, నవంబరు 16 ప్రభాతవార్త: హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం సాయంత్రం స్టేషన్ ప్లాట్‌ఫారమ్ నంబర్ 5, 6 మధ్య మెయిం టేనెన్స్ కోసం నిలిపి ఉంచిన ఖాళీ రైలే బోగీల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు ఆకాశాన్ని కమ్మేశాయి. ఉన్నట్టుండి ఒక్కసారిగా క్షణాల్లోనే మంటలు ఇతర బోగీలకు వ్యాపించాయి. దీంతో మొత్తం ఏడు బోగీలు మంటల్లో చిక్కుకున్నాయి. బోగి నుంచి దట్టమైన పొగలు, పెద్దఎత్తున మంటలు ఎగిసిపడటంతో పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం మరింత తీవ్రంకాకుండా ముందు జాగ్రత్త >>2

నేడు ప్రభుత్వ ఉద్యోగుల సామూహిక సెలవు

>> కేరళ రాష్ట్రాల్లో తీసుకున్న నిర్ణయాల తరహాలో తెలంగాణలోనూ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా సామూహిక సెలవు పాటించాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీసీపీఎస్ఈయూ) నిర్ణయించింది. ఈ సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్మ దీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ ఆందోళనా కార్యక్రమాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 2.60 లక్షల మంది సీపీఎస్ పరిధిలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనున్నారు. అయితే వీరిలో అత్యవసర సేవల విభాగాల్లో పనిచేస్తున్న 45 వేల మందికి సామూహిక సెలవు నుంచి మినహాయింపు ఇచ్చారు.

మిగిలిన 2.15 లక్షల మంది ఈ ఆందోళనలో పాల్గొనే అవకాశం ఉందని యూనియన్ అంచనా వేస్తోంది. ఇప్పటికే 1.50 లక్షల మందికి పైగా ఉద్యోగులు సామూహిక సెలవు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలియవచ్చింది. మరోపక్క పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వరీ శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాను కలిసి వినతిపత్రం అందజేసింది. తమ వేతనాల నుంచి 11.5 శాతం మొత్తాన్ని సీపీఎస్ ఖాతాలకు జమ చేస్తున్నప్పటికీ, పదవీ విరమణ తర్వాత వచ్చే పెన్షన్, వైద్య భద్రతపై స్పష్టత లేకుండా పోయిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భద్రతపై ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా ఈ సీపీఎస్ ఉద్యోగుల సామూహిక సెలవు కార్యక్రమానికి పలు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించాయి. రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు.

ఈ ఆందోళన నేపథ్యంలో ఈ నెల17న చేపట్టిన అత్యవసరం కాని ప్రభుత్వ సేవలకుఅంతరాయం కలిగే అవకాశముంది. ఇకగత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పెన్షన్ విధానంపై ఇచ్చిన హామీకి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు యూనియన్ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ తెలిపారు.

తీవ్ర వాయు'గండం'!

>> నల్గొండ, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ నగరంతో పాటు, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో ఈ నెల 21, 22 తేదీల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. అలాగే పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో తుపాను ప్రభావం తక్కువగా ఉంటుందని, అక్కడ కేవలం తేలికపాటి వర్షాలు లేదా పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

రుణమాఫీ హుళక్కి

>> నిధులు, పెండింగ్‌పెట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సిఎంను డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు కెసిఆర్ 90 శాతం న్యాయం చేశారని మిగిలిప 10 శాతం నిర్వాసితులకు సిఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలన్నారు. కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోస్తే సిద్దిపేట జిల్లాకు కరువేలేదన్నారు. రూ.4 వేల పింఛన్లు ఎప్పుడు ఇస్తావని ప్రశ్నించారు. గత బిఆర్ఎస్ హయాంలో ముఖ్యమంత్రి హోదాలో కెసిఆర్ వస్తే ఒకసారి మల్లన్నసాగర్,ఒకసారి మెడికల్ కాలేజీ,మరోసారి కలెక్టరేట్‌ను ప్రారంభించారని కానీ సిఎం రేవంత్‌రెడ్డి వస్తే ఒక్క మేలు కూడా జరగలేదని ఇప్పటికే రెండు సార్లు సిద్దిపేటకు వచ్చారని అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిలిపివేయం వివక్ష కాదా అని ప్రశ్నించారు. సిఎం కడుపులో సిద్దిపేట జిల్లాపై అంత కుళ్లే ఉంటేందన్నారు. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డికి సావాస దోషం ఉన్నట్లు ఉందని.. సిఎం లాగానే ఢిల్లీలో అన్ని అబద్దాలే మాట్లాడుతున్నారని మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హారీష్‌రావు అన్నారు.తమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు రాజకీయాల కోసం కమీషన్ల కోసం మార్చిమని అంటున్నారు ఒక అబద్దాన్ని పదే పదే చెబితే అది నిజం అన్న రీతిలో కాంగ్రెస్ వ్యవహార శైలి ఉందన్నారు. అసెంబ్లీ సాక్షిగా అన్ని ఆధారాలతో సమాధానం చెప్పి మీ నోళ్లు మూయించానని తెలిపారు. తమ్మిడిహట్టి దగ్గర నీళ్లు లేవి అప్పటి కేంద్ర జలనవరులశాఖ మంత్రి ఉమాభారతి, సిడబ్ల్యుసి రాసిన లేఖలను చూపించానని గుర్తు చేశారు. నీళ్లు లేని చోట మీరు ప్రాజెక్టులు కడితే నీళ్లు ఉన్న చోటకు బిఆర్ఎస్ సర్కార్ ప్రాజెక్టును మార్చిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ చేసిన తప్పును సరిదిద్ది...పెట్టిన ఖర్చు వృదా కాకుండా సద్వినియోగం చేసిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట పనులు చేయకుండా బిల్లులు ఎత్తి కమిషన్లు కొట్టారని ఆరోపించారు.

రైతు ఉద్యమాలు

>> పోరాటం ఐక్యతకు నిదర్శనమన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచే ప్రజా ఉద్యమాలు పుట్టుకొస్తాయని, వాటిని దేశవ్యాప్త పోరాటాలుగా విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.నల్లగొండ నగరంలోని సారంపల్లి మల్లారెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన అచ్చుతానందం హాల్‌లో సోమవారం నిర్వహించిన అ ఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆల్ ఇండియా కిసాన్ సభ, సంయుక్త కిసాన్ మోర్చా, మహిళా సంఘాలు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం, తెలంగాణలోని వామపక్ష ఉద్యోగ, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఈ మహాసభల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు.600 రైతు సంఘాల ఐక్యతతో విజయదేశంలో రైతాంగ ఉద్యమాలకు సుదీర్ఘ చరిత్ర ఉందని, స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు రైతులు అనేక పోరాటాలు సాగిస్తున్నారని రాకేష్ టికాయత్ గుర్తుచేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీహార్ తదితర ప్రాంతాల్లో రైతులు, ఆదివాసీలు సాగిస్తున్న పోరాటాలు గ్రామీణ ప్రజల సమస్యల నుంచి పుట్టుకొచ్చినవేనన్నారు. ఢిల్లీలో మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం కూడా దేశవ్యాప్తంగా రైతాంగాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చిందని చెప్పారు.సుమారు 600 రైతు సంఘాలను సంయుక్త కిసాన్ మోర్చా వేదికపైకి తీసుకురావడం చారిత్రక పరిణామమన్నారు. ఈ ఉద్యమంలో రైతులతోపాటు వ్యవసాయ కార్మికులు, భూమిలేని పేదలు, ఆదివాసీలు, చిన్న వ్యాపారులు, సామాన్య ప్రజలు భాగస్వాములయ్యారని తెలిపారు. పంజాబ్ రైతాంగం ప్రత్యేక చొరవతో ఉద్యమానికి నాయకత్వం వహించగా, హర్యానాతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల రైతులు పెద్దఎత్తున తరలివచ్చారని వివరించారు. 13 నెలల పాటు ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు నిరంతర పోరాటం సాగించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి విజయం సాధించారని పేర్కొన్నారు.నవంబర్ 26న రాత్రి బస.. 27న చక్కాజామ్‌రైతాంగ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 26న దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించాలని, పరిస్థితులు, ప్రాంతీయ సంభావ్యతను బట్టి మండల స్థాయిలోనూ ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

భగ్గుమన్న బోగీలు

>> చర్యగా ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అలాగే మంటలు ఇతర రైళ్లకు, ప్లాట్‌ఫారమ్‌లకు వ్యాపించకుండా ఉండేందుకు విద్యుత్ సరఫరాను నిలిపిశారు. అయితే ట్రైన్‌లో మంటలు చెలరేగడాన్ని గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే రైల్వే పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైల్వే పోలీసులు, స్థానిక అధికారులు కూడా స్పాట్‌కు చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఫైర్ సిబ్బంది ఫైరింజన్ సహాయంతో తీవ్రంగా శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. అయితే,అయితే మంటలు మరిన్ని బోగీలకు వ్యాపించకుండా తలగబడిన బోగీల నుంచి మిగతా బోగీలను వేరు చేశారు అధికారులు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ఖాళీ బోగీలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఈ ఘటనపై రైల్వే అధికారులు మాట్లాడుతూ.. సోమవారం సాయంత్రం 6:30 గంటల సమయంలో ప్లాట్‌ఫారమ్ నంబర్ 5, 6 మధ్య ఆపి ఉంచిన ఖాళీ ట్రైన్‌లో అగ్నిప్రమాదం జరిగినట్టు తెలిపారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వాళ్లు వచ్చి మంటలను ఆర్పేసినట్టు తెలిపారు. అయితే చివరి బోగీలో మంటలు చెలరేగాయని.. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సొంతింటి కల 'భద్రం'

>> ఇచ్చేవారు. కాగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని నిలిపివేయడంతో ఇళ్ల పట్టాలు లబ్ధిదారులకు అందలేదన్నారు. దీంతో తనఖాలో ఉన్న పట్టాలను ఆయా లబ్ధిదారులకు తిరిగి ఇవ్వవలసి ఉందన్నారు. వివిధ కారణాలతో కొంత మంది లబ్ధిదారులకు వారి ఇండ్లకు సంబంధించిన పత్రాలను తిరిగి ఇవ్వలేదని ఈ అంశంలో ప్రత్యేక దృష్టి సారించాలని వాటిని వాపస్ చేయాలంటూ జిల్లా కలెక్టర్లను ఆదేశించామని మంత్రి పొంగులేటి తెలిపారు.

వారం - వర్జ్యం

17-11-2026,మంగళవారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
కార్తీక మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, విశాఖ కార్తె,

తి. అష్టమి ఉ .6.05, న.ధనిష్ఠ తె.4.33
వ.ఉ.6.38 - ఉ.8.23
దు.ఉ.8.27 - ఉ.9.12
2)రా.10.04 - రా.10.49

రాహు మ.3.00-4.30, శుభ స. లేదు

వారాఫలం

మేషం : బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. కోర్టు వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. పరిశ్రమలు ఏర్పాటు చేస్తారు.

వృషభం : కృషితో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు. అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం పరుచుకుంటారు.

మిథునం : కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు. క్రయవిక్రయాలు లాభిస్తాయి.

కర్కాటకం : వృత్తిలో ఎదురైన ఆటంకాలు నిదానంగా అధిగమిస్తారు. ఉద్యోగాలలో బదిలీలు ఉంటాయి. పరిచయాలు పెరుగుతాయి.

సింహం : ముఖ్యమైన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవ ప్రతిష్టలు పొందుతారు. ఆరోగ్య సమస్యలు తీరుతాయి.

కన్య : ఋణాలు తీరి ఊరట చెందుతారు. ముఖ్యమైన పనులు సోదరుల సహకారంతో పూర్తి చేస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

తుల : నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదుర వుతాయి. వివాదాలకు దూరంగా ఉండండి. ఉద్యోగులకు ఆకస్మికంగా బదిలీలు ఉంటాయి.

వృశ్చికం : మానసిక ఒత్తిడుల నుండి బయట పడతారు. నూతన పెట్టుబడులకు తగిన లాభం పొందుతారు. విందులలో పాల్గొంటారు.

ధనుస్సు : నూతన విద్యావకాశాలు పొందు తారు. కష్టానికి ఫలితం దక్కుతుంది. దైవ సందర్శ నం చేసుకుంటారు.

మకరం : బంధువుల నుండి ఆహ్వానాలు అందు తాయి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ధన, వస్తు లాభాలు పొందుతారు.

కుంభం : సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. ఆస్తి విషయాలలో ఇతరుల జోక్యం చికాకు తెప్పిస్తాయి. వాహన సౌఖ్యం.

మీనం : సహోదరి వర్గంతో మాట పట్టింపులు రాకుండా జాగ్రత్తలు పాటించండి. క్రీడారంగం యందు ఆసక్తిగా ఉంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోరి, హైదరాబాద్

మోడీ నేతృత్వంలో భారత్ ముందంజ

రాష్ట్రాలలో ఎపి టాప్

రెండున్నరేళ్లలో రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించిన సిఎం చంద్రబాబు

విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా



సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు జ్ఞాపికను అందజేస్తున్న ఎపి డి.సిఎం పవన్ కల్యాణ్. చిత్రంలో సిఎం చంద్రబాబు

విజయవాడ, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ నిరంతరం అభివృద్ధి చెందుతోందని అమిత్ షా ప్రశంసించారు. రెవెన్యూ లోటు ఉన్న రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందా అని తొలుత భావించానని, అయితే చంద్రబాబు రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టారని అన్నారు. దేశంలోని రాష్ట్రాల అభివృద్ధి గణాంకాలను తాను నిశితంగా పరిశీలిస్తుంటానని, వచ్చే పదేళ్లలో చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా అగ్రస్థానానికి చేరుతుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన విజయవాడలో పర్యటించారు. పలువురు కూటమి నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు, తన పర్యటనలో భాగంగా అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ విశాఖపట్నంలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడం రాష్ట్రానికే కాకుండా దేశానికి గర్వకారణమని అన్నారు. అమెరికా వెలుపల గూగుల్ ఏర్పాటు చేయనున్న తొలి డేటా సెంటర్ ప్రాజెక్టు దేశ డిజిటల్ రంగానికి కీలకమవుతుందని పేర్కొన్నారు. విశాఖ తీరంలో సముద్రగర్భం నుంచి ఏర్పాటు చేస్తున్న సబ్‌సీ కేబుల్ కూడా అత్యంత ప్రాధాన్యమైన ప్రాజెక్టు అని వివరించారు. రాష్ట్రానికి తొలి సెమీకండక్టర్ యూనిట్, స్టీల్ ఫ్యాక్టరీలు, అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు వస్తున్నాయని తెలిపారు. రెండున్నరేళ్లలో చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రానికి రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిందని ప్రశంసించారు.

గతంలో కొందరి తప్పులతో నిలిచిపోయిన పోలవరం ప్రాజెక్టును తిరిగి పునరుద్ధరించి రైతులకు, ప్రజలకు నీరందించేందుకు సిఎం కృషి చేస్తున్నారని చెప్పారు. "ప్రధాని మోడీ నేతృత్వంలో దేశ ఆర్థిక అభివృద్ధి అత్యంత వేగంగా జరుగుతోంది. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందించేలా చేస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా రష్యా ఉక్రెయిన్, యూఎస్- ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా నడుస్తున్న యుద్ధంతో వివిధ దేశాలు సంక్షోభంలో ఉన్నాయి. కానీ భారత దేశాభివృద్ధి 7 శాతానికి పెరిగిందని మూడీస్ అనే సంస్థ స్పష్టం చేసింది. దేశ ఎగుమతులు వచ్చే యేడాది 1 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువ జరుగుతాయి.

గడచిన 13 యేళ్లలో స్టీల్ ఉత్పాదనలో దేశం ప్రపంచంలోనే రెండో స్థాయికి చేరింది. జపాన్, అమెరికా చేస్తోన్న ఉత్పత్తికి సమానంగా భారత్ స్టీల్ ఉత్పత్తి చేస్తోంది. దేశంలో 2.15 లక్షల గ్రామాలకు 4జీ కనెక్టివిటీ చేరింది. హైడ్రోజన్ రైళ్ల నిర్మాణం కూడా దేశీయంగానే చేసి నడిపిస్తున్నాం.. 150 విమానాశ్రయాలతో భారత్ అత్యంత వేగంగా ముందడుగు వేసింది. ప్రపంచ బ్యాంకు రిపోర్టు ప్రకారం 12 యేళ్ల మోడీ పాలనలో 50 కోట్ల మంది దారిద్ర్యరేఖ నుంచి బయటకు వచ్చారు. గడచిన 40 యేళ్లలో ప్రతీ ఏటా 2 వేలకు పైగా నక్సల్ దాడులు జరిగేవి. ప్రస్తుతం ఒక్క నక్సల్ దాడి కూడా జరగటం లేదన్న అని అమిత్ షా వివరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం మనీలా ఎయిర్‌పోర్టులో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న కళాకారులు

మరింత ఆర్థిక సహకారం

>> తీసుకుంటున్న చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు చేస్తాయి. ఇది దేశంలోని ప్రజలకే కాకుండా, ఇతర దేశాలకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. భారత్‌తో భాగస్వామ్యం కుదుర్చుకునే ఏ దేశమైనా, భారత్‌తో పాటే అభివృద్ధి చెందుతుందన్ని అని ప్రవాస భారతీయులు అన్నారు. మరో ప్రవాస భారతీయుడైన లచ్‌మన్ దస్వానీ, దేశం పట్ల మోడీకి ఉన్న అంకితభావాన్ని కొనియాడారు. ఈ పర్యటన ద్వారా మంచి ఫలితాలు వస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇప్పటివరకు ఉన్న ప్రధాన మంత్రుల్లో ఆయన అత్యుత్తమమైన వారు. దేశం కోసం, ప్రపంచం కోసం ఇంత నిబద్ధతతో, మనస్ఫూర్తిగా పనిచేసే వ్యక్తిని నేను ఇంతకుముందెన్నడూ చూడలేదు" అని దస్వానీ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జరిగే సమావేశాలు ఈ ప్రాంతంలోని ఆర్థిక వ్యవస్థలకు ఎంతో మేలు చేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. "ఈ సమావేశాల ఫలితాలు చాలా అద్భుతంగా ఉంటాయి. ఆసియా దేశాలన్నీ కలిసి పనిచేయడం ద్వారా అందరికీ మెరుగైన ఆర్థిక పరిస్థితులు ఏర్పడతాయ్ని అని ఆయన అన్నారు. వ్యాపారవేత్త టికం చెల్లానీ మాట్లాడుతూ, మోడీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఫిలిప్పీన్స్‌లో భారతీయుల పట్ల గౌరవం, గుర్తింపు పెరిగాయని, ప్రపంచ వేదికపై భారత్ మరింత ప్రముఖంగా కనిపిస్తోందని చెప్పారు. "మనీలాలో మేము చాలా ఉత్సాహంగా ఉన్నాం. ప్రపంచ వేదికపై భారత్‌కు ఆయన కల్పించిన స్థానం గతంతో పోలిస్తే ఎంతో మెరుగ్గా ఉంది. మేము భారత్‌కు దూరంగా ఇక్కడ నివసిస్తున్నప్పటికీ, ప్రధాని బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఇక్కడ భారతీయుల విలువ గణనీయంగా పెరిగింది. ప్రపంచ స్థాయిలో భారత్‌కు మంచి గుర్తింపు లభిస్తోంద్ని అని చెల్లానీ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న వాణిజ్య సంబంధాలను కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఫిలిప్పీన్స్ వ్యాపార రంగంలో భారతదేశం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుందని అన్నారు. "గతంలో ఫిలిప్పీన్స్‌లో భారతదేశం గురించి అంతగా తెలియదు, కానీ ఇప్పుడు భారతదేశంతో వాణిజ్యం, వ్యాపారం పెరిగాయి.

దానికి అనుగుణంగా, చాలా మంది భారతీయులు కూడా వ్యాపారం కోసం ఇక్కడికి వస్తున్నారు. కాబట్టి చాలా మంచి అంచనాలు ఉన్నాయి, పరిస్థితులు మరింత మెరుగుపడతాయ్ని అని ఆయన అన్నారు. 23వ ఆసియాన్‌ఇండియా సదస్సు మరియు 21వ తూర్పు ఆసియా సదస్సు (ఇఏఎస్)లో పాల్గొనేందుకు మోడీ సోమవారం రెండు రోజుల పర్యటన నిమిత్తం మనీలా చేరుకున్నారు. 2026 వరకు ఆసియాన్ ఛైర్‌గా ఫిలిప్పీన్స్ ఈ రెండు సమావేశాలకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ పర్యటనకు ముందు తన వీడ్కోలు ప్రకటనలో, ఫిలిప్పీన్స్‌లోని భారతీయ సమాజంతో మమేకమవ్వడానికి ఎదురుచూస్తున్నానని మోడీ అన్నారు. "ఫిలిప్పీన్స్‌లోని చైతన్యవంతమైన భారతీయ సమాజంతో సంభాషించడానికి కూడా నేను ఎదురుచూస్తున్నాను. వారి సహకారం మన రెండు దేశాల మధ్య స్నేహ బంధాలను బలపరుస్తుంద్ని అని ఆయన అన్నారు.



న్యూఢిల్లీలో సోనియా పుస్తకావిష్కరణలో సిఎం రేవంత్, ఖర్గే, రాహుల్, విజయ్ తదితరులు

'బిలాంగింగ్' ఓ హిస్టరీ

>> సాయంత్రం తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తన జీవిత అనుభవాలను, తన కుటుంబం గురించి తనకు తెలిసిన వాస్తవాలను ప్రజలతో పంచుకోవాలనే ఉద్దేశంతోనే ఈ పుస్తకం రాసినట్లు తెలిపారు. తన అత్త ఇందిరా గాంధీ, భర్త రాజీవ్ గాంధీ హత్యలకు సంబంధించిన విషయాలు పుస్తకంలో రాయడం తనకు చాలా కష్టంగా అనిపించిందని సోనియా గాంధీ అన్నారు. రాజీవ్ గాంధీతో బంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయనతో తన ప్రేమ గురించి వివరించారు. తన బాల్యంలో అయినా, రాజకీయ జీవితంలో అయినా ఎప్పుడూ డైరీ రాసుకోలేదని, కానీ ఇప్పుడు పుస్తకమే రాసినట్లు తెలిపారు. పుస్తకంలోని చాలా విషయాలు తన జ్ఞాపకాల నుంచే రాశానని సోనియా గాంధీ స్పష్టం చేశారు. ఇంకా ఈ సందర్భంగా పుస్తకంపై వస్తున్న విమర్శల గురించి ప్రస్తావిస్తూ కొన్ని విమర్శలు కాస్త కఠినంగా ఉన్నప్పటికీ, మరికొన్ని నిజాయతీగా ఉన్నాయని, తామేం చెప్పాలో, ఏం చెప్పకూడదో వారు స్పష్టంగా అభిప్రాయాలు వ్యక్తం చేశారని పేర్కొన్నారు. తన ప్రయాణాన్ని తరచి చూసుకున్నప్పుడు పదే పదే బిలాంగింగ్ అనే పదం గుర్తుకు వచ్చిందని సోనియా గాంధీ తెలిపారు. తన కుటుంబం గురించి వ్యాప్తిలో ఉన్న కొన్ని కథనాల్లో బాధ కలిగించేవి కూడా ఉన్నాయని చెప్పారు. ఆ తప్పుల విషయంలో క్లారిటీ ఇచ్చేందుకు తన అనుభవాలకు అక్షర రూపం ఇద్దామనుకున్నానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు సంబంధించి తప్పుడు సమాచారం వ్యాప్తిలో ఉండటం సహజమేనని కూడా అభిప్రాయపడ్డారు. మొదట్లో ఆమెను చూస్తే కొంత భయం వేసేదని అన్నారు. తన అత్త ఇందిరా గాంధీది దృఢమైన వ్యక్తిత్వమని చెప్పారు. అప్పుడప్పుడూ ఆమె కోపం చూస్తే భయం వేసేదని అన్నారు. తన తండ్రి గుర్తొచ్చేవారని తెలిపారు. అయితే, కాలం గడిచే కొద్దీ ఒకరిగురించి మరొకరికి తెలిశాక బంధం బలపడిందని అన్నారు. రాహుల్, ప్రియాంక పుట్టాక ఇందిరా గాంధీలో మరింత స్పష్టమైన మార్పు కనిపించిందని అన్నారు. అమ్మమ్మ అయ్యాక ఆమె మరింత సున్నితంగా వ్యవహరించే వారని చెప్పారు. 'నా కథను నేనే రాయాలని స్నేహితులు తరచూ చెప్పేవారు. అయితే, నా అంతరంగాన్ని బయట పెట్టేందుకు ఎప్పుడూ వెనుకాడేదాన్ని, రాహుల్, ప్రియాంక, రచయిత్రి మంజులికా దుబేల పట్టుదలతో చివరికి అంగీకరించాను. మొదట్లో రాయడం కష్టంగా అనిపించినా.. ఒకసారి మొదలుపెట్టాక నా భావాలు ఆగకుండా ప్రవహించాయి. నా కుటుంబం గురించి ప్రచారంలో ఉన్న విషయాల్లో చాలా వరకు అవాస్తవాలు, బాధపెట్టే అంశాలే. ఈ నేపథ్యంలో నా భావాలను, కుటుంబం గురించి నిజాలను చెప్పేందుకు ఇదొక మార్గంగా భావించాను. నేను ఎప్పుడూ డైరీ రాయలేదు. పుస్తకంలోని చాలా విషయాలు జ్ఞాపకాల ఆధారంగానే రాశాను' అని సోనియా వివరించారు. 'నా భర్త రాజకీయాల్లోకి రావడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాను. ఎందుకంటే, ఆయనతో మాకు దొరికే కొద్దిపాటి సమయాన్ని కూడా కోల్పోతామని అనుకున్నాను. అనంతరం మా జీవితం పూర్తిగా మారిపోయింది. మా మధ్య బంధం మరింత బలపడింది. రాజీవ్ మరణం తర్వాత నేనొక బిడ్డగా మారిపోయాను. నా పిల్లలు నన్ను తల్లిదండ్రుల మాదిరి చూసుకున్నారు' అని భావోద్వేగంగా చెప్పారు. ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీ తన తల్లి సోనియా గాంధీ గురించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నారు. "నాన్న చనిపోకముందు అమ్మ ఎలా ఉండేదో అనేది ఈ పుస్తకం మీకు తెలియజేస్తుంది. ఆమె నాలుగుసార్లు క్యాన్సర్‌ను జయించారు. ఈ విషయాన్ని ఆమె చాలా తేలికగా చెప్పారు. అయితే మా అమ్మ భయపడటం నేనెప్పుడూ చూడలేదు. ఏ పరిస్థితిలోనూ ఆమె వెనకడుగు వేయడం నేను చూడలేదు. అమ్మ.. నాన్న నిన్ను ఎంతగానో ప్రేమించేవారు. ఇప్పుడు నిన్ను చూస్తే ఆయన ఎంత గర్వపడేవారో మాటల్లో చెప్పలేను" అని రాహుల్ గాంధీ అన్నారు. సోనియా గాంధీ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ , కుమార్తె, ఎంపీ ప్రియాంక గాంధీ సమక్షంలోనే ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తమిళనాడు సిఎం విజయ్, ఝార్ఖండ్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హేమంత్ సోరెన్, దీకే శివకుమార్, సుఖ్వీందర్ సింగ్ సుఖు,తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఉన్నారు. భారత మాజీ ఉపరాష్



గవర్నర్ శుక్లాతో జర్మనీ రాయబారి జాస్పర్ భేటీ

హైదరాబాద్, నవంబరు16,ప్రభాతవార్త:భారతదేశంలోని జర్మనీ రాయబారి డాక్టర్ జాస్పర్ వీక్ సోమవారం లోక్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా భారత్, జర్మనీ దేశాల మధ్య చిరకాలంగా కొనసాగుతున్న సంబంధాలను ఇరువురు ప్రముఖులు ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రంతో జర్మనీ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఆర్థిక, వాణిజ్య, సాంస్కృతిక, విద్యారంగాలతోపాటు ప్రజల మధ్య పరస్పర సంబంధాలను మరింత విస్తరించుకునే అవకాశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

నాంపల్లి కోర్టులో ఆరేళ్ల నాటి కేసుకు ముగింపు

ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామికి ఊరట

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నమోదైన కేసులో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామికి న్యాయ స్థానంలో ఊరట లభించింది. ఆరు సంవత్సరాలుగా నాంపల్లి కోర్టు పరిధిలో విచారణలో ఉన్న ఈ కేసులో సోమవారం నాడు న్యాయ స్థానం తీర్పు వెలువరించింది. కేసులో వెంకటస్వామిని నిర్దోషిగా ప్రకటిస్తూ కేసును కొట్టివేసింది. ఈ కేసులో ఎన్ఎస్‌యుఐ లీగల్ సెల్ కన్వీ నర్ కూర్మ నరేందర్ వెంకటస్వామి తరఫున వాదనలు వినిపించారు. సుదీర్ఘ న్యాయ పోరాటం అనంతరం కోర్టు తీర్పు వెలువడటంతో వెంకటస్వామికి ఊరట లభించింది. ఆరేళ్లగా కొనసాగిన పోరాటానికి తెరపడటంతో ఆయన అనుచరులు, మద్దతుదారులు హర్షం వ్యక్తం చేశారు.

ఐసిసి చైర్మన్ పీఠంపై మళ్లీ జైషా

బాలిలో జరిగిన సమావేశంలో ఐసిసి కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, నవంబరు 16: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) ఛైర్మన్‌గా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన జైషాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ రంగంలో ఆయన సాధించిన విజయం యావత్ భారత దేశానికే ఎంతో గర్వకారణమని కొనియాడారు. మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు. 'నా మిత్రుడు జై షా రెండోసారి ఐసిసి ఛైర్మన్‌గా తిరిగి నియమితులు కావడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఆయన ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అనేది క్రికెట్ ప్రపంచంలో ఆయన సంపాదించుకున్న అపారమైన విశ్వసనీయతను స్పష్టం చేస్తోంది. ఇది భారతదేశానికి గర్వకారణమైన క్షణం. క్రికెట్ క్రీడను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంలో ఆయన సంపూర్ణ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. ఇండోనేషియాలోని బాలి వేదికగా నిర్వహించిన ఐసిసి బోర్డు సమావేశాల్లో సభ్యులంతా కలిసి జైషాను రెండోసారి ఛైర్మన్‌గా ఎన్నుకోవాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఐసిసి చరిత్రలోనే అత్యున్నతమైన ఛైర్మన్ పదవిని చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా జైషా చరిత్ర సృష్టించారు. ఇప్పుడు రెండోసారి కూడా ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా బాధ్యతలు దక్కించుకోవడం ద్వారా గ్లోబల్ క్రికెట్ పరిపాలనలో తనదైన ముద్రను ఆయన మరోసారి చాటుకున్నారు.



జైషా (ఫైల్)



కన్వర్షన్ పద్ధతిలో జిల్లా సాయుధ బలగంలో చేరిన డిచ్‌పల్లి టిఎస్ఎస్పి బెటాలియన్ కానిస్టేబుళ్ల పోలీసు కమిషనర్ సాయిచైతన్యను కలిసిన దృశ్యం

డిచ్‌పల్లి టిఎస్ఎస్పి బెటాలియన్ కానిస్టేబుళ్లు

జిల్లా సాయుధ బలగంలో కన్వర్షన్

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో గల తెలంగాణ ప్రత్యేక పోలీసు (టిఎస్ఎస్పి) ఏడవ బెటాలియన్‌కు చెందిన పది మంది కానిస్టేబుళ్ల జిల్లా సాయుధ బలగంలో కన్వర్షన్ పద్ధతిలో చేరారు. వీరంతా 2013 బ్యాచ్‌కు చెందిన వారు. డిజిపి ఆనంద్ ఆదేశాల మేరకు బెటాలియన్లలో సీనియర్లలో అర్హత కలిగిన వీరిని సాయుధ బలగం లో మార్చారు. ఈ సందర్భంగా సాయుధ బలగంలో చేరిన కానిస్టేబుళ్ల జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్యను సోమవారం నాడు ఆయన కార్యాలయంలో కలిసి మొక్కను అందించారు. ఈ సందర్భం గా కన్వర్షన్ పద్ధతిలో సాయుధ బలగంలో చేరిన కానిస్టేబుళ్లను పోలీస్ కమిషనర్ అభినందించారు. విధుల్లో రాణించాలని ఆయన కోరారు.

కూకట్‌పల్లి జెఎన్టీయులో ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), నవంబరు 16, ప్రభాతవార్త : కూకట్‌పల్లి జెఎన్టియు కళాశాలలో ఇంజినీరింగ్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి భవనంపై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జేఎన్టీయూలోని గౌతం బాయ్స్ హాస్టల్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన విక్రమ్ బాబు (19) బీటెక్ మెకానికల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి గౌతమి హాస్టల్ ఫస్ట్ ఫ్లోర్ రూమ్ నెంబర్ ఎఫ్ 107 లో నివాసం ఉంటున్నాడు. కాగా ఇటీవల జరిగిన సెమిస్టర్ ఎగ్జామ్‌లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. దీంతో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో గౌతమి హాస్టల్ భవనం నాలుగో అంతస్తు నుండి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తోటి విద్యార్థి సంపత్ ద్వారా విషయాలు తెలుసుకున్న తల్లిదండ్రులు సోమవారం జేఎన్టీయూ ఆవరణలో ఆందోళన చేశారు. తన కొడుకు ఆత్మహత్యకు గల కారణాలు తెలియాలని బంధువులు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో జెఎన్టియు ప్రాంగణంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. దీంతో కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు కలుగజేసుకొని తల్లిదండ్రులను విద్యార్థులను సంప్రదించి విద్యార్థి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



విక్రమ్‌బాబు(ఫైల్)

సమ్మక్క సాగర్‌పై వేగం పెంచిన ప్రభుత్వం

నేడు ఛత్తీస్‌గఢ్ సిఎంతో సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ భేటీ

హైదరాబాద్,నవంబరు16,ప్రభాతవార్త: గోదావరిపై తెలంగాణ చేపట్టిన సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు నిరభ్యంతర పత్రం పొందేందుకు ఛత్తీస్ గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్‌ని కలిసేందుకు తెలంగాణ ముఖ్యమంత్ర రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రయత్నం తీవ్రతరం చేశారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు వెనక జలాలతో ఛత్తీస్ గఢ్ లోని బీజాపుర్ జిల్లా భూపాలపట్నం తహసీల్ పరిధిలో స్వల్పంగా ముంపు ఏర్పడనుంది. దీనిపై ఆ రాష్ట్రం అభ్యంతరం (వ్యక్తం చేయడంతో.. సాంకేతిక అనుమతుల మదింపు కమిటీ అనుమతిని సిడబ్ల్యుసినిలిపివేసింది. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఛత్తీస్ గఢ్ రాష్ట్ర రాజధాని రాయపూర్ వెళ్ళనున్నారు. ప్రధానితో భేటీ అనంతర ం ఈ విషయం తెలిపారు. సీఎం, మంత్రి వెంట నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, ఇతర అధికారుల బృందం కూడా రాయ్‌పూర్ వెళ్తారు, ముంపు ప్రభావంపై ఖరగ్‌పూర్ ఐఐటీ నివేదిక కూడా తెప్పించినాఆ రాష్ట్రం నుంచి స్పందన లేకపోవడంతో సిఎం రేవంత్ ఆదివారం ఈ విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. సమ్మక్క సారక్క ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం బ్యాక్‌వాటర్‌గుర్తింపుకు రూ.9.88కోట్లు చెల్లించిన విషయం కూడా ప్రధానికి వివరించారు. ఈసారి జరిగే చర్చలతోనైనా ఎన్‌టిసి విషయం కొలిక్కి వస్తుందా అనేది చూడాల్సి ఉంది. ఎన్‌ఒసి కోసం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రికి పలుసార్లు లేఖలు రాశారు. కొత్తగా ఏర్పాటైన తెలంగాణాలో నీటి లభ్యతను పెంచేందుకు గోదావరిపై 6.7 టిఎంసిల సామర్థంతో సమ్మక్క సాగర్ బ్యారేజీని నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు వెనుక జలాల వల్ల ఛత్తీస్గ గఢ్ కొంత భూభాగం ముంపునకు గురవుతోంది. ముంపు ప్రాంతంలో భూసేకరణ, పరిహారం చెల్లించే విషయంపై ఇప్పటికే మీ ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహించాం. ఈ విషయమై మీ రాష్ట్రం ఎన్‌ఒసి జారీ చేయాల్సి ఉంది. సహకారం ఎంతో అవసరం. మీ రాష్ట్రంలో ఏర్పడుతున్న ముంపునకు పునరావాస చర్యలు, భూ సేకరణ పరిహారం చెల్లింపునకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ అంశాలపై మీతో చర్చించడానికి మంగళవారం లేదా ఈ నెల 19వ తేదీన మాకు సమయం ఇవ్వగలరని ఇటీవల మంత్రి లేఖలో విజ్ఞప్తి చేశారు.

హరీశ్‌రావు అక్రమాలపై నిగ్గు తేల్చాల్సిందే

ప్రజాక్షేత్రంలో కొట్లాడుతూనే.. న్యాయపరమైన దారుల్లోనూ ఫైట్ చేస్తాం

త్వరలోనే భైరవ వాహనంలో రాష్ట్రవ్యాప్తంగా యాత్ర : టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: మాజీ మంత్రి హరీష్ రావు అవినీతిపై నిగ్గు తేల్చాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల మరోసారి డిమాండ్ చేశారు. ఆయన చేసిన అవినీతిపై ప్రజాక్షేత్రంలో కొట్లాడటంతో పాటు చట్టపరంగా, న్యాయపరంగా ఉన్న అన్ని మార్గాల ద్వారా పోరాటం చేస్తామని చెప్పారు. సోమవారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న ఆమె మీడియాతో మాట్లాడారు. హరీష్ రావు అవినీతికి సంబంధించి అన్ని ఆధారాలను సీబీసీఐడీకి, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కు కూడా పంపిస్తామని చెప్పారు. తప్పు చేసిన వారెవరైనా సరే కచ్చితంగా వారికి శిక్ష పడాలన్నదే తమ విధానమన్నారు. అలాగే ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో కరువు పరిస్థితులుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం అత్యంత నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కవిత మండిపడ్డారు. నిన్న ప్రధాని మోడీని కలిసిన ఆయన కనీసం ఈ అంశంపై మాట్లాడకపోవటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. రాష్ట్రంలో కరువు, రైతుల బాధలు, పంటల పరిస్థితిని ప్రధానికి వివరించి సాయం కోరాలన్న సోయి కూడా సీఎం కు లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లు గురించి కూడా ప్రధానితో ప్రస్తావించకపోవటం అన్యాయమని ధ్వజమెత్తారు. ప్రజలకు సంబంధించిన అంశాలను పక్కనపెట్టి కేవలం కాంట్రాక్ట్‌లు, కమీషన్ల గురించి మాట్లా డుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కరువు మండలాలను ప్రకటించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో గానీ, తెలంగాణ వచ్చిన తర్వాత గానీ రైతులను పంటలు వేయవద్దని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అని చెప్పారు. పంటలు వేయకపోతే రైతులకు ఏం పరిహారం ఇస్తారో చెప్పాలన్నారు. ఎకరాకు రూ. 25 వేలు పరిహారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా భైరవ వాహనంలో యాత్ర

తమ పార్టీ ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందాలన్న సంకల్పంతో ఉం దని, అదే విధంగా సామాజిక న్యాయం ప్రతి వర్గానికి అందాలన్నదే తమ అభిమతమని చెప్పారు. పాంచజన్య సంకల్పంలో భాగంగా భైరవ వా హనంలో త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర చేపడతామన్నారు. నిరుద్యోగులను మోసం చేసి కనీసం జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించని కాంగ్రెస్ కు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పాలని కోరారు. ప్రతి పక్షం బీఆర్ఎస్, బీజేపీ లు కాంగ్రెస్ ను ప్రశ్నించకుండా కాలం వెళ్లదీస్తున్నాయని మండి పడ్డారు. ప్రజల్లో చైతన్య శక్తి ని నింపేలా తాము కృషి చేస్తున్నామని గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లువేసి గెలిపించాలని కోరారు. ఇంటర్మీడియేట్ బోర్డును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదని..దానిపై మంగళ వారం పార్టీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని చెప్పారు.

ఎఐ దుర్వినియోగాన్ని నియంత్రించండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మెగాస్టార్ చిరంజీవి వినతి

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: సోషల్ మీడియా, డిజిటల్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఏఐ (తి।) వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. అయితే ఇదే సాంకేతికతను కొందరు దుర్వినియోగం చేస్తూ సెలబ్రిటీల ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేయడం, డీప్‌ఫేక్ కంటెంట్‌ను సృష్టించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వానికి తన వంతుగా విజ్ఞప్తి చేశారు. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన సమావేశంలో ఈ అంశంపై చర్చించిన చిరంజీవి ఆయన సూచన మేరకు సోమవారం కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి వ్యక్తుల గుర్తింపును దుర్వినియోగం చేయడం, నకిలీ వీడియోలు సృష్టించడం చేస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. డీప్‌ఫేక్‌ల ద్వారా వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించడం వంటి సమస్యలపై అందులో ప్రధానంగా ప్రస్తావించారు. ముఖ్యం గా సినీ కళాకా రులు, ఇతర ప్రముఖుల డిజిటల్ గుర్తింపు, వ్యక్తిగత గౌరవం, సృజ నాత్మక హక్కులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సమస్యను కేవలం సినీ పరిశ్రమకు సం బంధించిన అంశం గా కాకుండా, ప్రతి పౌరుడి భద్రతకు సంబంధించిన ము ఖ్యమైన విష యంగా పరిగణించాలని కేంద్రాన్ని కోరారు. ఈ వినతిపత్రం కేంద్ర హోంమంత్రిత్వ శాఖతో పాటు, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ఈ అంశాన్ని ముందుకు తీసు కెళ్తానని హామీ చ్చారు. కళాకారుల గౌరవం, గుర్తింపు, సృజనాత్మక హక్కులను కాపాడ టంతో పాటు, ప్రతి పౌరుడి భద్రతను పరిరక్షి ంచడం అందరి బాధ్యత అని అభిప్రా యపడ్డారు. సాంకే తికత అనేది సృజనాత్మకతను మరింత పెంచేందుకు ఉపయోగ పడాలే తప్ప వ్యక్తుల గౌరవానికి భంగం కలిగించే సాధనంగా మాం ూకూడదని చిరంజీవి స్పష్టం చేశారు.



సోమవారం కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మెగాస్టార్ చిరంజీవి

బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి హైకోర్టు షాక్

వాయిస్ శాంపిల్స్ ఇవ్వాలని ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: బిఆర్ఎస్ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి హైకోర్టు చుక్కెదురయ్యింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను దూషించారనే ఫిర్యాదుతో వీణవంక పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం సోమవారం కొట్టివేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వాయిస్ శాంపిల్ ఇవ్వాలని పోలీసులు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఇరువైపులా వాదనలు విన్న అనంతరం ఈ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చ డంతో పాటు పోలీసు దర్యాప్తులో భాగంగా కౌశిక్‌రెడ్డి వాయిస్ శాంపిల్ ఇవ్వాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. కరీంనగర్ జిల్లా వీణవంకలో జ రిగిన మినీ మేడారం సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా ఈ వివాదం చోటుచేసుకుంది. జాతరకు పరిమిత సంఖ్యలో వాహనాలకు మాత్ర మే అనుమతి ఉంటుందని పోలీసులు సూచించగా, కౌశిక్‌రెడ్డి భారీ కాన్వాయ్‌తో రావడంతో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో కౌశిక్‌రెడ్డి రహ దారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం జరిగిన వాగ్వివాదంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై కౌశిక్‌రెడ్డి మతపరమైన వ్యాఖ్యలు చేయడంతోపాటు విధులకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ వీణవంక పోలీసులు కేసు నమోదు చేశారు.

భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసు విచారణలో భాగం గా ఆయన వాయిస్ శాంపిల్ సే కరించాలని పోలీ సులు నిర్ణయించి కౌశిక్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. అయితే పోలీసులు ఇచ్చిన నోటీసులను పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. తాను పోలీసు కమిషనర్‌ను దూషించలేదని, ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదు చేసి తనపై కేసు నమోదు చేశారని తన పిటిషన్‌లో కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. కౌశిక్‌రెడ్డి పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచా రణ జరగగా ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు లాయర్ తన వాదనలు వినిపిస్తూ కేసు దర్యాప్తులో భాగంగా నిబంధనల ప్రకారమే పోలీసులు వాయిస్ శాంపిల్స్ సేకరించేందుకు నోటీసులు జారీ చేశారని వివరించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో వాయిస్ శాంపిల్ సేకరణకు సంబంధించి పోలీసులు తదుపరి చర్యలు తీసుకునేందుకు మార్గం సుగమమైంది.

తొలిసారి 7 శాతం మార్క్ దాటిన ద్రవ్యోల్బణం

జాతీయ రేటు కంటే 1.17 శాతం పాయింట్లు అధికం

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: రాష్ట్రంలో తొలిసారిగా రిటైల్ ద్రవ్యోల్బణం 7 శాతం మార్కును దాటింది. సెప్టెంబర్ నెలలో 6.64 శాతంగా ఉన్న ఈ ద్రవ్యోల్బణం, అక్టోబర్ చివరి నాటికి 7.26 శాతానికి పెరిగింది. దీంతో 7 శాతం కంటే ఎక్కువ ద్రవ్యోల్బణం నమోదైన కేవలం ఆరు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్ర గణాంకాల శాఖ సోమవారం విడుదల చేసిన తాజా డేటా ప్రకారం తెలంగాణ ద్రవ్యోల్బణం జాతీయ రేటు కంటే 1.17 శాతం పాయింట్లు అధికంగా ఉంది. తమిళనాడులో తెలంగాణ కంటే స్వల్పంగా అధికంగా 7.29 నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 7.25 శాతం, మధ్యప్రదేశ్‌లో 7.19 శాతం, ఒడిశాలో 7.17 శాతం, కర్ణాటకలో 7.07 శాతం నమోదయ్యాయి. గృహాలు సాధారణంగా కొనుగోలు చేసే వస్తువులు, సేవల ధరలు కాలక్రమేణా పెరిగే రేటును రిటైల్ ద్రవ్యోల్బణంగా గుర్తిస్తారు. జనవరి నుండి వరుసగా 10 నెలలుగా తెలంగాణలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు జాతీయ సగటు కంటే స్థిరంగా ఎక్కువగా ఉన్నాయి. తెలంగాణ ద్రవ్యోల్బణం రేటు ఈ ఏడాది జనవరిలో 4.92 శాతం, ఫిబ్రవరిలో 5.02 శాతం, మార్చిలో 5.83 శాతంగా ఉంది.

ఇది ఏప్రిల్‌లో 5.81 శాతానికి, మేలో 6.15 శాతానికి పెరిగి, జూన్లో 6.36 శాతానికి చేరింది. అలాగే జూలైలో 6.32 శాతం ఉండగా, ఆగస్టులో అది 6.27 శాతానికి స్వల్పంగా తగ్గినప్పటికీ, సెప్టెంబర్‌లో మళ్లీ 6.64 శాతానికి, అక్టోబర్‌లో 7.26 శాతానికి పెరిగింది. రాష్ట్రంలో గ్రామీణ పట్టణ వ్యత్యాసం కూడా గణనీయంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో 6.68 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, అక్టోబర్‌లో గ్రామీణ ప్రాంతాల్లో 8.05 శాతంగా నమోదైంది. ఇది గ్రామీణ మార్కెట్లలో ధరల ఒత్తిడి గణనీయంగా ఎక్కువగా ఉందని సూచిస్తోంది. జాతీయ గ్రామీణ ద్రవ్యోల్బణం 6.63 కాగా, గ్రామీణ రేటు దానికంటే రెండు శాతం పాయింట్లకు పైగా ఉంది.

ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువుగా పత్రికా రంగం

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా

పాత్రికేయులకు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్,నవంబరు16,ప్రభాతవార్త: జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా పాత్రికేయులందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షి క, బాధ్యతాయుత జర్నలిజం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని పేర్కొన్నారు.ప్రజల్లో అవగాహన పెంపొందించి, చైతన్యవంతులను చేస్తూ, సమాజంలో జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో పత్రికా రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సమాజానికి దిశానిర్దేశం చేస్తూ, ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువుగా, ప్రజల గొంతుకగా నిలుస్తుందని అన్నారు.ప్రతి నిత్యం అనేక సవాళ్లు, ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ సత్యాన్వేషణలో వెనుకడుగు వేయకుండా, ప్రజా ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ, వాస్తవాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టులందరికీ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

రష్యాపై ఉక్రెయిన్ అతిపెద్ద వైమానిక దాడి

కీవ్, నవంబరు 16: రష్యాపై ఉక్రెయిన్ భారీ స్థాయిలో విరుచుకుపడింది. ఏకంగా 1300లకు పైగా డ్రోన్లను ప్రయోగించింది. 2002లో ఇరుదేశాల మధ్య యుద్ధం మొదలు కీవ్ జరిపిన అతిపెద్ద మైవానిక దాడి ఇదే కావడం గమనార్హం. అయితే ప్రత్యర్థి ప్రయోగించిన డ్రోన్లలో చాలా వాటిని తమ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని రష్యా రక్షణశాఖ తెలిపింది. యుద్ధం ముగింపు విషయంలో అమెరికా మధ్యవర్తిత్వంలో ఇటీవల రెండు దేశాల మధ్య శాంతి చర్చలు విఫలమైన రోజుల వ్యవధిలోనే ఈ దాడులు జరిగాయి. వైమానికి దాడుల్లో భాగంగా రష్యాను క్రిమియాతో అనుసంధానించే, ఐరోపాలోనే అత్యంత పొడవైన వంతెననూ ఉక్రెయిన్ లక్ష్యంగా చేసుకుంది.

కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత జయకృష్ణ కన్నుమూత

ఎక్స్ వేదికగా సిఎం రేవంత్‌రెడ్డి సంతాపం



జయకృష్ణ (ఫైల్)

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బొంరాస్ పేట్ పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ సోమవారం కన్నుమూశారు. జయకృష్ణ మృతికి సిఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా సంతాపం ప్రకటించారు. ఆయన అకాల మరణం బాధాకరం, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు.

టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త:రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు గడువును నవంబర్ 26 వరకు పొడిగించారు. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా నవంబర్ 26 వరకు చెల్లించవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు కె. లింగయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 8 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 12 నుంచి వరకు, రూ.500 ఆలస్య రుసుముతో జనవరి 4 వరకు పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు.

రామప్ప దేవాలయ నమూనా ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌లో ప్రధాన ఆకర్షణ

85వ వార్షిక సమావేశానికి 3,000 మందికిపైగా ప్రతినిధులు

400 ప్రదర్శనశాలలు నవంబరు 18 నుంచి షురూ

హైదరాబాద్, నవంబర్ 16, ప్రభాతవార్త: ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ మందిరం నమూనా ఇండియన్ రోడ్ కాంగ్రెస్ వార్షిక సమావేశం వేదికపై కనపడనున్నది.కాకతీయ రాజు రేచర్ల రుద్రుడు రామప్ప దేవాలయం తేలికైన ఇటుకలు సాండ్ బాక్స్ పునాది అద్భుత వాస్తు,శిల్పకళతోకూడిన శాస్త్రీయ నిర్మాణం చేశారు.13వశతాబ్దంలో నిర్మించిన రామప్ప ఆలయం, సరస్సు తెలంగాణలోని క్లిష్టమైన నీటిపారుదల రంగం దానితో ముడిపడి ఉన్న సాంస్కృతిక ఆధ్యాత్మిక వికాసంను ఆవిష్కరిస్తోంది. రామప్ప శివాలయ ని

వార్త

అభ్యుదయాన్ని సాధించాలి అంటే చరిత్రను పునరావృతం చేయడం కాదు. కొత్త చరిత్రను సృష్టించాలి.

- మహాత్మా గాంధీ

కల్తీని అరికట్టలేమా?

ఎంత పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినా ఆకస్మిక దాడులు ఉధృతం చేస్తున్నా, కేసులు పెడుతున్నా కల్తీ ఆగడం లేదు. ఇక్కడ, అక్కడ అని కాదు. అన్నిట్లో కల్తీమయమైపోతున్నది. తాగే నీటిలో కల్తీ, పాలల్లో కల్తీ, తినే పప్పులో కల్తీ, ఉప్పులో కల్తీ, నూనెలో కల్తీ, కారంలో కల్తీ, విత్తనాల్లో కల్తీ, ఎరువుల్లో కల్తీ, చివరకు ప్రాణాపాయస్థితి నుంచి కాపాడే అత్యవసర మందుల్లో కల్తీ. ఇది అది అని కాదు. ఎక్కడ చూసినా కల్తీమయమైపోతున్నది. రానురాను కల్తీ మనిషి మనుగడకే ప్రమాదం వాటిల్లే సూచనలు కన్పిస్తున్నాయి. కల్తీలు ఇంత ప్రమాదకరంగా తయారవుతున్నా చాపకింద నీరులా వ్యాపిస్తున్నా అడిగేవారు, అడ్డగించేవారు లేకుండాపోవడం అత్యంత బాధాకరం. అసలు కల్తీకి, అవినీతికి అవినాభావ సంబంధాలున్నాయి. ఒకదానిని విడిచిపెట్టి మరొకటి ఉండలేవు. అందుకే పెరుగుతున్న అవినీతికి రెట్టింపుస్థాయిలో కల్తీ జరిగిపోతున్నది. దీనిని అరికట్టేందుకు పాలకులు చర్యలు తీసుకోవడం లేదని చెప్పడం లేదు. పటిష్టమైన చట్టాలుచేశారు. ఆ చట్టాన్ని అమలు చేసి కల్తీ పెరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి అధికారుల మీద అధికారులను నియమిస్తున్నారు. ఆ అధికారులు కానీ, ఈ చట్టాలు కానీ కల్తీని నిరోధించలేకపోతున్నాయి. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసి ఆకస్మిక దాడులు ముమ్మరం చేస్తున్నది. టన్నుల కొద్దీ కల్తీ సరుకులు పట్టుబడుతున్నాయి. అయినా ఆగడం లేదు. ఫలితంగా దేశవ్యాప్తంగా కోట్లాదిమంది తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలవుతుండగా కొందరు శాశ్వత రోగపీడితులవుతున్నారు. ఈసమస్య ఇంత తీవ్ర రూపంలో విలయతాండవం చేస్తున్నా పాలకులు త్రికరణ శుద్ధిగా ఉన్న చట్టాలను అమలు చేసి నిర్దిష్టమైన చర్యలు తీసుకొని పునరావృతం కాకుండా చేయడంలో విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. ఈ కల్తీ ఎక్కడో మూడో కంటికి తెలియకుండా ప్రజలకు చేరుకోవడం లేదు. ఇందులో రహస్యాలు ఏమీ లేవు. పరిశోధించి, రాత్రింబవళ్లు శ్రమించి అటు మాటువేసి పట్టుకోవాల్సిన పని అంతకంటే లేదు. కల్తీ సరుకుల అమ్మకాలు బహిరంగంగానే జరుగుతున్నాయి. పోనీ ఇదేక్కడో మారుమూల ప్రాంతంలో జరగడంలేదు. ఇక్కడా,అక్కడా అని తేడా లేకుండా పట్టణాలు, నగరాల్లో చివరకు రాజధాని కేంద్రాల్లోనూ పెద్ద ఎత్తున జరుగుతున్నది. అమాయక ప్రజలు నిలువుదోపిడీకి గుర వుతున్నారు. ఆర్థికంగా నష్టపోతేపోయారు. కానీ ఆరోగ్యాన్ని కోల్పోతున్నారు. క్షయ, కేన్సర్, కిడ్నీ, లాంటి భయం కర రోగాలకు కూడా గురై కోలుకోలేక ఏళ్లతరబడి మంచా నికి అంకింతమై కృంగికృశించి అసువులు బాస్తున్నారు. ఇది రానురాను పెరగడం ఆందోళన కలిగించే అంశం. పసిపిల్లలకు పాలే దివ్వ ఔషదం. పిల్లలే కాదు వయో వృద్ధుల వరకు ఏదో ఒకరూపంలో పాలను ఉపయోగిం చుకుంటూనే ఉంటారు. అలాంటి పాలను కొందరు వ్యాపా రులు పశువుల్లో కృత్రిమంగా పాల ఉత్పత్తిని పెంచేందుకు అత్యంత ప్రమాదకరమైన ఆక్సోడోసిన్ ఇంజక్షన్‌ను విచ్చల విడిగా వాడుతున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా తెప్పించి ఒక ముఠా పాల ఉత్పత్తి దారులకు సరఫరా చేస్తున్న వైనం దేశంలో ఎన్నోసార్లు వెలుగుచూసింది. ఈ ఇంజక్షన్‌లు చేయడం వల్ల పాడి పశువులు, సహజంగాఇచ్చే పాలకంటే రెండు, మూడు రెట్లు ఎక్కువగా ఇస్తాయని అంటున్నారు. ఈ ఇంజక్షన్ ఇచ్చిన పాడిపశువుల పాలు తాగడంవల్ల హార్మోన్ల సమతుల్యం దెబ్బతింటుందని, చిన్నతనంలోనే మోకాళ్ల సమస్యలు తదితర శారీరక రుగ్మతలు సంభవించే అవకాశాలున్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు.నూనె కల్తీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదేమో. నూనేకాదు పప్పుదినుసులతోపాటు నిత్యావసర వస్తువుల్లో కూడా కల్తీ భారీ స్థాయిలోనే జరుగుతున్నది. నిరుపేద నుంచి కోటీశ్వర్లు వరకు నిత్యంవాడే కాఫీపొడుల్లో కూడా భారీఎత్తున కల్తీ జరుగుతున్నట్లు తెలుస్తున్నది. దేశవ్యాప్తంగా దాదాపు యాభైకోట్ల కిలోలకుపైగా టీపొడివాడుతున్నట్లు అంచనా. కొన్ని ప్రాంతాల్లో జీడిమామిడికాయల పైపొరతోపాటు ఆకులను ఎండబెట్టి, పొడిచేసికలుపుతుంటే మరికొన్ని ప్రాంతాల్లో తూకం ఎక్కువ రావడానికి ఏకంగా ఇనుప రజనునే కలుపుతున్నారు. ఇంకొన్ని ప్రాంతాల్లో హోటళ్లలో వాడేసిన టీ పొడిని సేకరించి అందులో కొత్త పొడిని మరికొంత కలిపి ఇనుపరజనును జోడించి అమ్ము కుంటున్న సంఘటనలు కూడా బయటపడుతున్నాయి. ఇవేమీ కొత్త విషయాలు కాదు. తరచుగా అధికారుల దాడుల్లో బయట పడుతూనే ఉన్నాయి. ఇలాంటివి వాడితే తొలి దశలో అజీర్ణ సమస్యతో ప్రారంభమై క్రమంగా అల్సర్‌గా మారి తుది దశలో కేన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని డాక్టర్లే చెబుతున్నారు. మందుల విషయంలో చెప్పాల్సినపనిలేదు. భారీ ఎత్తున కల్తీ,నాసిరకం మందులు వినియోగంలో ఉన్నాయి. రోగులకు తెలిసే అవకాశంలేదు. చివరకు ప్రాణభిక్ష పెట్టే మందులు కాస్త అటు, ఇటు అయినా ప్రాణాలను కబళిస్తాయి. ఇది తెలియంది కాదు. అయినా వీటి విషయంలో నిర్దిష్టమైన చర్యలు తీసుకొని కల్తీ మందులను ఏరివేసి బాధ్యులపై చర్యలు తీసుకోలేకపోతున్నారు. పెట్రోలు, డీజిల్ లాంటి వాటిల్లో కూడా కల్తీ భారీగానే జరుగుతున్నది. దీంతో వాయుకాలుష్యం పెరిగి ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. అయితే కల్తీని అరికట్టేందుకు గతంలో కొన్ని ప్రయత్నాలుజరిగాయి. కానీ అవేమీ ఫలితాలు ఇవ్వలేకపోయాయి. కల్తీపై యుద్ధం చేయాలంటే అంత తేలికైన పనికాదు. ఈ బాధ్యత పాలకులపైనే వదిలిపెట్టకుండా స్వచ్ఛందసంస్థలు, ప్రజాస్వామ్య వాదులు, అందరూ కలిసికట్టుగా త్రికరణశుద్ధిగా ముందుకు వస్తే తప్ప ఈ కల్తీని అరికట్టడం సాధ్యంకాదు.

గ్రామ స్వరాజ్యాన్ని వేలం పెట్టడం ధర్మమా?

ప్రజలకు కూడా ఓటు విలువ,స్థానిక సంస్థల అధికారాలు, అవినీతి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి. అంతకంటే ముఖ్యంగా రాజకీయ పార్టీలు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. డబ్బు ఖర్చుచేయగలిగిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నామా? ప్రజాసేవలో అనుభవం, నిజాయితీ, సామాజిక బాధ్యత ఉన్నవారికి అవకాశాలు కల్పిస్తున్నామా? అనే ప్రశ్నలను తమకు తామే వేసుకోవాలి. గ్రామ పంచాయతీ ఎన్నికలు అనేవి కేవలం సర్పంచ్ కుర్చీ కోసం జరిగే పోటీలు కావు. అవి గ్రామ భవిష్యత్తును నిర్ణయించే ప్రజాస్వామ్య ప్రక్రియ. గ్రామానికి మంచి నాయకుడు కావాలి కానీ, పదవిని కొనుగోలు చేసిన వ్యాపారి కాదు. ప్రజల సమస్యలు అర్థం చేసుకునే సేవకుడు కావాలి కానీ, పెట్టుబడికి లాభాలు ఆశించే అధికారి కాదు.ఈసత్యాన్ని ఓటర్లు,అభ్యర్థులు, రాజకీయపార్టీలు గుర్తించినప్పుడే పంచాయతీరాజ్ వ్యవస్థకు నిజమైన గౌరవం లభిస్తుంది.



డాక్టర్ ఎన్. బి. సుధాకర్ రెడ్డి

స్వ చేయాల్సిన పదవులకు ధరలుకడితే ప్రజాస్వామ్యానికి అర్థమేమిటి? గ్రామాభివృద్ధికి దారి చూపాల్సిన సర్పంచ్ పదవి వ్యాపార వస్తువుగా మారితే పల్లె ప్రగతి ఎలా సాధ్యం? ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో సర్పంచ్ పదవులకు వేలం పాటలు నిర్వహిస్తున్నారన్న వార్తలు ప్రజాస్వామ్య విలువలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.రూ. 20 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు పదవులకు ధర పలుకుతున్నట్లు, ఒక గ్రామంలో చెరువు తవ్వకం కోసం రెండెకరాల భూమి ఇవ్వడానికి కూడా సిద్ధపడినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పరిణామాలు నిజమైతే, గ్రామపాలన ఏదిశగా పయనిస్తోందో ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. సర్పంచ్ పదవి సేవా బాధ్యతా? సంపాదనకు పెట్టుబడా? గ్రామంలో సర్పంచ్‌గా ఎన్నిక కావడానికి అయ్యే ఖర్చు, ఓటర్ల సంఖ్య, గ్రామ పంచాయతీకి వచ్చే నిధులు, స్థానికంగా ఉండే ఆర్థిక ప్రయోజనాలను బట్టి పదవికి ధర నిర్ణయిస్తున్నారన్న ప్రచారం ఆందోళన కలిగిస్తోంది. ఎన్నికల్లో పోటీ చేస్తే ఓటుకు రూ.1,000 నుంచి రూ.2,000 వరకు పంచాల్సి వస్తుందని, అంత ఖర్చుచేసినా గెలుపు గ్యారంటీ లేదనే భావనతో కొందరు వేలం మార్గాన్ని ఎంచుకుంటున్నారని తెలుస్తోంది. అయితే ఇక్కడమనం గుర్తించాల్సినఅసలు విషయం ఒకటుంది. ఎన్నికల ఖర్చు తగ్గించుకోవాలనే ఆలోచనతో వేలం నిర్వహించడం ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం కాదు. ఓటర్లందరి హక్కును కొంతమంది వ్యక్తులు కలిసి నిర్ణయించుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. గ్రామంలోని ప్రతి ఓటరుకు తన ప్రతినిధిని ఎన్నుకునే హక్కు ఉంది. ఆ హక్కును గ్రామ పెద్దలు, ధనవంతులు లేదా ఆశావహులు తమ నిర్ణయంతో భర్తీ చేయలేరు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఇదేనా?మహాత్మా గాంధీజీ గ్రామ స్వరాజ్యాన్ని భారత ప్రజాస్వామ్యానికి పునాదిగా భావించారు. గ్రామాలు స్వయం సమృద్ధి సాధించి, ప్రజలు తమ సమస్యలను తామే పరిష్కరించుకుంటూ, స్థానిక పాలనలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఆ ఆలోచనలకు అనుగుణంగానే దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతమైంది. రాజ్యాంగంలోని 73వ సవరణ ద్వారా గ్రామీణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ బద్ధమైన గుర్తింపు లభించింది. పంచాయతీ అంటే కేవలం ఒక గ్రామానికి ప్రాతినిధ్యం వహించే పదవి కాదు. తాగునీరు, పారిశుద్ధం, అంతర్గత రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ, పర్యావరణ పరిరక్షణ వంటి మౌలిక అవసరాలను తీర్చే స్థానిక పాలనా వ్యవస్థ. గ్రామీణాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ పథకాల కింద నిధులు వస్తాయి. ఆ నిధులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉపయోగపడాలి. అటువంటి బాధ్యతాయుతమైన పదవికి వేలం వేయడం అంటే గ్రామ ప్రజల భవిష్యత్తుకే ధర నిర్ణయించడం కాదా? గ్రామ స్వరాజ్యం అంటే ప్రజల చేతుల్లో అధికారం ఉండటం. కానీ వేలం విధానంలో అధికారం డబ్బున్నవారి చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఇది గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్యానికి పూర్తి విరుద్ధం. సర్పంచ్ పదవికి లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి ఎవరైనా సిద్ధపడుతున్నారంటే, ఆ మొత్తాన్ని తిరిగి సంపాదించుకోవచ్చనే ఆశ వారికి ఉన్నదాఅన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. అయితే ప్రతి అభ్యర్థి అవినీతికే పాల్పడతారని చెప్పలేం. కొందరు నిజమైన సేవాభావంతోనూ ఖర్చు చేయవచ్చు. కానీ పదవిని ఒక



వ్యాపార పెట్టుబడిగా చూసే ధోరణి పెరిగితే మాత్రం ప్రజా ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం తీవ్రంగా ఉంటుంది. గ్రామ పంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధి పనుల కేటాయింపు, పనుల నాణ్యత, స్థానిక పన్నులు, భవన నిర్మాణ అనుమతులు వంటి అంశాల్లో సర్పంచ్ పాత్ర కీలకం. చట్టబద్ధమైన అధికారాలు, విధివిధానాలకు లోబడి నిర్ణయాలు తీసుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉంటుంది. కొన్ని వ్యవహారాల్లో సర్పంచ్ సంతకం, పంచాయతీ తీర్మానం కీలకంగా ఉండటంతో పదవికి ఆర్థికవిలువ కట్టే ధోరణి మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే సర్పంచ్ పదవికి ఎన్నిక కావడం వల్ల పెట్టిన ఖర్చుకు నాలుగింతలు సంపాదించుకోవచ్చనే భావన ఉంటే, ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? ప్రజలకోసం ఖర్చుచేయాల్సిన నిధులు, అభివృద్ధి పనుల నాణ్యత, ప్రభుత్వ ఆస్తులు, స్థానిక ప్రజల ప్రయోజనాలు ఈ అక్రమ సంపాదనకు బలవుతాయా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ప్రజాధనాన్ని వ్యక్తిగత లాభంగా మార్చుకునే ఆలోచనతో పదవిలోకి వస్తే, గ్రామాభివృద్ధి వెనుకబడటమే కాకుండా ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం కూడా తగ్గుతుంది. వేలంలో గెలిచిన వ్యక్తి గ్రామానికి కొంత డబ్బు ఇస్తాడని, చెరువు తవ్విస్తాడని లేదా ఇతర అభివృద్ధి పనులు చేపడతాడని కొందరు సమర్థించవచ్చు. గ్రామానికి తక్షణ ప్రయోజనం కలిగేలా కనిపించినా, దీర్ఘకాలంలో ఇది నిజమైన ప్రజాస్వామ్య పరిష్కారం కాదు. ఒక గ్రామంలో సర్పంచ్ పదవికి కోటి రూపాయలు చెల్లించిన వ్యక్తి, ఆ మొత్తాన్ని తిరిగి సంపాదించుకోవాలనే ఒత్తిడికి లోనైతే ఏమవుతుంది? గ్రామాభివృద్ధి పనుల్లో పారదర్శకతకు బదులుగా వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం పెరిగితే పరిస్థితి ఏమిటి? పదవి కొనలేని సామాన్యుడు, నిజాయితీగల సేవకుడు ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితి వస్తే ప్రజాస్వామ్యంలో సమాన అవకాశాలకు చోటెక్కడుంది? గ్రామానికి విరాళం ఇవ్వాలనుకుంటే ఇవ్వవచ్చు. చెరువు తవ్వించాలనుకుంటే చట్టబద్ధమైన అనుమతులతో చేవట్టవచ్చు. పేదలకు సహాయం చేయాలనుకుంటే చేయవచ్చు. కానీ ఆ సేవలను ప్రజల ఓటుహక్కుతో ముడిపెట్టడం సమర్థనీయం కాదు. దానం వేరు, ప్రజాస్వామ్యాన్ని కొనుగోలు చేయడం వేరు. ఓటు అమ్ముడుపోతే ప్రశ్నించే హక్కు బలహీనపడుతుంది. ఎన్నికల సమయంలో డబ్బు తీసుకొని ఓటు వేయడం ద్వారా తాత్కాలికంగా కొంత ప్రయోజనం పొందవచ్చేమో కానీ, ఐదేళ్ల పాలనపై ప్రశ్నించే నైతిక బలం తగ్గే ప్రమాదం ఉంది. డబ్బు తీసుకున్నందుకు కృతజ్ఞతతో ఉండాలనే ఒత్తిడి ఓటరిపై ఏర్పడవచ్చు. అభివృద్ధి జరగకపోయినా, అవినీతి జరిగినా నిలదీయడానికి కొందరు వెనుకాడవచ్చు. ఓటు అనేది అమ్ముకునే వస్తువు కాదు. అది ప్రజాస్వామ్యంలో పౌరుడికి లభించిన అత్యంత విలువైన హక్కు. ఒక ఓటు గ్రామ భవిష్యత్తును మార్చగలదు. సమర్థుడైన, నిజాయితీగల నాయకుడిని ఎన్నుకుంటే గ్రామానికి ఐదేళ్ల పాటు మేలు జరగవచ్చు. డబ్బు తీసుకొని అనర్హుడిని ఎన్నుకుంటే ఆ నష్టం గ్రామమంతా భరించాల్సి రావచ్చు. ప్రభుత్వం, ఎన్నికల యంత్రాంగం ఏం చేయాలి? గ్రామాల్లో సర్పంచ్ పదవుల వేలం జరుగుతున్నట్లు సమాచారం వస్తే అధికారులు వాటిని తేలికగా తీసుకోకూడదు. నిజానిజాలను నిర్ధారించి, వర్తించే ఎన్నికల చట్టాలు, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఓటర్లను ప్రలోభపెట్టడం, డబ్బు పంపిణీ, అక్రమ ఒప్పందాలపై నిఘాపెంచాలి. గ్రామసభల ప్రాధాన్యాన్ని పెంచుతూ, పంచాయతీ నిధుల వినియోగంలో సామాజిక తనిఖీలు, పారదర్శకత, ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలి.అలాగే ఎన్నికల ఖర్చుపై చట్టబద్ధమైన పర్యవేక్షణ ఉండాలి. అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను నిబంధనలకు అనుగుణంగా వెల్లడించేలా చూడాలి. ప్రజలకు కూడా ఓటు విలువ,స్థానిక సంస్థల అధికారాలు, అవినీతి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి. అంతకంటే ముఖ్యంగా రాజకీయ పార్టీలు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. డబ్బుఖర్చు చేయగలిగిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నామా? ప్రజాసేవలో అనుభవం, నిజాయితీ, సామాజిక బాధ్యత ఉన్నవారికి అవకాశాలు కల్పిస్తున్నామా? అనే ప్రశ్నలను తమకు తామే వేసుకోవాలి. గ్రామ పంచాయతీ ఎన్నికలు అనేవి కేవలం సర్పంచ్ కుర్చీ కోసం జరిగే పోటీలు కావు. అవి గ్రామ భవిష్యత్తును నిర్ణయించే ప్రజాస్వామ్య ప్రక్రియ. గ్రామానికి మంచి నాయకుడు కావాలి కానీ, పదవిని కొనుగోలు చేసిన వ్యాపారి కాదు. ప్రజల సమస్యలు అర్థం చేసుకునే సేవకుడు కావాలి కానీ, పెట్టుబడికి లాభాలు ఆశించే అధికారికాదు.ఈసత్యాన్ని ఓటర్లు,అభ్యర్థులు, రాజకీయపార్టీలు గుర్తించినప్పుడే పంచాయతీరాజ్ వ్యవస్థకు నిజమైన గౌరవం లభిస్తుంది. ●

అడవి తరుగుదలతో అడవి బిడ్డలు విలవిల

తూలుగు రమణారావు

పర్యావరణ సమతుల్యతకు ,జీవకోటి మనుగడకు అడవులే మూలాధారం.కానీ నేడు స్వార్థపూరిత మానవ చర్యల వల్ల అడవి తల్లి కన్నీరు పెడుతోంది. పారిశ్రామికీకరణ,మితిమీరిన గిరిజనేతరుల జోక్యం,అడవుల నరికివేత వల్ల దేశంలో అటవీ విస్తీర్ణంఆందోళనకరంగా మారుతోంది. ఇది కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు,అడవిని నమ్ముకుని,దానినే తమ సర్వస్వంగా భావించి జీవిస్తున్న కోట్ల మంది గిరిజన బిడ్డల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న సామాజిక సంక్షోభం. భారత ప్రభుత్వ నివేదికల (ఐఎస్ఎఫ్ఆర్ 2023)ప్రకారం దేశంలో మొత్తం అటవీ విస్తీర్ణం 21.76 శాతం మాత్రమే ఉంది.చెట్లతో కూడిన ప్రాంతాన్ని కూడా కలిపితే ఇది 25.17 శాతం అవుతుంది. పర్యావరణ సమతుల్యత కోసం ఒక దేశంలో కనీసం 33 శాతం అడవులు ఉండాలనేది అంతర్జాతీయ ప్రామాణికం. ఆ లక్ష్యానికి మనం ఇంకా చాలాదూరంలో ఉన్నాం. మరోవైపు, 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో గిరిజన జనాభా(షెడ్యూల్డ్ తెగలు)మొత్తం జనాభాలో 8.6 (సుమారు 10.4 కోట్లు). వీరిలో 50 శాతం కంటే ఎక్కువ మంది నేరుగా అటవీ ప్రాంతాలలో లేదా వాటి పరిసర గ్రామాల్లో నివసిస్తున్నారు. అటవీ సర్వేల ప్రకారం భారతదేశంలో దాదాపు 30కోట్ల మంది ప్రజలు తమ జీవనోపాధి కోసం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అడవుల పైనే ఆధారపడుతున్నారు. మైదాన ప్రాంతాల నుంచి గిరిజనేతరులు అడవుల్లోకి చొరబడి భూములను ఆక్రమించడం,కలప కోసం చెట్లను విచక్షణారహితంగా నరికివేయడం అడవుల క్షీణతకు ప్రధాన కారణాలు. ఖనిజ సంపద కోసం అడవుల గుండెను తవ్వేయడం,పెద్ద పెద్ద ప్రాజెక్టుల వల్ల అడవులు అంతరించిపోతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ కారణంగా వర్షపాతంలో తీవ్రమైన మార్పులు వస్తున్నాయి. సకాలంలో వర్షాలు పడకపోవడం వల్ల అటవీ పునరుత్పత్తి మందగించి,అడవులు పొడిబారి ల్యాండ్ స్లైడ్స్, కార్చిచ్చులకు కారణమవుతున్నాయి. గిరిజనులు అడవి నుంచి లభించే చిన్నతరహా అటవీ ఉత్పత్తులు అంటే తేనె, జిగురు,కరక్కాయలు,టేకు ఆకులు,గింజలు,లక్క వంటి వాటిని సేకరించి అమ్ముకోవడం ద్వారానే గిరిజన కుటుంబాల వార్షిక ఆదాయంలో40శాతం నుండి 60శాతం సమకూరుతుంది. ముఖ్యంగా గిరిజన మహిళల ఆర్థిక బలం దీనిపైనే ఆధారపడి ఉంది. నేడు అడవులు తరిగిపోవడం, అటవీ చట్టాల కఠినత, అధికారుల వేధింపుల వల్ల అడవి ఉత్పత్తుల సేకరణ కష్టతరమైంది. దీనివల్ల వారి జీవన ప్రమాణాలు పడిపోయి, పోషకాహార లోపం,నిరక్షరాస్యత, వలసల వంటి సమస్యల వలయంలో గిరిజన జాతులు చిక్కుకుపోతున్నారు. భారత దేశ చరిత్రలో అడవుల రక్షణ కోసం,తమ హక్కుల కోసం గిరిజనులు చేసిన త్యాగాలు వెలకట్టలేనివి.అడవి లేకపోతే గిరిజనుడు లేడు,గిరిజనుడు లేకపోతే అడవి మనుగడ సాధ్యంకాదు.ఈ రెండు విడదీయరాని బంధాలు.అడవి తల్లిని కాపాడుకోవడంలో గిరిజనుల పాత్రను గుర్తించి, వారిని వేధించడం ఆపి, అడవిపై వారికే ప్రథమహక్కు కల్పించినప్పుడే పర్యావరణం పచ్చగా ఉంటుంది.అడవుల సంరక్షణ కేవలం ఒక ప్రభుత్వబాధ్యత కాదు,సమాజమంతా గిరిజనుల త్యాగాలను గౌరవిస్తూ అడవుల రక్షణకు నడుం బిగించాలి. ●

> సహవాసాల ద్వారా అవినీతికి పాల్పడే అవకాశం ఉన్నప్పే, పుస్తకాల ద్వారా కూడా ఉంది.
>
> హెన్రీ ఫీల్డింగ్



> అంతరాత్మ నీకు మంచి స్నేహితుడు. కావున తరచుగా తన మాట వినవలసిందే!
>
> ఫ్రాన్సిస్ బేకన్



ప్రజావాక్కు



పెరుగుతున్న దేశద్రోహులు

'ఎంతా వారలయినా కాంతా దాసులే' అనే త్యాగరాజ కీర్తన నుంచి సినిమా పాటలైన 'ఆడదాని ఓర చూపుకు జగాన ఓడిపోని ధీరులెవ్వరు' 'ఎంత వారు గాని వేదాంతులైనగాని ఓరచూపు సోకగానే సోలిపోదురు'వరకు స్త్రీలకు లొంగి భారత సైన్యంలో కొందరితోబాటు గతంలో మైక్రోసాఫ్ట్ బిల్‌గేట్స్,ఇప్పుడు ఎన్విడియాసీఈవో జెన్సన్ హువాంగ్ తమ స్టేటస్‌ను చెడగొట్టుకున్నారు. మరికొందరు ఇన్ స్టాగ్రామ్‌ల ద్వారా పరిచయమైన యువతులు అత్యంత ప్రేమను ఒలకబోస్తూ, వయ్యారాలు చూపిస్తూ మగవారినుంచికోట్లను దోచుకుంటున్నారు.ఎందరో మోసపోయిన వారి విషయాలు పేపర్లలో ప్రచురించినా బుద్ధి తెచ్చుకోవడం లేదు. అలాగే డిజిటల్ అరిస్టులనేవి పచ్చి మోసమని అన్ని మీడియాల ద్వారా నిత్యం ప్రకటిస్తున్నా సైబర్‌నేరస్తులు భయపెట్టే మాటలకు కలవరపడిడబ్బులు వృధాగా పోగొట్టుకుంటున్నారు. వీరి దేశద్రోహులకింద జమకట్టి వారిని ఉరిబంకంఎక్కించాలి.

- డా. ఎన్.ఎస్.ఆర్.మూర్తి, సికింద్రాబాద్

లీజు భూములను స్వాధీనం చేసుకోవాలి

బ్రిటీష్ పాలనలో వందలాది ఎకరాలభూమి కొన్ని సంస్థలకు 99 సంవత్సరాలకు లీజుకు ఇచ్చింది.గడువు తీరిన తర్వాత కొంతమంది ఆభూములను అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం అమ్ముకునే హక్కు వారికి ఇవ్వలేదు.ఇప్పుడు గడువు తీరిన తర్వాత కొంతమంది అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం దీనిమీద స్పందించాలి.ఉదాహరణకు ఈరోజు ప్రభుత్వం కొన్ని సంస్థలకు పరిశ్రమలు పెట్టుకోవటానికి ఎకరా రూపాయి లెక్కన ఇస్తుంది.వాటివలన ప్రభుత్వానికి పన్నుల రూపేణ కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది.గడువు తీరిన తర్వాత ఆ భూమి ప్రభుత్వానిది అవుతుంది. అ భూములను అమ్ముకునే హక్కులేదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

గోపాల మిత్రులను తొలగించాలి

పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న గోపాలమిత్ర వారికి ఇచ్చే వేతనాలు వృధా అవుతున్నాయి.రాష్ట్రంలో పశువుల సంఖ్య చాలాతగ్గింది. పశువుల సంఖ్య తగ్గడం వలన పశువులకు సేవ చేయడం,వైద్యం చేయడం లేనందునగోపాలమిత్రలను తొలగించవలసిన అవసరం ఉంది. వారి సేవలను నిలిపివేయాలి.వారికి ఇచ్చే నెలనెల గౌరవ వేతనం ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతుంది.

-కదురు శ్రీనివాస్,వరంగల్

ఉపాధి అవకాశాలను చూపాలి

ఈమధ్య ప్రధానమంత్రి నరేంద్రమోడిగారుమనకు స్వాతంత్ర్యం వచ్చిన వందో సంవత్సరానికి అంటే 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశం అయ్యేవిధంగా డెడ్ లైన్ విధించడంజరిగిందని చెప్పారు.అంటేఇంకా రెండు దశాబ్దాలు గడవాలి.70-75 దాటిన ఇప్పటి నాయకులు అప్పటికి వరకు జీవించరు.ఇప్పుడు తయారుచేసుకున్న ప్రణాళికలు తరువాతి ప్రభుత్వాలు అనుసరిస్తాయా అన్నది అనుమానమే. అభివృద్ధి అంటే ముఖ్యంగా రాజకీయ పార్టీలలో సఖ్యత ఉండాలి. చట్ట సభలలోఆరోగ్యకరమైన చర్చలుజరగాలి.కొండలా పెరిగిపోతున్న లంచాలు రూపుమాపాలి. సైబర్ నేరాలను వ్రేళ్ళతో పెరికి వేయాలి.బీదరికంపోవాలి. ఉచితాలను ఉపసంహరించి ఉపాధి అవకాశాలను చూపాలి. నిరుద్యోగ సమస్య సమసిపోవాలి.ప్రజలలో స్వార్థచింతననశించి సామరస్యం పెరగాలి. ఇవన్నీ సామాజిక పరమైనవి.వీటిని ముందుగా చక్కదిద్ది నట్లయితేనే అభివృద్ధికి బాటలు వేయగలం.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

వర్ధిల్లుతున్న ధనస్వామ్యం

రెండున్నర సంత్సరాల కిందట దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక పార్లమెంట్ ఎన్నికలలో మిగతారాష్ట్రాలలో ఎలా ఉన్నప్పటికీ రెండుతెలుగు రాష్ట్రాలలో ఒక్కొక్కఎంపిఅభ్యర్థికి సరాసరిన వంద కోట్లు ఖర్చు అయింది. ఆంధ్రప్రదేశ్‌లో యంపి, ఎన్నికలలో పాటు ఎమ్మెల్యేలుఎన్నికలు కూడా జరగడంతో కొన్ని రాజకీయపార్టీలు ఏరి,కోరి అతి పెద్ద ధనకామాందులకు ప్రముఖ పారిశ్రామికవేత్తలకు కొంతమంది యన్.ఆర్.ఐలకు యం.పి టికెట్లుఇచ్చాయి. ఆ యం.పిఅభ్యర్థి తన పార్లమెంట్ నియోజకవర్గంలో కొంతమంది ఎమ్మెల్యే అభ్యర్థులకు ఖర్చు పెట్టే విధంగా రాజకీయ పార్టీలు ఒప్పందం చేసుకున్నాయి.

- తిప్పినేని రామదాసప్ప నాయుడు, విజయవాడ

ఎన్నో అనుమానాలు

ఎన్నికలలో జరుగుతున్నఅక్రమాలపై కాంగ్రెస్ దాని మిత్ర పక్షాలు ఆందోళనలను చేస్తున్నాయి. బిజెపి ఓట్ చోరీ చేస్తూ రాష్ట్రాలలో గెలుపుసాధిస్తోందని దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ప్రచారకార్యక్రమాలు నిర్వహిస్త

బిల్కిస్ బానో కేసులో కీలక మలుపు



ఇద్దరు దోషులకు జీవిత ఖైదు నిలిపివేత

అపరాధుల విడుదలకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 16(ప్రభావార్త): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో సామూహిక అత్యాచార కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఇద్దరు దోషులకు విధించిన జీవిత ఖైదును సుప్రీంకోర్టు నిలిపివేసింది. వారికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో దోషులైన బిపిన్‌చంద్ జోషి, ప్రదీప్ రామన్‌లాల్ 17 ఏళ్లకుపైగా జైల్లో ఉన్నారని.. వారిలో ఒకరు తీవ్రమైన శారీరక వైకల్యంతో బాధపడుతున్నారని కోర్టు ఈ సందర్భంగా పేర్కొంది. వారిని వెంటనే విడుదల చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

ఈ కేసులో తమకు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను సమర్థిస్తూ బాంబే హైకోర్టు 2017లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దోషులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తమ శిక్షను నిలిపివేయాలని అభ్యర్థించారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఇద్దరు దోషులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. వారి అరెస్టుకు దారితీసిన పరిస్థితులు, సుదీర్ఘకాలం జైలులో గడిపిన కాలాన్ని పరిగణనలోకి తీసుకొని తీర్పు ఇచ్చింది.

ప్రభుత్వ ఉత్తర్వులు కొట్టివేత...

2022 ఆగస్టులో గుజరాత్ ప్రభుత్వం సత్ప్రవర్తన కారణం చూపి ఈ కేసులో 11 మంది దోషులను ముందస్తుగా విడుదల చేసింది. వారిలో బిపిన్‌చంద్ జోషి, ప్రదీప్ రామన్‌లాల్ కూడా ఉన్నారు. అయితే దోషుల విడుదలపై అప్పట్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఏర్పడడంతో ప్రభుత్వ ఉత్తర్వులను పలువురు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దానిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. దోషులకు శిక్ష నుంచి ఉపశమనం కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని స్పష్టం చేసింది. గుజరాత్ ప్రభుత్వ క్షమాభిక్ష ఉత్తర్వులను 2024 జనవరిలోనే కొట్టివేసి ... 11 మంది దోషులను తిరిగి జైల్లో పెట్టాలని ఆదేశించింది. 2002 గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం జరగ్గా.. మూడేళ్ల కుమార్తెతో సహా ఆమె కుటుంబంలోని ఏడుగురు హత్యకు గురయ్యారు.

ఆసియా దేశాల వ్యూహాత్మక సహకారం

ఆసియాన్ సదస్సు కోసం మనీలా చేరిన ప్రధాని మోడీ

సముద్ర భద్రతా సహకారంపై విస్తృత చర్చలు

భారత్, ఆసియాన్ సంబంధాలపై ఫోకస్

నేడు ట్రంప్‌తో భేటీకి అవకాశం

మనీలా, నవంబరు 16(ప్రభావార్త): ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగే వార్షిక భారత్ ఆసియాన్ సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం నుంచి రెండు రోజుల పర్యటన ప్రారంభించారు. ఈ పర్యటన ప్రధానంగా సముద్ర భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడం, ఆసియాన్ సభ్య దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం లక్ష్యంగా సాగనుంది. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ ఫిలిప్పీన్స్ ఆతిథ్యమిస్తున్న 21వ ఈస్ట్ ఆసియా సమ్మిట్ (ఇఎఎస్)లో కూడా పాల్గొననున్నారు.23వ భారత్ఆసియాన్ సదస్సు ప్రధాన అజెండా విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎమ్ఇఎ) గతంలో విడుదల చేసిన ప్రకటన ప్రకారం, 23వ భారత్ ఆసియాన్ సదస్సులో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం అమలులో ఇప్పటివరకు సాధించిన పురోగతిని సభ్య దేశాలు సమీక్షించనున్నాయి. ఆసియన్ ఇండియా ప్లాన్‌ఆఫ్ యాక్షన్2026-2030 అమలుపై కూడా చర్చలు జరగనున్నాయి. భవిష్యత్తులో భారత్ఆసియాన్ సహకారాన్ని ఏ దిశగా తీసుకెళ్లాలనే అంశంపై ఈ సమావేశం కీలక నిర్ణయాలకు వేదిక కానున్నది.

మోడీ పర్యటనకు మరింత ప్రాధాన్యం

2026 సంవత్సరాన్ని ఆసియన్ ఇండియా ఇయర్ ఆఫ్ మారిటైమ్ కోపరేషన్‌గా జరుపుకుంటున్న నేపథ్యంలో ప్రధాని మోడీ పర్యటనకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. అలాగే 2027లో భారత్-ఆసియాన్ మధ్య 35 ఏళ్ల సంభాషణ సంబంధాలు, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఐదు సంవత్సరాలు పూర్తికానున్నాయి.

21వ ఈస్ట్ ఆసియా సమ్మిట్ ప్రాధాన్యత

21వ ఈస్ట్ ఆసియా సమ్మిట్ ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై అభిప్రాయాలను పంచుకునేందుకు ముఖ్యమైన వేదికగా నిలవనుంది.ఆసియాపసిఫిక్ ప్రాంతంలో భద్రత, రక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు ఈస్ట్ ఆసియా సమ్మిట్ ఒక ప్రధాన వేదికగా గుర్తింపు పొందింది. 2005లో ప్రారంభమైనప్పటి నుంచి తూర్పు ఆసియా ప్రాంతంలోని వ్యూహాత్మక, భౌగోళిక రాజకీయ, ఆర్థిక పరిణామాల్లో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. ఆసియాన్ సభ్య దేశాలతోపాటు ఈ సమ్మిట్‌లో.. భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికా, రష్యా దేశాలు పాల్గొంటాయి.



మోడీని కలవడానికి తహతహ..

విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి (తూర్పు) రుద్రేంద్ర టాండన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఫిలిప్పీన్స్‌లోని భారతీయ సమాజానికి ప్రధాని మోడీని కలవాలనే బలమైన కోరిక ఉందని తెలిపారు. అందువల్ల భారతీయ సమాజంతో సమావేశాన్ని ప్రధాని పర్యటన షెడ్యూల్‌లో చేర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుత వేగవంతమైన భౌగోళిక రాజకీయ పరిణామాలను ఎదుర్కొనే విషయంలో భారత్, ఆసియాన్ దేశాలు మరింత బలంగా, స్థిరంగా మారేందుకు లోతైన పరస్పర సహకారం ఉపయోగపడుతుందని రుద్రేంద్ర టాండన్ పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భారత్, ఆసియాన్ సంబంధాలు గణనీయంగా బలపడుతున్నాయి. ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులు, సముద్ర భద్రత, రక్షణ సహకారం, ప్రాంతీయ భద్రత, వ్యూహాత్మక భాగస్వామ్యం వంటి రంగాలపై ఇరు పక్షాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ఈ ఏడాది ఆసియాన్ సదస్సు ప్రధాన థ్లెనావిగేటింగ్ ద ఫ్యూచర్" (భవిష్యత్తు దిశగా ముందుకు సాగడం)గా ఉంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోడీ మధ్య మంగళవారం ద్వైపాక్షిక సమావేశం జరిగే అవకాశం ఉంది.

సోషల్ మీడియా ఓ వ్యసనం


యువత బానిసగా మారుతోంది

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆందోళన

న్యూఢిల్లీ, నవంబరు 16(ప్రభావార్త): సోషల్ మీడియాకు యువత బానిస అవుతుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధిపతి మోహన్ భగవత్ ఆందోళన చెందారు. సామాజిక మాధ్యమాల వాడకం విపరీతంగా పెరుగుతోందని ఆందోళన చెందారు. చివరకు అవి ఓ వ్యసనంలా మారాపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. వీటి వల్ల యువతలో ఉన్న నైపుణ్యాలు, సృజనాత్మకత, చైతన్యం వంటివి మరుగున పడిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో నిర్వహించిన మారు నినాద్-2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అవసరం మేరకే సోషల్ మీడియాను వినియోగించాలని యువతకు సూచించారు.

అంతర్గత కలహాలకు కుట్ర

ప్రజల్లో కులం, మతం పేరుతో అంతర్గత కలహాలను రెచ్చగొట్టి దేశాన్ని విభజించడానికి కొందరు జాతి వ్యతిరేకులు ప్రయత్నిస్తున్నారని మోహన్ భగవత్ ఈ సందర్భంగా ఆరోపించారు. ఇవి బ్రిటిష్ పాలనలోని విభజించు పాలించు అనే విధానంలా ఉన్నాయన్నారు. భారత్ అభివృద్ధి మార్గంలో దూసుకుపోవడం నచ్చని కొన్ని ప్రపంచ శక్తులు.. మనపై కుట్ర పన్నుతున్నాయని నిర్వేదం చెందారు. అటువంటి దుష్ట శక్తులకు మనలోని కొందరు వ్యక్తులు సహకరిస్తున్నారని విమర్శించారు. ధర్మం వైపు నడవాలంటే స్వార్థం అహంకారం, విభేదాలను విడనాడాలని పిలుపునిచ్చారు.



మహా భారతాన్ని ప్రస్తావించిన భగవత్...

భారతీయులంతా ఐక్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చిన భగవత్...మహా భారత్ లోని కీలక ఘట్టాలను ప్రస్తావించారు. "భీష్ముడు, ద్రోణాచార్యుడు, కర్ణుడు, అశ్వత్థామ వంటి మహానీయులు.. అడిపెద్ద సైన్యం ఉన్నప్పటికీ, కౌరవుల అంతర్గత కలహాల కారణంగా ఓడిపోయారని వివరించారు. సైన్యం తక్కువ ఉన్నా సరే.. పాండవులు ఐక్యతతో వ్యవహరించడంతో విజయం సాధించారని మోహన్ భగవత్ ఉదహరించారు.

ప్రజాస్వామ్యంపై భారత్‌కు పాఠాలా?

ఇటలీ నేత వ్యాఖ్యలపై

స్వదేశంలోనే విమర్శలు

రోమ్, నవంబరు 16: హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమిట్‌లో ఇటలీ వామపక్ష పిఇసి నేత జియాకోమో ఫిల్‌బెక్ మాట్లాడుతూ.. 'ఓట్ చోర్ గద్దీ చోడ్' అని వ్యాఖ్యానించడం తీవ్ర దుమారం రేపుతోంది. తమ దేశ నేత వ్యాఖ్యలను ఇటలీ అధికారపక్ష నాయకురాలు డెబోరా బెర్గామిని ఖండించారు. 97 కోట్ల మంది పౌరులకు ఓటు వేసే అవకాశం కల్పిస్తున్న దేశానికి (భారత్‌కు).. ప్రజాస్వామ్యంపై ఉపన్యాసం ఇవ్వాల్సిన అవసరం చురకలంటించారు. భారత్‌లో ఏమైనా సమస్యలు వస్తే పరిష్కరించడానికి ఆ దేశానికి సొంత ప్రజాస్వామ్య సంస్థలు, న్యాయవ్యవస్థ ఉన్నాయని పేర్కొన్నారు.'ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరికీ తమ వాదనలు వినిపించే స్వేచ్ఛ ఉంటుంది. ఈ క్రమంలో చేసే ఆరోపణలకు వారు తగిన ఆధారాలు చూపించగలగాలి. ఇక, ఇతర దేశాల రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం అనుచితం. అదీనూ మిత్రదేశాల విషయంలో ఈ విధంగా చేయడం సరైన చర్యకాదు' అని డెబోరా బెర్గామిని వెల్లడించారు.

ఇది వీసా నిబంధనల ఉల్లంఘనే..

ఇటలీ వామపక్ష పిఇసి నాయకుడు జియాకోమో పిల్‌బెక్ వీసా నిబంధనలను ఉల్లంఘించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇ-వీసా పోర్టర్ ద్వారా పొందిన కాన్ఫరెన్స్ వీసాపై భారత్‌కు వచ్చిన విదేశీ పౌరులకు ఇక్కడి రాజకీయాల్లో జోక్యంచేసుకునే అధికారం లేదని స్పష్టం చేశాయి. ఇది వీసా నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నాయి. ఇక, ఫిల్‌బెక్ వ్యాఖ్యలను కేంద్ర మంత్రులు అమి త్షా, కిరణ్ రిజిజు తప్పుబట్టారు. భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీ రాజకీయ నాయకులు జోక్యం చేసుకోనేలా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ప్రోత్సహిస్తున్నారని కేంద్రమంత్రులు మండిపడ్డారు.

జనగణన 2027 రెండో దశ ప్రక్రియ షురూ

సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు కేంద్ర హోంశాఖ అవకాశం

న్యూఢిల్లీ, నవంబరు 16: దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణన 2027 రెండో దశ, అంటే జనాభా గణన ప్రక్రియలో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. తొలి విడతగా గోవా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌తోపాటు ఉత్తరాఖండ్ లోని మంచు కురవని ప్రాంతాల్లో ఈ స్వీయగణన ప్రక్రియను ప్రారంభిం చినట్లుగా కేంద్ర హోంశాఖ తెలిపింది. ఆయా రాష్ట్రాలు, ప్రాంతాల్లోని నివాసితులు తమ కుటుంబ వివరాలను నేరుగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అర్హులైన పౌరులు నవంబరు 30 వరకు ఆన్‌లైన్ ద్వారా తమ కుటుంబ సభ్యుల వివరాలను స్వయంగా సమర్పించవచ్చని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది. డిజిటల్ విధానంలో పౌరులే స్వయంగా తమ వివరాలను నమోదు చేయడం వల్ల జనగణన ప్రక్రియ మరింత వేగవంతం కావడంతో పాటు, కచ్చితత్వం పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు

ప్రియాంక గాంధీకి

యుపి ఎన్నికల బాధ్యతలు



- **బిజెపి ఓటమే ఇండి కూటమి లక్ష్యం**
- **ఖర్గే నివాసంలో అగ్రనేతల సమావేశం**
- **రాహుల్, ప్రియాంక, యుపి నేతల హాజరు**



న్యూఢిల్లీ, నవంబరు 16: రానున్న ఉత్తరప్రదేశ్ ఎన్నికల కోసం అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీతో సీట్ల పంపకంపై చర్చలకు ప్రియాంక గాంధీ నాయకత్వం వహించనున్నారు. ఎన్నికల కోసం పార్టీ సన్నాహాలపై చర్చించేందుకు ఢిల్లీలోని 10, రాజాజీ మార్గ్‌లో ఖర్గే నివాసంలో సోమవారం ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులతో సమావేశం జరిగింది. కూటమి భాగస్వాముల గురించి మీడియాలో అనవసర ప్రకటనలు చేయకుండా ఉండాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, యుపి ఇన్‌చార్జ్ రాజేంద్ర పాల్ గౌతమ్, యుపి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపి ఇమ్రాన్ మసూద్‌లను ఆదేశించినట్లు వర్గాలు తెలిపాయి. హిందీ హృదయభూమిలోని కీలక రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లో వచ్చే యేడాది ప్రారంభంలో ఎన్నికలు జరగనున్నాయి. వరుసగా రెండు పర్యాయాలుగా బిజెపి అధికారంలో ఉన్న యుపిలోని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, వారికి సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, అణగారిన వర్గాల హక్కులకు మరింత బలమైన రక్షణ కావాలని ఖర్గే 'ఎక్స్' అనే బ్లాగ్‌లో ఒక పోస్టులో పేర్కొన్నారు. "రాష్ట్ర రాజకీయ పరిస్థితి, రాబోయే అసెంబ్లీ ఎన్నికల గురించి ఈరోజు నేను ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకులతో లోతైన చర్చ జరిపాను. ఉత్తర ప్రదేశ్‌లో జరగబోయే ఎన్నికలు దేశ రాజకీయాలకు కొత్త దిశానిర్దేశం చేస్తాయి. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, అణగారిన వర్గాల హక్కులు బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నారు" అని ఆయన రాశారు. యుపిలో 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ, రాహుల్ గాంధీకి సన్నిహితుడైన కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్, రాష్ట్రంలో బిజెపి ఓటమిని 'ఇండియా బ్లాక్' భాగస్వాములు ఖాయం చేస్తారని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ 37 సీట్లు గెలుచుకోగా, బిజెపి కేవలం 33 సీట్లతోనే సరిపెట్టుకుంది. "మా ఇండియా కూటమి భాగస్వాములతో కలిసి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే, ఉత్తరప్రదేశ్‌లో బిజెపిని ఓడిస్తాం. బిజెపి 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం రాష్ట్ర సామాజిక, ఆర్థిక వ్యవస్థలను నాశనం చేసిందని యుపి ప్రజలకు తెలుసు, అందుకే దీనిని వీలైనంత త్వరగా గద్దె దించాలి. రాబోయే నెలలు, సంవత్సరాల్లో ఉత్తరప్రదేశ్ ఖచ్చితంగా బిజెపిని సాగనంపుతుంది. దేశ రాజకీయ భవిష్యత్తుల్లో కీలక పాత్ర పోషిస్తుంది" అని వేణుగోపాల్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

డిసెంబరు మొదటివారంలో ప్రచారం

తమ పార్టీ ప్రచారం డిసెంబరు మొదటి వారంలో ప్రారంభమవుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగ సభలు, యాత్రల్లో పాల్గొంటారని ఎంపి ఇమ్రాన్ మసూద్ తెలిపారు. ఎన్నికల ప్రచారాన్ని డిసెంబరు మొదటి వారంలో ప్రారంభించాలని నిర్ణయించాం. ఖర్గే సభలు, యాత్రలు నిర్వహిస్తారు. ఈ రోజు జరిగిన సమావేశం సంస్థాగతమైనది. 'ఇండియా కూటమిలో ఎన్ని సీట్లు ఎవరికి దక్కుతాయనేది ముఖ్యం కాదు, అందరం కలిసి గెలవడమే అసలైన లక్ష్యం' అని మసూద్ అన్నారు.

బిగ్ బికి మళ్లీ బెదరింపులు

- **ఈసారి గ్యాంగ్‌స్టర్ గోల్డీ ధిల్లాన్ నుంచి హెచ్చరికలు**
- **ముంబైలో 200 మంది షూటర్లున్నారంటూ వెల్లడి**



ముంబై, నవంబరు 16: నటులు అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్‌లకు గ్యాంగ్‌స్టర్ గోల్డీ ధిల్లాన్ నుంచి ప్రాణ బెదిరింపులు వచ్చాయి. ముంబైలో ఆ సీనియర్ నటుడిని లక్ష్యంగా చేసుకునేందుకు తాను పన్నిన ప్రణాళికకు, ఇటీవల ఢిల్లీ పోలీసులు తన ఇద్దరు సహచరులను అరెస్టు చేయడం అడ్డుకాలేదని అతను పేర్కొన్నాడు. ఒక సోషల్ మీడియా పోస్టులో, వికాస్ ఠాకూర్, దీపక్ సింగ్‌ల అరెస్టులు తమ ప్రణాళికపై ఎలాంటి ప్రభావం చూపవని ఆ గ్యాంగ్‌స్టర్ హెచ్చరించాడు. ముంబైలో తన సుమారు 200 మంది సహచరులు మరుకుగా, సిద్ధంగా ఉన్నారని అతను పేర్కొన్నాడు. సిక్కు సమాజానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని కూడా ఆ పోస్టులో బెదిరిస్తూ, ప్రత్యేకంగా అమితాబ్ బచ్చన్, ఆయన కుమారుడు అభిషేక్‌ల పేర్లను ప్రస్తావించాడు. కనీసం బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్ కూడా వారిని రక్షించలేదని హెచ్చరించాడు. అయితే ఈ బెదిరింపులపై అధికారికంగా ఎలాంటి ధ్రువీకరణ లేదు.ముంబైలోని అమితాబ్ బచ్చన్ నివాసం ఖిజ్సాఖి వెలుపల కాల్పులు జరపడానికి కుట్ర పన్నారని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్న లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు చెందిన ఇద్దరు అనుమానిత షూటర్లను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ అరెస్టు చేసిన కొద్ది రోజులకే ఈ బెదిరింపులు వచ్చాయి. బెదిరింపు ప్రయత్నంలో భాగంగా ఢిల్లీకి చెందిన ఒక వ్యాపారవేత్తను కాల్చి చంపడానికి పన్నిన మరో కుట్రను వెలికితీయడానికి కూడా ఈ అరెస్టులు దర్యాప్తు అధికారులకు సహాయపడ్డాయని భావిస్తున్నారు.ఆ సోషల్ మీడియా పోస్టులో, ధిల్లాన్ 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లను ప్రస్తావిస్తూ, ఆ హింసకు బాధ్యులైన వారిని ఎప్పటికీ క్షమించబోమని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా, సిక్కు సమాజానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసే వారిని జవాబుదారీగా చేస్తామని కూడా ఆయన పేర్కొన్నారు. ఆ పోస్టులో ప్రత్యేకంగా అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్‌లను ప్రస్తావిస్తూ, వారు ఎలాంటి భద్రతా ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ వారిని కాల్చివేస్తామని బెదిరించారు."వారు ఎన్ని బుల్లెట్‌ప్రూఫ్ క్యాబిన్‌లు నిర్మించినా, వారిని కాల్చివేస్తార్ష్ణ అని ఆ పోస్టులో పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఛత్తీస్‌గఢ్ మాజీ సిఎం కుమారుడి ఆస్తుల జప్తు

ఛత్తీస్‌గఢ్, నవంబరు 16(ప్రభావార్త): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) మరింత దూకుడు పెంచింది. ఛత్తీస్‌గఢ్‌లో రూ.2,833 కోట్ల లిక్కర్ స్కాంకు సంబంధించి కీలక చర్యలు చేపట్టింది. ఆ రాష్ట్ర మాజీ సిఎం, కాంగ్రెస్ నాయకుడు భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులో దాదాపు రూ.61కోట్ల విలువైన 355 ప్లాట్‌లను జప్తు చేసింది. దుర్గ్ జిల్లాలో ఉన్న విశల్ గ్రీన్ ప్లాట్లను స్వాధీనపరుచుకొని, మెయిన్‌గేట్ వద్ద నోటీసులను అంటించింది.ఈ ప్రాజెక్ట్‌లో మొత్తం 385 ప్లాట్‌లు ఉండగా .. వీటిలో 30 ఇప్పటికే విక్రయించారు. వాటిని చర్యల నుంచి మినహాయించారు.



విడాకులు తీసుకుంటున్న తమిళనాడు మంత్రి అర్జున



చెన్నై, నవంబరు 16(ప్రభావార్త): తమిళనాడు మంత్రి, టీవీకే పార్టీ నేత ఆధవ్ అర్జున భార్యతో విడిపోయారు. తమ 14ఏళ్ల వివాహ బంధానికి ముగింపు పలుకుతున్నట్టు ఆధవ్ భార్య డైసీ మార్టిన్ ఇన్‌స్టాలో ప్రకటించారు. 14ఏళ్లుగా మంచి స్నేహితులుగా, జీవిత భాగస్వాములుగా, తల్లిదండ్రులుగా జీవితంలోని వివిధ దశలను ప్రేమతో కలిసి దాటామని పేర్కొన్నారు. ఇక మా వివాహ బంధానికి ముగింపు పలికి, వేర్వేరు మార్గాలను అనుసరించాలని నిర్ణయించామని వెల్లడించారు. ఇది మా ఇద్దరికీ ఒక కొత్త అధ్యాయం అయినప్పటికీ.. మా బిడ్డను పెంచడం, సంతోషంగా ఉండేలా చూసుకోవడంలో బాధ్యతాయుతంగా ఉంటామని మార్టిన్ తెలియజేశారు.

90వేల మందిపై కేసులు ఎత్తివేసిన సిఎం విజయ్

చెన్నై, నవంబరు 16(ప్రభావార్త): తమిళనాడులో రైతులు, ఉపాధ్యాయులకు భారీ ఊరట కలిగించేలా సిఎం విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన చేసిన రైతులు, ఉపాధ్యయులపై గతంలో నమోదైన కేసులను ఉపసంహరించెలోవాలని విజయ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో 90వేల మందికి ప్రయోజనం కలుగనుంది.2021 మే నుండి 2026 ఎప్రిల్ వరకు నమోదైన 600కేసులు అయినట్టు ప్రభుత్వం గుర్తించింది వాటిని ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. తమిళనాడు అసెంబ్లిలో సిఎం విజయ్ ఇచ్చిన హామి మేరకు తమిళనాడు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది.

థాయ్‌లాండ్‌లో అగ్నిప్రమాదం, 11 మంది మృతి

బ్యాంగ్‌కాక్, నవంబరు 16: థాయ్‌లాండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం ఫుకెట్ ద్వీపంలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం తెల్లవారుజామున వాహనాల అద్దె వ్యాపారం నిర్వహిస్తున్న ఓ వాణిజ్య భవనంలో మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికే అవి పక్కనే ఉన్న పలు భవనాలకు వ్యాపించాయి. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 36 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారిలో 15 మంది థాయ్ వారు కాగా, ఒకరు మయన్మార్ దేశస్థుడు. మృతులు, క్షతగాత్రుల్లో పర్యాటకులు ఎవరూ లేదని పోలీసులు వెల్లడించారు.

శబరిమలలో రోజుకు 80వేల మందికి దర్శనం



త్రివేండ్రం, నవంబరు 16: శబరియల యాత్ర మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభం కానుంది. మలయాళ మాసం వృశ్చికం మొదలవుతుండటంతో కొండపై స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణ మార్మోగుతోంది. మంగళవారం తెల్లవారు 5 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తున్నారు. మొదటి రోజే స్వామివారిని దర్శించుకోవాలనే ఉద్దేశంతో భక్తులు ఇప్పటికే భారీ సంఖ్యలో కొండ దిగువకు చేరుకున్నారు.కేరళతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. 41 రోజుల పాటు కఠిన దీక్ష ఆచరించిన స్వాములు నల్లటి వస్త్రాలు ధరించి, నేతి కొబ్బరికాయతో కూడిన ఇరుముడిని తలపై మోస్తూ పంబానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. అనంతరం 18 మెట్లు ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకుని నేతి అభిషేకం నిర్వహించనున్నారు. మండల కాలంలో రోజుకు దాదాపు 80వేల మంది భక్తులకు దర్శనం కల్పించేలా తిరువాన్మూర్ దేవస్థానం బోర్డు ఏర్పాట్లు చేసింది. ఇందులో 60వేలమందికి వర్చువల్ క్యూ ద్వారా, మిగిలిన వారికి స్పాట్ బుకింగ్ కేంద్రాల ద్వారా దర్శన అవకాశం కల్పిస్తున్నారు. ఆలయ భద్రతపై అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పి.విజయన్ మాట్లాడుతూ ఆలయ పరిసరాల్లో ఒకే సమయంలో 5వేలమంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. బుక్కింగ్ చేసుకున్న వారందరికీ దర్శనం పూర్తయ్యేలా నిమిషానికి 75 మందిని పంపుతామని ఆయన వివరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముఖ్యమంత్రి వి.డి.సతీశన్, ఇతరమంత్రులు ఏర్పాట్లను స్వయంగా సమీక్షించారు.

పాక్ భారీగా డ్రోన్ల కొనుగోలు

ఆయుధ సంపద పెంచుకొంటున్న దాయాది దేశం..భారత్ హై అలర్ట్



ఇస్లామాబాద్, నవంబరు 16: ఆపరేషన్ సిందూర్‌లో భారత్ క్షిపణి, ఎయిర్ డిఫెన్స్ సామర్థ్యాల దెబ్బకు కుదేలైపోయిన పాక్.. ఇప్పుడు తన ఆయుధ సంపత్తిని పెంచుకుంటోంది. ఈ క్రమంలో భాగంగా తన మిత్ర దేశమైన తుర్కియే నుంచి ఏకంగా లక్ష మెర్కుట్ ఎఫ్‌పివి (ఫస్ట్‌పర్సన్ వ్యూ) డ్రోన్ల కొనుగోలుకు మూడేళ్ల ఒప్పందంపై సంతకాలు చేసింది. దీంతో పలు మానవ రహిత మిలిటరీ వ్యవస్థలను పాకిస్థాన్ ఎఆర్టీసి కొనుగోలు చేయనుందని ఉలుస ఉన్మా, డిఫెన్స్ బ్లాగ్‌లు పేర్కొన్నాయి. ఈ ఒప్పందం ప్రకారం.. పది అల్టైన్ మానవ రహిత హెలికాప్టర్లు, 25 డుమ్‌రుల్ మినీ హెలికాప్టర్లు, 500 డిఎల్ఇ లాయిటరింగ్ మ్యూనిషన్, 250 కోర్గాన్ గ్రౌండ్ వ్యవస్థలు పాకిస్థాన్‌కు చేరనున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌లో వీటి తయారీ ఫ్యాక్టరీలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

పాక్ కొనుగోలు చేయనున్న మెర్కుట్ ఎఫ్



సోమవారం హకీంపేట్‌లోని సిఆర్‌పిఎఫ్ సెంటర్‌లో అఖిల భారత పోలీసు బ్యాండ్ పోటీలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్

పోలీస్ విభాగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం శుభపరిణామం

డిజిపి సివి ఆనంద్

సిఆర్‌పిఎఫ్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమైన అఖిల భారత పోలీస్‌బ్యాండ్ పోటీలు

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: పోలీస్ విభాగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుండటం శుభపరిణామమని డిజిపి సి.వి ఆనం ద్ తెలిపారు. దేశ అంతర్గత భద్రతలో పోలీస్ బలగాల మధ్య సమన్వయం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. శివార్లలోని హకీంపేట్‌లో గల సిఆర్‌పిఎఫ్ సెంటర్‌లో అఖిల భారత పోలీసు బ్యాండ్ పోటీలను డిజిపి సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పోలీస్ బ్యాండ్ బృందాలు క్రమశిక్షణ, ఐక్యత, ఆత్మగౌరవానికి ప్రతీకగా చెప్పుకొచ్చారు. ఈ ఏడాది పోటీల్లో తొలిసారిగా మహిళా బ్యూ గ్లర్లు పాల్గొనడం అభినందనీయమన్నారు. సిఆర్‌పిఎఫ్ విభాగం తరపున హిమాచల్‌ప్రదేశ్ నుంచి మహిళా బ్యూగ్లర్ల భాగస్వామ్యం ప్రత్యే క ఆకర్షణగా నిలిచిందని ఆయన అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బ్యాండ్ బృందాలకు తెలంగాణ తరఫున సాదర స్వాగతం పలికారు. ఇది వరకటితో పోలిస్తే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అన్ని పోలీసు విభాగాల్లో మహిళల ప్రాధాన్యత పెరిగిందని, తెలంగాణలోనూ మహిళా పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో వున్నారని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర పోలీసు బలగాలకు చెందిన 25కు పైగా బృందాలు, 1500 మంది ఇందులో పాలుపంచుకోవడం సంతోషంగా వుందని డిజిపి తెలిపారు. గౌరవ వందనాల్లో వీటి పాత్ర ఎంతో ముఖ్యమని, ఇలాంటి పోటీలు వివిధ రాష్ట్రల పోలీసు బలగాల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన తెలిపారు. పోలీసు బ్యాండ్లు క్రమ శిక్షణ, ఐక్యత, గౌరవానికి ప్రతీకలని ఆయన అన్నారు. జాతియ వేడుకలు, కవాతులు ఇత్తడి వాయిద్యాలు పైపు బ్యాండ్, బ్యూగల్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని సిఆర్‌పిఎఫ్ అదనపు డిజి తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ పోటీలు ఉంటాయని ఆయన తెలిపారు.

ఆన్‌లైన్‌లో అడ్డగోలుగా ఔషధాలు అమ్ముతున్న

23 మెడికల్ షాపుల లైసెన్స్ సస్పెన్షన్

పది రోజుల్లో 378 దుకాణాలపై వేటు

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: రాష్ట్రంలో కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ మందుల విక్రయాలపై ఉక్కుపాదం మోపేందుకు ఏ ర్పాటైన రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ (డ్రగ్స్ (టిజి సేఫ్) ఆన్‌లైన్ ద్వారా ఔషధాలు సరఫరా చేస్తున్న మెడికల్ షాపు లపై కొరడా ఝళిపించింది. గత అక్టోబరు నెల 28వ తేదీన రాష్ట్రంలోని పలుచోట్ల చేబట్టిన స్పెషల్ డ్రైవ్ దరిమిలా లైసెన్స్ పరిమితికి లోబడి అమ్మకాలు సాగించని 23 మెడికల్ షాపుల లైసెన్స్‌లను ఈ సందర్భంగా సస్పెండ్ చేశారు. ఇందులో 15 దుకాణాల లైసెన్స్‌లను తదుపరి ఆ దేశాలు వెలువడే వరకు మరో ఎనిమిది దుకాణాలకు నిర్దేశిత కాలపరిమితి వరకు సస్పెండ్ చేశారు. దీంతో పాటు తొమ్మింటికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆన్‌లైన్‌లో ఔషధాలు సరఫరా చేస్తున్న టాటా 1ఎంజి, నెడ్‌మెడ్స్, జెప్టో, అపోలో 24/7, మెడ్‌ప్లస్ మార్ట్ అండ్ ఇన్‌స్టంట్‌తో పా టు మరికొన్ని వున్నాయి. ఈ సందర్భంగా అమ్మకాలతో పాటు పంపిణీలో అనేక లోపాలు వున్నట్లు టిజి సేఫ్ గుర్తించింది. కాగా ఆన్‌లైన్‌లో ఔషధాలు సరఫరా చేస్తున్న టాటా 1ఎంజి, నెడ్‌మెడ్స్, జెప్టో, అపోలో 24/7, మెడ్‌ప్లస్ మార్ట్ అండ్ ఇన్‌స్టంట్‌తో పాటు మరికొన్ని సంస్థలపై టిజి సేఫ్ దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా అమ్మకాలతో పాటు పంపిణీలో అనేక లోపాలు వున్నట్లు టిజి సేఫ్ గుర్తించింది. ఈ నెల మూడవ తేదీన 138 మెడికల్ షాపుల లైసెన్స్‌లను, ఆరవ తేదీన 117 మెడికల్ షాపులను అడ్డగోలు వ్యవహారాల నేపథ్యంలో సస్పెండ్ చేయ డం తెలిసిందే. తాజాగా మరో 23 దుకాణాల లైసెన్స్‌లను సస్పెండ్ చేయడం గమనార్హం. దీంతో పది రోజుల వ్యవధిలో 378 మెడికల్ షాపు ల లైసెన్స్‌లపై వేటు పడింది. మనుషుల ప్రాణాలు కాపాడాల్సిన ఔషధాల విషయంలో మెడికల్ షాపుల నిర్వాహకులు ఉదాసీనంగా వుంటే క ఠినంగా వ్యవహరిస్తామని టిజి సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతి ఈ సందర్భంగా హెచ్చరించారు.



జాతీయ స్థాయిలో బెస్ట్ నేచర్ అడ్వైజర్

అవార్డుగ్రహీత శ్రీచైతన్య స్కూల్స్ డైరెక్టర్ సీమ బొప్పన

హైదరాబాద్,నవంబరు16,ప్రభాతవార్త: శ్రీచైతన్య స్కూల్స్ డైరెక్టర్ సీమ బొప్పన, ఈనెల 14న హైదరాబాద్‌లోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో అత్యం త వైభవంగా జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో డబ్ల్యుడబ్ల్యు ఎఫ్(వరల్డ్ వైడ్ వైడ్‌లైఫ్) సంస్థ నుంచి బెస్ట్ నేచర్ అడ్వైజర్ అవార్డ్‌ను అందుకున్నారు. శ్రీ చైతన్య స్కూళ్లలో నిర్వహిస్తున్న స్మార్ట్ లివింగ్ ప్రో గ్రామ్‌లో భాగంగా, విద్యార్థులలో పర్యావరణ, సామాజిక, ఆరోగ్య, నైతిక విలువలను పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన మిషన్ హరితోదయ కార్య క్రమానికి సీమ బొప్పన అందించిన నాయకత్వానికి, ఆ కార్యక్రమాన్ని సమ ర్థవంతంగా నిర్వహించినందుకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. మిషన్ హరితోదయ ప్రోగ్రామ్ దేశవ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య స్కూళ్లలో ఈ సంవత్సరం నిర్వహించి. మొక్కలు నాటడం, వాటిని సం రక్షి ంచడం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా, జంతువులు, పక్షులు ఆరో గ్యకరమైన, అనుకూలమైన వాతావరణంలో జీవించడానికి కూడా అవకాశం కలుగుతుందనే విషయంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలలో అవగాహన కల్పించారు. ప్రముఖ పర్యా వరణవేత్తలు, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు. డబ్ల్యుడబ్లుఎఫ్ సంస్థకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధులు పాల్గొన్న వేదికపై సీమ బొప్పన ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందు కున్నారు. సీమ బొప్పనకు ఈ అవార్డు లభించడం పట్ల శ్రీచైతన్య స్కూళ్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, పరిపాలనా సిబ్బంది, ఉపాధ్యాయులు తమ ఆనందాన్ని, హర్షాన్ని వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు.

నామినేషన్ల స్వీకరణకు డిసెంబరు 10 చివరి తేదీ

గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిషోర్ వెల్లడి

విశిష్ట సేవలకు గవర్నర్ అవార్డులు

హైదరాబాద్,నవంబరు16,ప్రభాతవార్త: సమాజ సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలను గుర్తించి గౌరవించాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా నిర్ణయించారు. ఈ మేరకు గవర్నర్ ఆదేశాల ప్రకారం లోక్‌భవన్ "గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్-2026'ను ప్రకటించింది. సోమవారం సాయంత్రం లోక్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, జాయింట్ సెక్రటరీ కోమండూర్ శశికిరణ్‌తో కలిసి అవార్డులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నాలుగు విభాగాల్లో ఒక్కో విభాగానికి వ్యక్తిగత, సంస్థాగత కేటగిరీల్లో అవార్డులు అందజేయనున్నారు. మొత్తం ఎనిమిది అవార్డులను ప్రదానం చేస్తారు. ప్రతి అవార్డు గ్రహీతకు రూ.2 లక్షల నగదు పురస్కారంతో పాటు ప్రత్యేక జ్ఞాపికను గవర్నర్ అందజేసి సత్కరిస్తారు. (26 జనవరి)గణతంత్ర దినోత్సవం సందర్భంగా లోక్‌భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. నామినేషన్ల స్వీకరణకు 2026 డిసెంబర్ 10 చివరి తేదీగా నిర్ణయించారు. అవార్డులకు సంబంధించిన పూర్తి వివరాలు, అర్హత ప్రమాణాలు, నామినేషన్ల సమర్పణ విధానం, షెడ్యూల్ తదితర వివరాల కోసం ఓ ప్రకటన విడుదల చేశారు. సమాజానికి విశేష సేవలందించిన వ్యక్తులు, సంస్థలను గుర్తించి, గౌరవించేందుకు తెలంగాణ లోక్‌భవన్ ఆధ్వర్యంలో గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డులు 2026 ప్రదానం చేయనున్నారు. అంకితభావం, నిబద్ధత, వినూత్న ఆలోచనలు, నిరంతర కృషిలో సమాజంలో మంచి మార్పు తీసుకురావడంతో పాటు ప్రజల సంక్షేమం, అభివృద్ధికి తోడ్పడుతున్న వారిని ప్రోత్సహించడం ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశం. 2026 సంవత్సరానికి సంబంధించి నాలుగు విభాగాల్లో అవార్డులు అందజేయనున్నారు.

మాదకద్రవ్యరహిత తెలంగాణ నషా ముక్త భారత్

మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడు, మత్తు పదార్థాల వల్ల కలిగి అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, వ్యసనాలకు బానిసైన వారికి పునరావాసం, కౌన్సెలింగ్ అందించడం, ముఖ్యంగా యువత ఆరోగ్యకరమైన, మాదకద్రవ్యాల రహిత జీవితాన్ని గడిపిలా ప్రొత్సహిస్తున్న వ్యక్తులు మరియు సంస్థలు,

ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, సాధికారత

ట్రాన్స్ జెండర్ల గౌరవం, సమాన హక్కులు, సామాజిక గుర్తింపు, ఎద్య, ఉపాధి, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక స్వావలంబన కోసం విశేష కృషి చేస్తున్న వ్యక్తులు మరియు సంస్థలు.

పర్యావరణ పరిరక్షణ భూమి, నీటి సంరక్షణ

భూమి, జలవనరుల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు, జలవనరుల అభివృద్ధి, చెరువులు, ఇతర నీటి వనరుల పునరుద్ధరణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారు.

స్టార్టప్‌లు వినూత్న ఉత్పత్తుల అభివృద్ధి

కొత్త ఆలోచనలతో వినూత్న ఉత్పత్తులను రూపొందించడం, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం, ప్రజల సంక్రమం, ఆర్థిక అభివృద్ధి, స్వావలంబనకు దోహదపడి పరిష్కారాలను అందిస్తున్న పారిశ్రా మికవేత్తలు, స్టారపులు, ఆవిష్కర్తలను ఎంపిక చేస్తారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అర్హులైన వ్యక్తులు,రిజిస్టర్ సంస్థలు,స్వచ్ఛంద సంస్థలు,విద్యా సంస్థలు,స్టార్టప్‌లు,ఇతర సంస్థలు అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. గత ఐదేళ్లలో సంబంధిత రంగాల్లో సాధించిన విశేష విజయాలు,వాటి ద్వారా కలిగిన ప్రయోజనాలు,సాధించిన ఫలితాలకు తగిన ఆధారాలు ఉండాలన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చునన్నారు.

అంతరాయం లేని విద్యుత్ సరఫరా

ఉత్పత్తి తగ్గి, డిమాండ్ పెరిగినా అవాంతరాలొద్దు

రబీ సాగుకు సమర్థవంతంగా నిర్వహణ

డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఎంత డిమాండ్ ఉన్నా విద్యుత్‌ను నిరంత రాయంగా సరఫరా చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. డిమాండ్ 20018 మెగావాట్ల చారిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరుకున్నా, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లే కుండా విద్యుత్ నిరంతర సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వరుసగా రెండో రోజు కూడా 20003 మెగావాట్ల స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ విద్యుత్ సంస్థలు సమస్యలు లేకుండా సరఫరా చేశాయని పేర్కొన్నారు. ఈ రబీ సీజన్‌లోనూ ఇదే పనితీరును కొనసాగిస్తూ రైతులు, గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, సరఫరా నిర్వహణ, మౌలిక సదు పాయాల విస్తరణను దృష్టిలో ఉంచుకుని రబీ సీజన్‌కు విద్యుత్ సంస్థలు సన్నద్ధంగా ఉండాలని వెల్లడించారు. రాష్ట్రంలో ఏటా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని చెప్పా రు. వర్షాభావ పరిస్థితుల కారణంగా జలవిద్యుత్ ఉత్ప త్తిలో 4000 మెగావాట్ల కొరత ఏర్పడినప్పటికీ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులతో పాటు అన్ని వర్గాల వినియోగ దారులకు ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు లేకుండా సరఫరా చేయడం జరిగిందన్నారు. మరోవైపు పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరా, మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. రబీ సీజన్‌లో దీర్ఘకాలిక పొడి వాతావరణం ఉండే అవకాశాలున్నందున విద్యుత్ డిమాండ్‌లో ఆకస్మిక పెరుగుదల సంభవించే పరిస్థి తులను ముందుగానే అంచనా వేయాలని సూచించారు. డిమాండ్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన విద్యుత్‌ను సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. ఏ ఒక్క వర్గం వినియోగదారుడికీ విద్యుత్ సరఫరాలో అంత రాయం కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని తెలి పారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్య దర్శి వికాస్‌రాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

విధినిర్వహణలో క్రమశిక్షణతోపాటు సమన్వయం, సత్ప్రవర్తన ముఖ్యం

ఎడిసి అమన్‌కుందు సేవలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రశంసలు

హైదరాబాద్, నవంబరు16,ప్రభాతవార్త: విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమర్థతతో పాటు సత్ప్రవర్తన, పరస్పర గౌరవం, సమన్వయం ఎంతో ముఖ్యమని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా అన్నారు. లోక్‌భవన్‌లో సోమవారం సాయంత్రం తన ఎడిసిగా (ఎయిడ్ డి క్యాంప్) సేవలందించిన అమన్ కుందు వీడ్కోలు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ శ్రీవ ప్రతాప్ శుక్లా, వారి సతీమణి శ్రీమతి జానకిశుక్లాతో కలసి ఆయనను సత్కరించి, సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. భద్రతా విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహారిం చాలని సూచించారు. ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ, సహచరుల పట్ల మర్యాద, గౌరవంతో మెలగాలని అన్నారు. ఇవే సమర్థవంతమైన అధికారికి ఉండాల్సిన ముఖ్య లక్షణాలని పేర్కొన్నారు. సైన్యంలో పదోన్నతులు క్రమశిక్షణ, పనితీరు, అంకితభావం, సేవా రికార్డు ఆధారంగా లభిస్తాయని చెప్పారు. ఎక్కడ పనిచేసినా దేశ సేవ, దేశ రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వర్తించాలని సూచిం చారు. లోక్‌భవన్‌లో అమన్ కుందు అందించిన సేవలు, సహకారం అభినందనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని బాధ్యతలు చేపట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని గవర్నర్ ఆకాంక్షి ంచారు. స్క్వాడ్రన్ లీడర్ హరీష్‌కు కూడా శుభాకాంక్షలు తెలిపారు. లోక్‌భవన్ భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు అన్ని భద్రతా విభాగాలు, అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని గవర్నర్ పేర్కొన్నారు. అమన్ కుందు స్థానంలో నూతన ఎడిసి గా బాధ్యతలు చేపట్టిన స్క్వాడ్రన్ లీడర్ హరీష్ చందర్‌కు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దానకిషోర్, జాయింట్ సెక్రెటరీ శశికిరణ్ కోమండూర్, ఎడిసి శ్రీ కాంతిలాల్ అమన్ కుందు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అమన్ కుందు మాట్లాడుతూ లోక్ భవన్ అధికారులు, ఉద్యోగుల సహకారంతో ఏడిసిగా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించానని చెప్పారు. కార్యక్రమంలో లోక్‌భవన్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



లోక్‌భవన్‌లో ఎడిసిగా సేవలందించిన అమన్ కుందును సోమవారం గవర్నర్ శివప్రతాప్‌శుక్లా సత్కరించిన దృశ్యం

బిజెపి నేతలపై చర్యలు తీసుకోవాలి

డిజిపి కార్యాలయంలో బోయ నాయకుల ఫిర్యాదు

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: భారత్ సమ్మిట్-2026 కార్యక్రమ బ్యానర్ వివాదం, రాహుల్ గాంధీ మరియు తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని బోయా కమ్యూనిటీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బో యా నాగేష్ సహా ఇతర నాయకులు సోమవారం డిజిపి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. భారత్ సమ్మిట్-2026 కార్యక్రమానికి సంబంధిం చిన బ్యానర్‌పై బిజెపి నాయకులు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో పాటు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని. దీనిపై విచారణ చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వారు తమ ఫిర్యాదులో కోరారు.

మహిళా భద్రత విభాగం డిజిగా బాధ్యతలు చేపట్టిన సౌమ్యమిశ్రా

హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: రాష్ట్ర మహిళా భద్రత విభాగం (డబ్ల్యుఎస్‌డబ్ల్యు) డిజిగా సౌమ్య మిశ్రా సోమవారం బాధ్యతలు చేబట్టారు. లక్డీకాపూల్‌లోని డబ్ల్యు ఎస్‌డబ్ల్యు కార్యాలయంలో చారు సిన్హా నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల భద్రత, రక్షణ, సాధికా రతకు మరింత ప్రాధా న్యం ఇస్తామని స్పష్టం చేశారు. మహిళల భద్ర తపై ప్రజల్లో అవగాహన పెంచేం దుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వ హిస్తామని ఆమె తెలిపారు. కమ్యూనిటీ భాగస్వామ్యం, లింగవివక్షతపై దృష్టిసారిస్తామని ఆమె వెల్లడించారు. మహిళలపై హింస, వేధింపుల నివారణకు సమన్వయంతో ముందుకు సాగుతామని, ఇప్పటికే అమల పుతున్న మహిళా భద్రతా కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆమె చెప్పారు. మహిళలు, చిన్నారులు గౌరవంగా, భద్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవించే సమాజ నిర్మాణానికి కృషి చేస్తానని సౌమ్య మిశ్రా పేర్కొన్నారు.



మహిళా భద్రత విభాగం డిజిగా బాధ్యతలు చేపట్టిన సౌమ్య మిశ్రా.

నీటి కన్నా పూడిక అధికం

ప్రమాదకరంగా పడిపోతున్న నీటి నిల్వలు

గోదావరి కృష్ణ బేసిన్ ప్రధాన ప్రాజెక్టుల్లో 424 టిఎంసిల నీటి లోటు

గత యేడాది 757 టిఎంసిలు ఉండగా నేడు 368.5 టిఎంసిలు

హైదరాబాద్, నవంబరు16,ప్రభాతవార్త: గోదావరి కృష్ణా నది పరివాహక ప్రాంతాలలో రిజర్వాయర్లలో నీటి నిల్వలు శీతాకాలంలో పడ పోతుండటంతో భవిష్యత్ నీటి అవసరాలపై ఆందోళన కలిగిస్తోంది. భారీ ప్రాజెక్టులో 368.5 టిఎంసిల నీటినిల్వలు ఉన్నట్లు కనపడుతున్నా అందులో పూడిక శాతమే అధికంగా ఉంది. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనకాలంలో ఆశించిన మేరకు వర్షాలు పడకపోవడంతో 40వేలకు పైగా చెరువుల్లో 30శాతంకు మించి కొత్తనీరు వచ్చి చేరలేదు.నైరుతిలో 837.1ఎంఎం వర్షం కురువాల్సి ఉండగా 644.4ఎంఎ వర్షం కురిసింది. చెరువు మత్తడి వరకు నీరు నిలిచి ఉండాల్సిన ప్రస్తుత సమయంలో ప్రస్తుతం అనేక జిల్లాలో చెరువు నీటి జాడలు లేక నెర్రలువాసినాయి. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అంతా నీటి కోసం గోసపడుతున్నారు. తెలంగాణలోని కృష్ణాగోదావరి బేసిన్‌లోని సంగారెడ్డి నల్లవాగు,మెదక్‌గణపూర్ వనదుర్గ ప్రాజెక్టు నిజామాబాద్ రామడుగు కామారెడ్డి పోచారం,కౌసాల్‌నాలా ఆదిలాబాద్ సాత్నాల,మత్తడివాగు నిర్మల్ స్వర్ణ,సుద్దవాగు,గడ్డెన్నవాగు,కొమురంభీం, మంచిర్యాల, సిద్దిపేట,జయశంకర్‌భూపాలపల్లి,ములుగు రాజన్న సిరిసిల్ల భద్రాది కొత్తగూడెం,నల్లగొండ,యాదాద్రి,సూర్యాపేట, వికారాబాద్, వరంగల్ ఖమ్మం మహబూబాబాద్‌లో ఉండే మధ్యతరహా ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 60213ఎంసిఎఫ్‌టి నీటి మట్టం వుండాల్సి ఉండగా ప్రాజెక్టుల్లో 39711ఎంసిఎఫ్‌టి నీరు మాత్రమే ఉంది. గోదావరి,కృష్ణాబెసిన్‌లోని జూరాల, తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, కృష్ణా డెల్టా, అదేవిధంగా సింగూరు, నిజామ్‌సాగర్, శ్రీరాంసాగర్, మధ్యమానేరు, లోయర్ మానేరు కడెం, శ్రీపాద ఎల్లంపల్లి, గోదావరి డెల్టా వంటి 18 ప్రాజెక్టుల్లో గరిష్ఠంగా 792.72 టిఎంసిల నీరు నిలుపుకొనే సామర్థ్యం ఉండగా గత ఏడాది అక్టోబరు 16న 757 టిఎంసిల నీరు ఉంటే ప్రస్తుతం 368.29 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. నైరుతి రుతుపవనకాలంలో 1737.74 టిఎంసిల నీరు వరదరూపంలో వచ్చింది. ప్రస్తుతం తెలంగాణలోని ప్రాజెక్టులలో 424.45టిఎంసిల నీటి లోటు ఉంది. తెలంగాణలో నైరుతి రుతుపవనకాలంలో 61 వర్షపు రోజులు నమోదుకాగా 23శాతం లోటు వర్షం కురిసింది. 11జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. 22 జిల్లాలో లోటువర్షం నమోదైంది. కరువు ప్రభావంతో రాబోయే రోజుల్లో తాగునీటికి తీవ్ర కటకట ఏర్పడేలా ప్రమాదకరంగా నీటి నిల్వలు పడిపోతున్నాయి.,



అధికారులకు సూచనలు ఇస్తున్న జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

భద్రతా నిబంధనల అమలులో నిరక్ష్యం తగదు

రైలు కార్యకలాపాల భద్రతపై సమీక్షలో అధికారులకు ద.మ.రైల్వే జిఎం ఆదేశాలు

హైదరాబాద్ (తార్నాక), నవంబరు 16, ప్రభాతవార్త : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైలు కార్యకలాపాల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల ప్రధానాధిపతులతో కలిసి జోన్ వ్యాప్తంగా రైల్వే భద్రతా అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ రాజేష్ పి. ఖాడే, వివిధ శాఖల ప్రధానాధిపతులు పాల్గొనగా, సికింద్రా బాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మా ట్లాడుతూ నిర్దేశించిన భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, భద్రతా పరికరాల పనితీరును సంబంధిత విభాగాలు సమన్వ యంతో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. యార్డులు, బ్లాక్ సెక్షన్లలో పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కేబుల్ కట్ ఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రైల్వే ట్రాక్‌ల సమీపంలో నిరంతరం భద్రతా తనిఖీలు నిర్వహించాలని, నిర్మాణ పనులు కొన సాగుతున్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులకు స్పష్టం చేశారు. సురక్షితమైన, అంతరాయం లేని రైలు రాకపోకల కోసం అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయి సిబ్బందిలో భద్రతపై అవగాహన పెంపొందించాలని జనరల్ మేనేజర్ ఆదేశించారు.

విదేశీయులపై విచారణచేసి జైలుకు పంపాలి

పెట్టుబడులకు కాదు.. దేశవ్యతిరేక నినాదాల సమ్మిట్

రాష్ట్ర బిజెపి చీఫ్ రామచందర్‌రావు

భారత్ సమ్మిట్‌లో విదేశీ ప్రముఖుల వ్యాఖ్యలపై బిజెపి ఫిర్యాదు

హైదరాబాద్ (శంషాబాద్), నవంబరు 16, ప్రభాతవార్త: భారత్ సమ్మిట్ పెట్టుబడుల సమ్మిట్ కాదని, భారతదేశ వ్యతిరేక నినాదాలు ఇవ్వడానికి పెట్టిన సమ్మిట్ అన్ని దేశానికి వ్యతిరేకంగా విదేశీయులు మాట్లాడుతుంటే రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి నవ్వుతూ చప్పుట్లు కొట్టడం సిగ్గుచేటని రాష్ట్ర బిజెపి చీఫ్ రామచందర్‌రావు మండిపడ్డారు. భారత్ సమ్మిట్-2026 సందర్భంగా విదేశీ రాజకీయ ప్రముఖులు చేసిన వ్యాఖ్యలపై సోమవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు బిజెపి లీగల్ టీమ్‌తో కలిసి శంషాబాద్‌లోని విదేశీయుల ప్రాంతీయ నమోదు అధికారి (ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ)కు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో రామచందర్‌రావు మాట్లాడుతూ.. భారత్ సమ్మిట్‌లో ఇటలీ వామపక్ష పిఇసి నేత జీయా కోమో ఫిల్‌బెక్ చేసిన వ్యాఖ్యాలను బిజెపి అధ్యక్షుడు తీవ్రంగా ఖండిం చారు. మన అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో విదేశీయులను తీసుకొచ్చి మాట్లాడిచాడం ఇంతకంటే దారుణం ఉండదని మండిపడ

ఖేలో ఇండియా క్రీడలకు పటిష్టమైన ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లతో సిఎస్ సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్,నవంబరు16,ప్రభాతవార్త: డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు రాష్ట్రంలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల్లో సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లను ఆదేశించారు. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి జూమ్ ద్వారా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఖేలో ఇండియా క్రీడా పోటీల నిర్వహణపై జిల్లా కలెక్టర్లకు, అధికారులకు తగు దిశా నిర్దేశనం చేశారు.ఈ క్రీడా పోటీలు హైదరాబాద్ తో పాటు హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ లో సుమారు 8,000 మంది క్రీడాకారులు, ఇతర ప్రతినిధులు పాల్గొననున్న ఈ క్రీడా సంబరాలకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున భాగస్వాములు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ మేరకు నేడు ఆయన జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ఖేలో ఇండియా క్రీడలపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ముఖ్యమైన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో హోర్డింగులు, బెలూన్ల తో క్రీడల మస్కట్, లోగోల పై విస్తృత ప్రచారం నిర్వహించాలని, ముఖ్యంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, కాజీపేట తదితర రైల్వే స్టేషన్లు, నగరంలోని సెంట్రల్ బస్ స్టేషన్లలో ప్రత్యేక ప్రచార ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. క్రీడల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేలా టార్చ్ ర్యాలీలను కూడా నిర్వహించాలని సూచించారు.

క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయడంతో పాటు, క్రీడాకారుల రవాణా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, పాఠశాలల నుంచి విద్యార్థులను క్రీడా వేదికలకు తీసుకువచ్చేందుకు తగిన రవాణా సౌకర్యం కల్పించాలని తెలిపారు. క్రీడాకారులకు నాణ్యమైన వసతి సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి, అవగాహన పెంపొందించాలని, విద్యార్థులు, క్రీడాకారుల భాగస్వామ్యంతో ఈ క్రీడా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. ప్రముఖ క్రీడాకారులు, విశిష్ట వ్యక్తులు, ముఖ్యంగా గౌరవ మంత్రి మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్ తదితర క్రీడా ప్రముఖుల ద్వారా విద్యార్థులకు ప్రేరణ కల్పించేలా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సి.ఎస్. తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంతో పాటు, దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించే దిశగా కృషి చేయాలని సూచించారు.

కుల్గాం దాడి సూత్రధారి లతీఫ్ భట్ హతం

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి

శ్రీనగర్, నవంబరు 16:కుల్గాం ఉగ్రదాడికి భద్రతా బలగాలు ప్రతీకారం తీర్చుకున్నాయి. సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై దాడి ఘటనలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, లష్కరే తోయిబాకు చెందిన లతీఫ్ భట్ హతమయ్యాడు. కుల్గాం జిల్లాలోని లారూ ప్రాంతంలో భద్రతా దళాలు చేపట్టిన గాలింపు చర్యల సందర్భంగా ఈ ఎదురుకాల్పులు జరిగాయి. సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లతీఫ్‌తో సహా ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. జమ్మూ కాశ్మీర్‌లోని కుల్గాంలో సీఆర్పీఎఫ్ భద్రతా పోస్టుపై నవంబర్ 11న ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. అప్పటి నుంచి ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. లతీఫ్ భట్ కుల్గాం జిల్లాకు చెందిన వ్యక్తి. కళాశాల చదువును మానేసి, ఆ తర్వాత స్థానికంగా కార్పెంటర్ పనిచేశాడు. 2025 నవంబర్‌లో అకస్మాత్తుగా ఆచూకీ లేకుండా పోయాడు. ఆ తర్వాత లష్కరే తోయిబాలో చేరినట్లు తెలిసింది. ఈ ఉగ్ర సంస్థకు రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్), కాశ్మీర్ రివల్యూషనరీ ఆర్మీ (కెఆర్ఎ) వంటి ఉగ్ర గ్రూపులు ప్రాక్సీలుగా పనిచేస్తున్నాయి. లతీఫ్ దక్షి ణ కాశ్మీర్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉగ్రవాద కార్యకలాపాలు చేస్తున్నట్లు భద్రతా బలగాలు భావిస్తున్నాయి. జూలై 2026లో షోపియాన్‌లో జరిగిన భద్రతా ఆపరేషన్ నుంచి తృటిలో తప్పించుకున్నాడు. ఆ సమయంలో లతీఫ్‌కు జాకీర్ అహ్మద్ ఘనీతో సంబంధాలు ఉన్నాయి.

దొడ్డుబియ్యం దోపిడీ కేసుకు కీలకం ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు

అక్రమాలకు పాల్పడిన సివిల్ సప్లయ్ మేనేజర్లు, డిఎస్ఓలపై చర్యలు

14 మంది రైసు మిల్లర్లు బెయిల్‌పై బయటకు వచ్చినా నిఘా వేసిన సిఐడి

హైదరాబాద్, నవంబరు 16,ప్రభాతవార్త: దొడ్డబియ్యం దోపిడి కేసు పురోగతి కోసం సిఐడి ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు కోసం ఎదురు చూస్తోంది. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో 16 రైస్ మిల్లుల యజమానులు 3,385.820 మెట్రిక్ టన్నుల సన్నరకం వడ్లను బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొని భారత ఆహార సంస్థకు దొడ్డు బియ్యం సరఫరా చేసినట్లు అధికారులు గుర్తించారు.రైసుమిల్లర్లు సొంతానికి వినియోగించిన సన్నవడ్లకు సంబందించి ప్రభుత్వం రైతులకు మద్దతు ధరతోపాటు అదనంగా క్వింటాల్‌కు 500 చొప్పున బోనస్ రూపంలో చెల్లించింది. ప్రభుత్వానికి బోనస్ సంబందించి సుమారు రూ.1.69 కోట్ల నష్టం జరిగినట్లు సిఐడి రూపొందించిన డాక్యుమెంట్లలో నివేదించినట్లు తెలిసింది.అంతే కాకుండా మిల్లింగ్‌కు కేటాయించిన 45,414.833 మెట్రిక్ టన్నుల ధాన్యం సంబందించిన కేటాయింపులపై బోనస్ పరంగా సుమారు రూ.242 కోట్ల మేర ప్రభుత్వం ధనం కొల్లగొట్టే ప్రయత్నాలను సిఐడి ఆకస్మిక తనిఖీలతో కట్టడి చేయడమే కాకుండా, ఈ వ్యవహారంలో మిల్లర్ల పాత్రతో పాటు అధికారుల ప్రమేయం, కుట్ర కోణంపై సిఐడి అధికారులు నివేదికలు రూపొందించినట్లు తెలిసింది. సన్నబియ్యం స్థానంలో దొడ్డుబియ్యాన్ని ఎఫ్‌సిఐకి సరఫరా చేసిన 14 మంది మిల్లర్లు బెయిల్‌పై బయటకు వచ్చినా వారిపై సిఐడి ఓవైపు నజర్ వేసి ఉంచడమే కాకుండా పక్కా ఆధారాలతో కేసు కోర్టులో వేసేందుకు బియ్యం శాంపిల్స్‌ను వివిధ ఏజెన్సీలకు పంపినివేదిక సిద్ధం చేస్తోన్నది. ఫోరన్సిక్ సైన్స్ ల్యాబ్ నుంచి త్వరగా నివేదిక తీసుకొని వచ్చేందుకు ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సుమారు ఏడు జిల్లాలకు చెందిన సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మేనేజర్లు, డిఎస్ఓలు కూడా పూర్తిస్థాయిలో దీనిలో ఇరుక్కొని పోతారని సివిల్‌సప్లయ్‌శాఖలో చర్చ జరుగుతోంది. కస్టమ్ మిల్లింగ్ రైస్ బియ్యం విషయంలో భారీగా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించిన 34 రైస్ మిల్లులకు సంబంధించిన యజమానుల పేర్లను ఆన్‌లైన్ నుంచి తొలగించడమే కాకుండా భవిష్యత్‌లో వారికి సిఎంఆర్ ధాన్యం కూడా కేటాయించకుండా చర్యలు తీసుకోనున్నారని తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం 2025 ఖరీఫ్ సీజన్లో 71.86 లక్షల టన్నుల సన్న, దొడ్డు ధాన్యాన్ని సేకరించి మిల్లర్లకు అప్పగించింది. ధాన్యంలో తరుగు, విరిగిపోవడం, సమస్య ఉందని గ్రేడ్ ఏగా పాస్ కావడం లేదని, కామన్ అనుమతించాలని నిజామాబాద్ కలెక్టర్ సూచనమేరకు మెమె నెంబరు 2261/సిఎస్ఐ-సిసిఎస్/2026తేదిది24-08-2026 అప్పటి సివిల్ సప్లయ్‌శాఖ కమీషనర్ మె.మె జారీచేశారు . అందుకు అదనంగా తాము క్వింటాకు రవాణా, హమాలీ ఛార్జీలతో కలిపి రూ.34.21 చెల్లిస్తామని చెప్పారు. ఇందుకు కొన్ని జిల్లాల పౌరసరఫరాల శాఖ డీఎంలు, డిఎస్ఓలు, డిటి మిల్లర్లతో కుమ్మక్కై అనుమతులు ఇచ్చారు. ఈ లొసుగును తమకు అనుకూలంగా మార్చుకొని పౌరసరఫరాల శాఖ ఇచ్చిన సన్న ధాన్యం రకాలు కాకుండా, దొడ్డు రకాలను ఎఫ్‌సిఐ కి చెల్లించారు. అయితే కొన్ని జిల్లాల్లో ఈ విధానాన్ని అధికారులు తిరస్కరించారు. ములుగు జిల్లాలో ఇది వెలుగు చూడగా అక్టోబరు 24న సిఐడి పోలీల్ స్టేషన్‌లో కేసు నమోదుకు చర్యలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సిఐడి అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఏ గ్రేడ్ రకం నుంచి కామన్‌గా మార్చుకొన్న రైస్ మిల్లుల వివరాలు, వారు ఎఫ్‌సిఐకి ఇచ్చిన బియ్యం నమూనాలను సేకరించారు. బియ్యం నాణ్యతా ప్రమాణాల పరీక్షల అనంతరం ఎన్ఫోర్స్మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు అన్ని జిల్లాలోని మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాయి. ఆగస్టు 24న ములుగు కలెక్టర్ ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన ఏ గ్రేడ్ ధాన్యాన్ని కామన్గా మార్చడానికి 25 మంది మిల్లర్లకు అనుమతులు జారీ చేశారని సిఐడి అధికారులు కోర్టుకు అందించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారని సమాచారం. మిల్లర్లు తాము తీసుకున్న సన్నవడ్లను బహిరంగ మార్కెట్లో 3,200 విక్రయించారు. వీటికి బదులుగా ఇతర రాష్ట్రాల్లో దొడ్డు బియ్యాన్ని 2,100కు కొనుగోలు చేసి 1.67 లక్షల టన్నుల బియ్యం ఎఫ్‌సిఐ అప్పగించారు. ఇలా మిల్లర్లకు భారీగా లాభం చేకూరింది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో 9 మంది మిల్లర్లపై కేసులు నమోదు చేసి, ఏడుగురిని అరెస్ట్ చేయగా మరో ఇద్దరు ఆచూకీ లభించలేదు. నిజామాబాద్ జిల్లాలో ఆరుగురు మిల్లర్లపై కేసులు నమోదు కాగా ఇద్దరి ఆచూకీ దొరక లేదు. మరొకరు అనారోగ్యం కారణంగా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట, హుజూరాబాద్లలో నలుగురు రైస్ మిల్లర్లు 16 వేల టన్నుల దొడ్డు బియ్యం ఎఫ్‌సిఐకి అప్పగించారు. దొడ్డు బియ్యం సరఫరా కేసులో ఇప్పటి వరకు ఒకే రోజు 14 మంది అధికారులను అరెస్టుచేసి సంచలనం సృష్టించిన సిఐడి కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం కొత్తగూడెం పెద్దపలి మహబూబాబాద్, ములుగు జిల్లాకు చెందిన పౌర సరఫరాల శాఖ పౌరసరఫరాల సంస్థ అధికారుల పాత్రపై కూడా ప్రభుత్వంకు ఎఫ్ఎస్ఎల్ నివేదికతో కలిపి అందజేస్తే ఎంత మంది ప్రభుత్వ ఉద్యోగులు ఇంటి దొంగలుగా బయటకు వస్తారో అనే అనుమానం నెలకొంది.

దూసుకొస్తున్న 'అక్వాన్'

నేటి సాయంత్రానికి తీవ్ర తుఫానుగా మారే అవకాశం

పశ్చిమ- వాయువ్య దిశలో గంటకు 10కి.మీ వేగంతో ప్రయాణిస్తున్న వాయుగుండం

గురువారం ఉదయానికి అతితీవ్ర తుఫానుగా రూపాంతరం

శుక్రవారం నెల్లూరు - తుని మధ్య తీరం దాటే చాన్స్

తీరం దాటే సమయంలో 130 కి.మీ వేగంతో గాలులు వీస్తాయ్

ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ

అమరావతి, నవంబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం దక్షి ణమధ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ(తిశీళీదీ లీతి) మేనేజింగ్ డైరె క్టర్, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ళిగిబిళీ) సిఈవో ప్రఖర్ జైన్ తెలిపారు. దీనికి అక్వాన్ తుపానుగా నామ కరణం చేసినట్లు పేర్కొన్నారు. గడిచిన 6 గంటల్లో ఇది 10 కిమీ వేగంతో కదులుతుందని, రేపు సాయంత్రానికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్రతుపానుగా మారే అవకాశం ఉందన్నారు. ఇది చెన్నైకి 610 కి.మీ, మచిలీపట్నానికి 660 కిమీ విశాఖపట్నానికి 670 కి.మీ, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 790 కి.మీ దూరంలో కేంద్రీ కృతమై ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ అంచనాలను బట్టి పశ్చిమవాయవ్య దిశలో ప్రయాణిస్తూ గురువారం ఉదయానికి అతి తీవ్ర తుపానుగా బలపడుతుందని పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు తుని మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. తీరం దాటే సమయంలో గంటకు 120-130 కిమీ, గరిష్ఠంగా 145 వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.

సముద్రం అలజడిగా ఉండి అలలు ఎగసిపడనున్నందున మత్స్యకారులు సముద్ దంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. తుపాను ప్రభావంతో కోస్తాంధ్రలో ఎల్లుండి నుంచి అక్కడక్కడ భారీ వర్షాలు, గురు, శుక్రవారాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే అక్వాన్ ప్రభావం చూపే జిల్లాల యంత్రాంగాన్ని అలెర్ట్ చేశామ న్నారు. తుపాను వలన ఏ సమస్య ఎదురైనా 9552300009 మన మిత్ర ద్వారా వెంటనే అధికా రులకు తెలియజేయవచ్చన్నారు. అత్యవసర సహాయం, సమాచారం కోసం విపత్తుల నిర్వహణ సంస్థలోని 112, 1070, 18004250101 టోల్ ఫ్రీ నంబర్లను సంప్ర దించాలన్నారు.తుపాను హెచ్చరికల నేపధ్యంలో గురు, శుక్రవారాల్లో వర్షసూచన క్రింది విధంగా ఉండనున్నట్లు ఏపిఎస్డీఎంఏ ఎండీ, ఆర్టీజిఎస్ సిఈవో ప్రఖర్ జైన్ వివరించారు. గురువారం ఏలూరు, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడ బలమైన ఈదురుగాలులతో అత్యంత భారీ వర్షాలు, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, గుంటూరు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఎన్టీఆర్, పల్నాడు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. శుక్రవారం ఏలూరు, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడ బలమైన ఈదురుగాలులతో అత్యంత భారీ వర్షాలు , విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఎన్టీఆర్, పల్నాడు, గుంటూరు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. కోస్తాంధ్ర తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తుపాను ముప్పు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. తుపాను ప్రభావం నుంచి ప్రాణ, ఆస్తినష్టాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ క్రింది జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తుపానుకు ముందు ప్రజలు ఎటువంటి పుకార్లను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని, భయపడవద్దని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేసి ఉంచుకుంటూ విపత్తుల సంస్థ, ఆర్టీజిఎస్, ఐఎండి పంపే వాతావరణ సమాచారాన్ని గమనిస్తుండాలని సూచించారు. విలువైన పత్రాలు, సర్టిఫికెట్లను వాటర్ ప్రూఫ్ కవర్లలో భద్రపరుచుకోవడంతో పాటు, కనీసం ఒక వారానికి సరిపడా ఆహార పదార్థాలు, తాగునీరు ఉండేలా కిట్ సిద్ధం చేసుకోవాలన్నా. ఇంటి పైకప్పు, తలుపులు కిటికీ లు సురక్షితంగా ఉన్నయో లేదో తనిఖీ చేయడం వంటి ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తుపాను సమయంలో ఇంట్లో ఉన్నవారు ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి, గ్యాస్ కనెక్షన్లను తొలగించి, తలుపులు, కిటికీలు గట్టిగా మూసి ఉంచాలన్నారు. ఇల్లు సురక్షి తంగా లేదని భావిస్తే ముందే పునరావాస కేంద్రాలకు చేరుకోవడం మంచిదన్నారు. కేవలం కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. ఒకవేళ ఆ[illegible] భవనం దెబ్బతినే సూచనలు కనిపిస్తే, బలమైన టేబుల్/బెంచ్ కింద తలదాచుకుని రక్షణ పొందాలన్నారు. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారులు సూచించిన వెంటనే ఎత్తైన, సురక్షి తమైన ఆశ్రయాలకు తరలివెళ్లాలని కోరారు. ఒకవేళ తుపాను సమయంలో బయట ఉంటే, దెబ్బతిన్న లేదా పాత భవనాల్లోకి వెళ్లకూడదని; చెట్లు, హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాల కింద నిలబడరాదని ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.తుపాను తర్వాత కూడా కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు అధికారిక ప్రకటన వెలువడే వరకు షెల్టర్లను వదిలి ఇళ్లకు వెళ్లవద్దు. తెగిపడిన విద్యుత్ తీగలు, విరిగిన స్తంభాల పట్ల తీవ్ర అప్రమత్తతతో ఉండలన్నారు. నీటిలో తడిసిన లేదా దెబ్బతిన్న ఎలక్ట్రానిక్ వస్తువులను ఎలక్ట్రీషియన్ చేత తనిఖీ చేయించిన తర్వాతే ఉప యోగించాలని స్పష్టం చేశారు.మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని స్పష్టం చేశారు. తమ పడవలు మరియు తెప్పలను సురక్షి తమైన ప్రాంతంలో బలమైన తాడులతో గట్టిగా కట్టి సురక్షితంగా ఉంచాలని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

ప్రజల ప్రేమ నన్ను కదిలించింది

పుస్తకావిష్కరణలో భావోద్వేగానికి లోనైన సోనియా గాంధీ

న్యూఢిల్లీ, నవంబరు 16: తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అధికారిక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సిపిపి) ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ భావోద్వేగానికి లోనయ్యారు. తన పుస్తకానికి ప్రజల నుంచి లభిస్తున్న విశేష ఆదరణ చూసి తాను ఎంతో ఆశ్చర్య పోయానని, ఈ స్థాయి స్పందనను తాను అస్సలు ఊహించలేదని ఆమె పేర్కొన్నారు. పుస్తకావిష్కరణ సందర్భంగా సోనియా గాంధీ మాట్లాడుతూ "ప్రజలు చూపిస్తున్న ఈ ప్రేమ, అభిమానంతో నేను నిజంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను. ఇంతమంది ఆసక్తి చూపుతారని నేను అసలు ఊహించలేదు. నా పుస్తకంపై ప్రజలకు కొంతవరకు ఆసక్తి ఉంటుందని అనుకున్నాను కానీ, ఇంత పెద్ద ఎత్తున స్పందన వస్తుందని మాత్రం అనుకోలేదు్ల అని అన్నారు.ఈ అనూహ్య ఆదరణ తన మనసును ఎంతో హత్తుకుందని సోనియా గాంధీ తెలిపారు. "ఇది పూర్తిగా ఊహించనిది, నన్ను ఎంతో కదిలించింది. పుస్తకాలను కొనుగోలు చేయడంలోనూ, తమ అభిప్రాయాలను పంచుకోవడంలోనూ ప్రజలు చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత నన్ను ఎంతో భావోద్వేగానికి గురిచేశాయ్ు అని సోనియా గాంధీ వివరించారు.

ఆర్టీసీ ఎండిగా డాక్టర్ అనిల్ బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, నవంబరు 16, ప్రభాతవార్త: సీనియర్ ఐపిఎస్ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ ఆర్టీసీ ఎండిగా బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని బస్ భవన్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు చేపట్టారు. ఇటీవల, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆర్టీసీ ఎండిగా పనిచేసిన వై నాగిరెడ్డిని బదిలీ చేయడంతో ఆయన స్థానంలో అనిల్‌ను నియమించింది. బదిలీపై ఆర్టీసీ ఎండిగా నియమితులు కాకముందు అనిల్ తెలంగాణ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ సంస్థలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఆపరేషన్స్)గా పనిచేశారు.

భారత్ సమ్మిట్ ముసుగులో 'యాంటీ భారత్ సమ్మిట్'

విదేశీ నేత జియాకోమో ఫిలిబెక్‌తోపాటు

రాహుల్‌గాంధీ, నిర్వాహక సంస్థలపై క్రిమినల్ కేసులు పెట్టాలి

డిజిపి సివి ఆనంద్, ఎఫ్ఆర్ఆర్ఒ అధికారులకు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఫిర్యాదు



సోమవారం డిజిపి సివి ఆనంద్‌ను కలిసి అధికారికంగా ఫిర్యాదు చేస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తదితరులు

హైదరాబాద్,నవంబరు16,ప్రభాతవార్త:హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్ వేదికగా భారతదేశ సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానిస్తూ రెచ్చగొట్టే రాజకీయ వ్యాఖ్యలు చేసిన ఇటలీకి చెందిన యూరోపియన్ సోషలిస్ట్ పార్టీ (పిఈఎస్) సెక్రటరీ జనరల్ జియాకోమో ఫిలిబెక్, ఆ సదస్సు నిర్వాహకులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధి బృందం సోమవారం సాయంత్రం రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్‌ను కలిసి అధికారికంగా ఫిర్యాదు సమర్పించింది. ఈ బృందంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతమ్ రావు, వీరేందర్ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీనర్సయ్య, లీగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

డీజీపీకి ఫిర్యాదు అందజేసిన అనంతరం ఎన్. రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ,... ఒక పద్ధతి ప్రకారం, చట్టబద్ధమైన ప్రక్రియలోనే ఉదయం శంషాబాద్‌లోని ఎఫ్ఆర్ఆర్ఓ అధికారులకు ఫిర్యాదు చేశామని, ఇప్పుడు రాష్ట్ర డీజీపీని కలిసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. ఏ దేశంలోనైనా వీసా నిబంధనల ప్రకారం ఒక విదేశీయుడు ఆ దేశ గడ్డపైకి వచ్చి అక్కడి అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడానికి గానీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటానికిగానీ వీల్లేదన్నారు. కానీ, ఇటలీకి చెందిన జియాకోమో ఫిలిబెక్ మన దేశ సార్వ భౌమత్వాన్ని ప్రశ్నిస్తూ, ప్రపంచం ముందు భారత ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని మండి పడ్డారు. వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ఇద్దరూ ఉన్నప్పటికీ ఆ విదేశీయుడిని అడ్డుకోకపోగా, ప్రోత్సహించడం దారుణ మన్నారు.

ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025లోని సెక్షన్ 23 ప్రకారం, వీసా నిబంధనలను ఉల్లంఘించి భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం శిక్షార్హమైన నేరమని, దీని కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశామన్నారు. ఈ నేరానికి ప్రత్యక్షంగా ప్రేరేపించిన నిర్వాహక సంస్థలపైనా కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఈ సదస్సును నిర్వహించిన కాంగ్రెస్ థింక్ ట్యాంక్ సమృద్ధి భారత ఫౌండేషన్,, కోస్పాన్సర్ అయిన ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్, అర్బన్ నక్సల్స్ ప్రేరిత వ్యక్తులు, ఈ మొత్తం ఈవెంట్‌ను స్పాన్సర్ చేసిన బెంగళూరుకు చెందిన ఫేజ్ 1 కంపెనీతో పాటు ఈ కార్యక్రమానికి వేదిక కల్పించిన తెలంగాణ ప్రభుత్వంపై కూడా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో రాహుల్ గాంధీయే ప్రధాన ప్రేరేపకుడు కాబట్టి, చట్టప్రకారం ఆయనపై కూడా తప్పకుండా కేసు నమోదు చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు.

ఇటలీలో 45 ప్రతిపక్ష పార్టీల కూటమిలో ఉన్న జియాకోమో ఫిలిబెక్ భారతదేశానికి వచ్చిఇక్కడి అంతర్గత రాజకీయాల గురించి మాట్లాడాల్సిన అవసరం ఏమొచ్చిందని స్వయంగా ఇటలీలోని ఇతర నేతలు సైతం తప్పుపడుతున్నారని రాంచందర్ రావు గుర్తుచేశారు. ఈ సదస్సు కోసం వచ్చిన విదేశీయులు కూడా కాన్ఫరెన్స్ రూమ్ మీటింగ్ అని తప్పుడు కారణాలు చెప్పి మోసపూర్వకంగా భారత్‌లోకి ప్రవేశించారని ఆరోపించారు. వీరు భారత వ్యతిరేక కార్యకలాపాల కోసం వస్తున్నారని చివరి నిమిషంలో తెలియడంతోనే కేంద్ర ప్రభుత్వం 115 మంది వీసాలను విమానం ఎక్కే ముందు రద్దు చేసిందని వెల్లడించారు. ఇది భారత్ సమ్మిట్ కాదు, పక్కా యాంటీ భారత్ స



ఒయు పరిపాలన భవనం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

విద్యుత్, తాగునీరు పునరుద్ధరించాలి

ఒయు అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట విద్యార్థుల మౌనదీక్ష

హైదరాబాద్(తార్నాక), నవంబర్ 16 ప్రభాతవార్త : ఒయులోని ఈ1, ఈ2, డీ హాస్టళ్లకు విద్యుత్, తాగునీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి నేతలు జంగయ్య, అశోక్ ఆధ్వర్యంలో విద్యార్థులు యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట మౌనదీక్ష చేపట్టారు. హాస్టళ్లను మూసివేసి, విద్యార్థులను ఖాళీ చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. లా కళాశాలకు చెందిన ఈ1 హాస్టల్‌తో పాటు డీ, ఈ2 హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు విద్యుత్, నీటి సరఫరా నిలిపివేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తూ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న నిరుద్యోగ విద్యార్థులను ఇళ్లకు పంపించే చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లను పునరుద్ధరించి, మెస్‌ను తిరిగి ప్రారంభించాలని కోరారు. ఉస్మానియా వర్సిటీకి రూ.1,000 కోట్లు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని విద్యార్థి నేతలు విమర్శించారు. వర్సిటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులతోపాటు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఆందోళన సందర్భంగా పోలీసులు విద్యార్థులను అదుపులోకి తీసుకుని అంబర్‌పేట పోలీస్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, అశోక్, సతీష్, ప్రదీప్, రమేష్, శ్రీశైలం, చరణ్, శ్రీనివాసరెడ్డి, అఫ్రిది తదితరులు ఉన్నారు.

ఊరూవాడ చేయూత పింఛన్ల పంపిణీ

దాదాపు 3 లక్షల మందికి

మంజూరు పత్రాల పంపిణీ పూర్తి

ఈసారి 4,63,857 మంది

కొత్త లబ్ధిదారులకు పింఛన్లు

హైదరాబాద్,నవంబరు16,ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా చేయూత నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఊరు వాడా ఉత్సాహంగా కొనసాగుతోంది. కొత్తగా మంజూరైన 4,63,857 మంది లబ్ధిదారులకు సామాజిక భద్రత కల్పించే ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు దాదాపు 3 లక్షల మందికి మంజూరు పత్రాల పంపిణీ పూర్తైంది. మొత్తం లబ్ధిదారుల్లో సుమారు 60 శాతం మందికి మంజూరు పత్రాలు అందాయి. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పంపిణీ కార్యక్రమాల్లో అధికార, విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కలిసి పాల్గొంటున్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అర్హులను గుర్తించడంతో ఎక్కడా అభ్యంతరాలు వ్యక్తం కావడం లేదు. అధికార, విపక్షాలు కలిసి సంతోషంగా పింఛన్ మంజూరు పత్రాలు అందజేస్తుండటంతో కార్యక్రమాలు సజావుగా కొనసాగుతున్నాయి. ప్రతి ప్రాంతంలో లబ్ధిదారులకు సహాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. సాంకేతిక లేదా ఇతర కారణాలతో ఒకరిద్దరికి పింఛన్లు నిలిచిపోయిన సందర్భాల్లో సమస్యలను



అక్కడికక్కడే గుర్తించి అధికారులు వెంటనే పరిష్కరిస్తున్నారు. అవసరమైన చోట ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి అర్హతను నిర్ధారించిన అనంతరం పంపిణీ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు.ములుగులో మంత్రి సీతక్క, హుస్నాబాద్‌లో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. ధర్మపురిలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సంగారెడ్డిలో మంత్రి దామోదర రాజనర్సింహ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు పరిగిలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌లో యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్లలో అనిరుధ్‌రెడ్డి, తుంగతుర్తిలో ఎమ్మెల్యే మందుల సామేలు, జుక్కల్‌లో లక్ష్మీకాంత్‌రావు, ఎల్లారెడ్డిలో మదన్ మోహన్‌రావు, మక్తల్‌లో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.మేడ్చల్‌లో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొనగా, ఆలేరులో బీర్ల ఐలయ్య, నర్సాపూర్‌లో మంత్రి వివేక్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు.

అర్హులందరికీ పింఛన్లు: మంత్రి సీతక్క

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అర్హులందరికీ పింఛన్ అందించాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత కార్మికులు, గీత కార్మికులు తదితర అర్హులైన వర్గాలకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. పింఛన్ అనేది పేదలకు ప్రభుత్వంచేసే సాయంకాదని, వారి జీవి తానికి భరోసా అని సీతక్క స్పష్టం చేశారు. ఇప్పటివరకు పింఛన్ అందని అర్హులైన కుటుంబాలను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి చేయూత అందాలి.. ఏ ఒక్క అర్హుడు కూడా సంక్షేమానికి దూరం కాకూడదని మంత్రి సీతక్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

ఉద్దాల ఉత్సవానికి పోటెత్తిన భక్తులు

స్వామి ఉద్దాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ పూజలు

చిన్నచింతకుంట, నవంబర్ 16 ప్రభాతవార్త, శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన ఉద్దాల మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. చిన్న వడ్డేమాన్‌లోని ఉద్దాల మండపం వద్ద స్వామివారి పాదుకలను చర్మకారులు వారం రోజులపాటు నియమ నిష్ఠలతో తయారుచేసిన స్వామివారి ఉద్దాలను దర్శించుకునేందుకు జిల్లా నలు మూలల నుంచే కాకుండా మల్లె ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారి పాదుకలను తాకి పునీతులయ్యారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి శ్రీనివాస్ గౌడ్ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వట్టెం రాజేశ్వరి రాము లు దర్శించుకున్నారు.

చాటకు ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేక పూజలు...

పల్లమర్రి గ్రామంలో మేదరులు భక్తిశ్రద్ధలతో తయారుచేసిన చాటును సోమవారం ఉదయం ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అందమైన పూలతో అలంకరించిన ట్రాక్టర్ లో స్వామివారి పాదుకల నుంచే చాటను ఉంచి బ్యాండ్ మేళాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఉద్దాల చాటను దర్శించుకున్నారు. అక్కడి నుంచి లాలకోట, నెల్లికొండి పెద్ద వడ్డేమాన్ గ్రామాలకు చెందిన గ్రామస్తులు స్వామివారి పాదుకల చాటను దర్శించుకుని పునీతులయ్యారు. చాట ఊరేగింపులో వందలాదిగా భక్తులు తరలివచ్చారు. చిన్న వడ్డేమాన్ లోని ఉద్దాల కర్మాగారానికి చాటును చేర్చారు.

ఉద్దాలకు ప్రత్యేక పూజలు..

పల్లెమర్రి నుంచి చాట ఉద్దాల మండపానికి చేరుకోగానే అంతకుముందే అప్పంపల్లి నుంచి నెల్లి వంశీయులు ఉద్దాల కర్మాగారానికి చేరుకున్నారు. స్వామివారి ఉద్దాల మండపంకు స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి చేరుకుని మండపంలోని స్వామివారి పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అనంతరం చర్మకారులు శ్రీ కురుమతి స్వామి లక్ష్మీదేవి అమ్మవార్ల పాదుకలను ఉద్దాల మండపం ముందు అరుగుపై కి చేర్చారు అక్కడ చాటలో స్వామివారి పాదుకలను ఉంచి ముందుగా నెల్లి వంశీయులు తొలి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ స్వామి వారి ఉద్దాలకు మంగళ హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. వీరితోపాటు దేవస్థాన చైర్మన్ బత్తుల బాలరాజ్, ఈవో మదనేశ్వర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ వట్టెం స్వప్న శివకుమార్, సిద్ధార్థ రెడ్డి, అక్కడి నుంచి ఉద్దాల ఊరేగింపు కొనసాగింది స్వామి వారి పాదుకలను తాకేందుకు భక్తులు పోటీపడ్డారు. పోలీసులు స్వామి వారి ఉద్దాల ఉంచిన చాటను భక్తులపై తీసుకు వెళ్తూ ముందుకు సాగారు. సమీపంలోని ఊక చెట్టు వాగులోకి ఉద్దాల ఊరేగింపు చేరుకోగానే అక్కడ వేలాదిగా తరలివచ్చిన భక్తులతో చిన్నపాటి తిరునాళ్ల కనిపించింది. అక్కడి నుంచి చిల్లబాట వెంట స్వామివారి పాదుకలను తలపై అమ్మవారి పాదుకలను మోచేతుల ఆధారంగా కాలినడకన వందలాదిగా భక్తుల నడుమ ఊరేగింపు కొనసాగింది. తిరుమలాపూర్ గ్రామానికి చేరుకోగానే గ్రామస్తులు స్వామివారి ఉద్దాలకు ఘన స్వాగతం పలుకుతూ స్వామి వారి పాదుకలను తాకి పులకరించిపోయారు. స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి స్వామి వార్ల పాదుకలను అందమైన పూలతో అలంకరించిన ట్రాక్టర్ పై ఉంచి లక్షలాది భక్తుల గోవింద నామస్మరణ బ్యాండ్ మేళాలు బాణాసంచా పేలుళ్ల నడుమ జాతర ప్రాంగణంలోని ఉద్దాల గుండుకు చేర్చారు. అక్కడికి స్వామి వార్ల ఉద్దాలు రాగానే శిగసత్తుల పూనకాలతో ఆ ప్రాంతమంతా భక్తి భావంతో నిండిపోయింది. శిగ సత్తులను అదుపు చేయడంలో పోలీసులు ఇబ్బందులు పడ్డారు. ఉద్దాల గుండునుంచి కొండ దిగువన జాతర మైదానానికి స్వామివారి ఉద్దాలు చేరుకోవడంతో మూడుమార్లు ప్రదక్షిణలు చేసిన అనంతరం ప్రముఖులు స్వామివారి ఉద్దాలకు ప్రత్యేక పూజలు చేశారు అక్కడి నుంచి స్వామి వారి ఉద్దాలను కొండపై ఉన్న ఉద్దాల మండపానికి చేర్చి ప్రత్యేక పూజలు చేశారు.



స్వామివారి పాదుకులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

వాచ్‌మన్ హత్య కేసులో బాల నేరస్తుడు అరెస్ట్

మృతుడి మర్మాంగం కోసిన నిందితుడు

ఘట్‌కేసర్, నవంబరు 16, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో జరిగిన వాచ్‌మన్ హత్య కేసులో ఘట్‌కేసర్ పోలీసులు బాలనేరస్తుడిని అదుపులోకి తీసుకున్నారు. తన సమ ఉద్యోగి, దూరపు బంధువు అయిన కుంటిగోర్ల శివ (27)ను హత్య చేసిన కేసులో ఒక బాల నేరస్తుడిని సోమవారం అవుషాపూర్‌లో అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడు మృతుడిని సిమెంట్ ఇటుకతో ముఖం, తలపై పదే పదే కొట్టి హత్య చేసి ఆతర్వాత కత్తితో మృతుడి మర్మాంగాన్ని కోసినట్లు పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా సత్తెనపల్లి యానాది కాలనీకి చెందిన కేసబోయిన శ్రీనివాస్ (17) అవుషాపూర్ జగత్ స్వప్న స్పార్కిల్ క్యాస్టిల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మృతుడు, బాల నేరస్తుడు ఇద్దరూ ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు కాగా జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి అవుషాపూర్‌లోని జగత్ స్వప్న స్పార్కిల్ క్యాస్టిల్‌లో రాత్రి వాచ్‌మెన్‌లుగా పని చేస్తున్నారు. డబ్బు విషయంలో వారి మధ్య వివాదాలు తలెత్తాయి. ఆసమయంలో మృతుడు బాల నేరస్తుడిని, అతని తల్లిని దూషించినట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మద్యం సేవిస్తుండగా ఇద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగింది. దీంతో ఆగ్రహించిన బాల నేరస్తుడు మృతుడిని కిందకు తోసి, చంపాలనే ఉద్దేశంతో సిమెంట్ ఇటుకతో ముఖం, తలపై పదే పదే కొట్టాడు. దీంతో మృతుడు అక్కడికక్కడే మరణించాడు. ఆతర్వాత గదిలో ఉన్న కూరగాయలు కోసే కత్తితో మృతుడి మర్మాంగాన్ని కోశాడు. విచారణలో భాగంగా ఘట్‌కేసర్ పోలీసులకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బాల నేరస్తుడు శ్రీనివాస్ అవుషాపూర్‌లో తిరుగుతున్నట్లు సమాచారం అందడంతో దాని ఆధారంగా 3:30 గంటలకు అతన్ని అదుపులోకి తీసుకుని న్యాయస్థాన కస్టడీకి పంపారు. ఘటనా స్థలంలో సిమెంట్ ఇటుక, కత్తి, ఘటనా స్థలంలో రక్తపు మరకలు, విరిగిన బీర్ బాటిల్ ముక్కలు, ఇటుకలను స్వాధీనం చేసుకున్నారు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పి.కిరణ్ నాయకత్వంలో ఎస్ఐ ఎ.రాఘవేంద్ర, సిబ్బంది ఈహత్య కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు పూర్తి చేశారు. ఈ హత్య కేసులో బాలనేరస్తుడిని కోర్టుకు తరలించారు.

విజయ డెయిరీ చైర్మన్ దాసరి ఎన్నిక రద్దు

కీలక ఆదేశాలు జారీ చేసిన ఎపి హైకోర్టు

అమరావతి,నవంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విజయ డెయిరీ ఎన్నికలకు సంబంధించి కీలకమైన తీర్పును వెలువరించింది. డెయిరీ చైర్మన్ డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావుతో పాటు మరో నలుగురు డైరెక్టర్ల ఎన్నిక చెల్లదంటూ న్యాయస్థానం స్పష్టం చేసింది. వారి ఎన్నికను రద్దు చేస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో పాలకవర్గంలోని ఐదుగురు కీలక సభ్యుల పదవులు రద్దయ్యాయి. వీరిలో గన్నవరం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న చైర్మన్ దాసరి వెంకట బాలవర్ధనరావుతో పాటు, ఘంటసాల డైరెక్టర్ సాయి, గన్నవరం డైరెక్టర్ పాలడుగు నాని, నందిగామ డైరెక్టర్ నాగేశ్వర రావు, మైలవరం డైరెక్టర్ శైలజ ఉన్నారు. విజయ డైరీ ఎన్నికల ప్రక్రియపై గతంలో హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల్లో వీరిపై పోటీ చేసిన ప్రత్యర్థి అభ్యర్థులను నిబంధనలకు విరుద్ధంగా డిఫాల్టర్లుగా ప్రకటించారన్నది ప్రధాన వివాదంగా మారింది. పోటీదారుల అర్హతలు, ఎన్నికల నిర్వహణలో పాటించిన నిబంధనల చట్టబద్ధతను సవాలు చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై సమగ్ర విచారణ జరిపిన హైకోర్టు, ఐదుగురు సభ్యుల ఎన్నిక చెల్లదని తేల్చిచెప్పింది. ఈ తీర్పు విజయ డైరీ పాలనా వ్యవహారాల్లో పెద్ద సంచలనంగా మారింది. తదుపరి కార్యాచరణను నిర్ణయించేందుకు పాలకవర్గం త్వరలోనే అత్యవసర బోర్డు సమావేశాన్ని ఏర్పాటుచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మేధో వైకల్యమున్న వారిని గౌరవించాలి

జవహర్‌నగర్,నవంబరు 16,ప్రభాతవార్త : మేధో వైకల్యం ఉన్నవారిని గౌరవించడంతోపాటు వారికి ఉన్నత అవకాశాలు కల్పించాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.సికింద్రాబాద్‌లో మేధో వైకల్యం ఉన్నవారి విద్య,సంరక్షణ,శిక్షణ,పునరావాసం కోసం 1991లో ప్రారంభమైన స్వయంకృషి సంస్థ 35వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో వెంకయ్య నాయుడు వర్చువల్‌గా ప్రసంగించారు. గత 35 ఏళ్లుగా సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. వారికి జాలి చూపడం కంటే వారి సామర్థ్యాలను గుర్తించి, స్వతంత్రంగా జీవించేలా ప్రోత్సహించడం ముఖ్యమన్నారు.సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ మంజులా కళ్యాణ్‌తోపాటు సిబ్బందిని అభినందించారు. మంత్రి సీతక్క సంస్థ ప్రాంగణాన్ని సందర్శించి,విద్యార్థులు తయారుచేసిన నమూనాలను పరిశీలించారు. సీనియర్ పాత్రికేయుడు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు పత్రికలు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

ఉత్తమ్‌వన్నీ అబద్ధాలు: సుధీర్‌రెడ్డి

హైదరాబాద్,నవంబరు16,ప్రభాతవార్త: నగరానికి నీటి కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి తాగునీళ్ల దొరకవంటాడు, ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటి కొరత లేదంటాడు. ప్రజలు ఎవరి మాటలు నమ్మాలి? అని ప్రశ్నించారు. 2.33 లక్షల ట్యాంకర్లు సరఫరా చేశామని అధికారులే చెబుతున్నారని, నీటి కొరత లేనప్పుడు ట్యాంకర్లు ఎందుకు? అని ప్రశ్నించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సింగూరు, మంజీరా నుంచి నీళ్లు తీసుకునే పరిస్థితి లేదని, గోదావరినుంచి నీళ్లు ఎత్తిపోలేదు కాబట్టి అక్కడి నుంచి కూడా నీళ్లు రావని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నీటిసమస్య వస్తుందని కేటీఆర్ ముందే చెప్పారని గుర్తుచేశారు. తీవ్రమైన వాటర్ సమస్య ఉందని జలమండలి ముందు బీఆర్ఎస్ ధర్నా చేసిందన్నారు. ఈ నెలలోనే హైదరాబాద్‌లో బోర్లు ఎండిపోయాయన్నారు, నగరంలో నీటి సమస్య మరింత పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో నీటి సమస్య ఉంటే గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తారా? అని ప్రశ్నించారు. ఎల్‌నినో వస్తుందని తెలిసినా రేవంత్‌రెడ్డి నిరక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో రేవంత్‌రెడ్డి బ్లైం పాసుచేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ఎవరిఫోన్లు ట్యాప్ చేయలేదని, బీఆర్ఎస్ నేతల ఫోన్లనే రేవంత్‌రెడ్డి ట్యాప్ చేస్తున్నారని ఆరోపించారు.

భర్తను కడతేర్చిన భార్య

కొండాపూర్ మజీద్ బండలో దారుణ ఘటన

హైదరాబాద్ (గచ్చిబౌలి), నవంబరు 16 ప్రభాతవార్త: అనుమానంతో వేధింపులకు గురిచేసిన భర్తను హత్య చేసిన భార్య ఉదంతం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కొత్తపేటకు చెందిన మొరంపూడి సూరిబాబు(44) తన భార్య మొరంపూడి రమణ(39), కుమారుడితో కలిసి రెండేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు సూరిబాబు 20 రోజులుగా కొండాపూర్ మజీద్‌బండలోని సీఎంసీ లేఅవుట్‌లో గల నిర్మాణ స్థలంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. సూరిబాబు నిత్యం మద్యం సేవించి వచ్చి, భార్య రమణ మీద అనుమానంతో గొడవపడేవాడు. శారీరకంగా, మానసికంగా వేదింపులకు గురిచేస్తుండడంతో భార్య రమణ తన భర్తను అంతమొందించాలని నిర్ణయించుకుంది. నవంబరు 6వ తేదీన అర్ధరాత్రి సూరిబాబు మద్యం మత్తులో రమణతో గొడవపడి భార్య మీద చేయి చేసుకున్నాడు. దీనిని ప్రతిఘటించిన రమణ భర్త సూరిబాబును తోసివేసి నిర్మాణ పనుల కోసం ఉంచిన చెక్క కర్రతో తల, శరీరం మీద తీవ్రంగా కొట్టింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సూరిబాబును కొండాపూర్ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నవంబరు 11వ తేదీన సాయంత్రం సూరిబాబు మృతిచెందాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు భార్య రమణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.



నిందితురాలు రమణ

ప్రజాపాలనలో 2 లక్షల ఇండ్లు కట్టించాం

గజ్వేల్, నవంబరు 16 (ప్రభాతవార్త): రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల ఇళ్లు కట్టించిన ఘనత కాంగ్రెస్ సర్కార్‌కే దక్కిందని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఒక్కో ఇంటికి ప్రతినెలా రూ.1200 కరెంటును ఉచితంగా అందిస్తోందన్నారు. కొత్తగా మంజూరైన చేయూత పెన్షన్లను పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. గజ్వేల్ మహతి ఆడిటోరియంలో మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్లను, కొత్తగా మంజూరైన చేయూత పెన్షన్లను లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ఖజానా మొత్తాన్ని కేసీఆర్ ఖాళీ చేశారని విమర్శించారు.అర్హులందరికీ చేయూత పెన్షన్లు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గజ్వేల్ నియోజకవర్గంలో తొలి విడతలో 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్టు తెలిపారు. రెండో విడతలో నియోజకవర్గానికి 2వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు కానున్నాయన్నారు. ఈనెల 19న సిద్దిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు.



మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

హామీలు నెరవేర్చాలి : యాదవరెడ్డి

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి డిమాండ్ చేశారు. మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో 2వేలు ఉన్న పెన్షన్‌ను రూ.4వేలు చేస్తామని, వికలాంగులకు రూ.4వేలు ఉన్న పెన్షన్‌ను రూ.6వేలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 3 సంవత్సరాలు అవుతున్నా పెన్షన్లను పెంచలేదన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో అయినా

19న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రారంభం

నూతన పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి

పెన్షన్లు పెంచేందుకు కృషి చేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామికి ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి చేయూత పెన్షన్ లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున జిల్లాలో ఆరుతడి పంటలు మాత్రమే పండించాలని రైతులకు సూచించారు.వరి సాగుకు రైతులు దూరం కావాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, ఏఎంసి చైర్మన్లు వంటేరు నరేందర్‌రెడ్డి, విరూపాక శ్రీనివాస్‌రెడ్డి, విజయ మోహన్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు బాబూచంద్ తదితరులు

వాలీబాల్‌లో మెరిసిన ఐనాపూర్ విద్యార్థులు

దోమ నవంబరు 16 ప్రభాతవార్త: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో దోమ మండలం ఐనాపూర్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఐనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.రామకృష్ణ, ఎం. విజయ్ లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టుకు ఎంపికై అద్భుత ప్రదర్శన కనబరిచారు. వీరి కృషితో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుని జిల్లాకు ఖ్యాతి తీసుకొచ్చింది. విద్యార్థుల విజయం వెనుక పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కె. సత్యనారాయణ కృషి ఎంతోఉందని పాఠశాల యాజమాన్యం తెలియజేసింది. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎంతో శ్రద్ధతో వారికి శిక్షణ ఇచ్చి, రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులను సిద్ధంచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యనారాయణను అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాబూచంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు విజేతలను ఘనంగా సన్మానించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగితే భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ రాణించగలరని హెచ్ఎం బాబూచంద్ ఆకాంక్షించారు. విద్యార్థులను పలువురు అభినందించారు.



మహిళా డాక్టర్లే మేలు !

వివిధ కారణాలతో అత్యవసర సేవల కోసం హాస్పిటల్‌లో చేరిన 7.5లక్షల మంది మహిళల డేటాను పరిశీలించారు. చూస్తే రుగ్మతలపై చెప్పుకునేందుకు మహిళల లేడీ డాక్టర్లనే ఎంచుకుంటారని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు. ఫిజీషియన్లుగా మహిళలు ఉంటే. పేషెంట్లు చనిపోవడం, తిరిగి హాస్పిటల్‌లో చేరడం లాంటివాటికి ఆస్కారం తక్కువని పేర్కొన్నారు. ఇది మహిళలూ, పురు షులూ ఇద్దరి విషయంలోనూ వాస్తవమని తేలింది. మహిళా పేషెంట్ల విషయంలో ఇంకాస్త మెరుగైన ఫలితాలున్నా యట. డాక్టర్ల జెండర్ ఎందుకు వైద్య నిపుణులు కచ్చితంగా చెప్పకపోయినా, మహిళా వైద్యులు మహిళా పేషెంట్లతో బాగా మాట్లాడి వివరాలు ఎక్కువగా తెలుసుకుంటారనీ, దీనివల్ల వ్యాధి నిర్ధారణ మెరుగ్గా ఉంటాయనే అంచనాకు వచ్చారు. ◻

తడి స్పాంజితో మిలమిల

మేకప్ సరిగా వేసుకోకపోతే ముఖంపై గీతలు కనిపిస్తాయి. మేకప్ త్వరగానూ పోతుంది. అలాకాకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించ మంటున్నారు నిపుణులు.



ముందు నిర్జీవంగా మారిన చర్మానికి తగిన తేమ అందించి మేకప్‌కి అనువుగా మార్చుకోవాలి. ఇందుకోసం పావుకప్పు పెసరపిండిలో సిని పాలు పోసి ఈ మిశ్రమంతో ముఖాన్ని స్క్రబ్ చేసుకోవాలి. పావుగంటయ్యాక చల్లటి నీళ్లతో ముఖం కడిగి మాయిశ్చరైజర్ రాస్తే సరి. మృత కణాలు తొలగి చర్మం తాజాగా, ఆరోగ్యంగా కనిసిస్తుంది. మేకప్ వేస్తే నిండుగా ఉంటుంది. ముఖంపై ప్యాచులూ, గీతలూ, మచ్చలూ కనిపించకూడదంటే పౌడర్ ఆధారిత కీన్సలర్లు, మ్యాటిఫైయింగ్ సౌందర్య ఉత్పత్తులకు దూరంగా ఉండండి. బదులుగా ద్రవరూపంలో ఉన్నవాటిని మాత్రమే వాడండి. కన్సీలర్, ఫ్రైమర్‌లని వాడేందుకు తడి స్పాంజిని వినియోగించడం వల్ల సరిగ్గా పరచుకుంటాయి. నీటి ఆధారిత మస్కారా, కాజల్ వంటివి వాడటం వల్ల అవి ఎక్కువ సేపు పాడవకుండా ఉంటాయి. ఐషాడో కోసం వీడియం కలర్స్‌నే వాడండి. అవి మీకు కొత్త లుక్‌ని తెచ్చిపెడతాయి. ఈ కాలంలో పెదాలు పొడిబారి పగులుతుంటాయి. ఆ ఇబ్బంది లేకుండా తరచూ లిప్‌బామ్ రాసుకోవాలి. పంచదార, తేనె కలిపిరుద్దితే మృతచర్మం పోతుంది. ఆ తర్వాతనే లిప్‌స్టిక్ మీ అందాన్ని మరింత పెంచుతుంది. ◻

ఆ కుంకుమ మంచిదేనా ?



కుంకుమ సౌభాగ్యానికి చిహ్నం. ఈ వంటి పెళ్లైన మహిళలు కుంకుమ వాడడం సహజమే! కొం దరు దీన్ని నుదుటన పెట్టుకుంటే.. మరికొందరు పాపిట్లో దిద్దుకుంటారు. అయితే ఈ రోజుల్లో కుంకుమ వాడే కొన్ని రకాల చర్మ సమస్యలు చూస్తున్నారు.వీటికి తయారీలో వాడే హానికారక రసాయనాలే కారణమంటున్నారు నిపుణులు. అందుకే కొనే ముందే కుంకుమను పరిశీలించడం తప్పనిసరి అంటున్నారు. ఈ రోజుల్లో మార్కెట్లో కల్తీ కాని వస్తువు లేదంటే అతిశయోక్తి కాదు. సహజసిద్ధంగా పండే పంటలు మొదలు తినే ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్నారు కొందరు. అంతేకాదు.. ఈ కల్తీ వల్ల సౌందర్యోత్పత్తు లూ తమ సహజ త్వాన్ని కోల్పోతు న్నాయి. వీటిలో కుంకుమ కూడా ఒకటి.సహజంగా తయారు చేసిన కుంకుమ ముదురు ఎరుపు రంగులో ఉంటుంది.. లేదంటే కాస్త ఆరెంజ్ షేడ్‌లో దొరుకుతుంది. అయితే కొంతమంది వీటికి కృత్రిమ రంగులు, మెరిసేలా చేయడానికి లెడ్ మెర్క్యురీ వంటి రసాయనాలు కలుపుతున్నారు. ఇలాంటి కల్తీ కుంకుమ వాడడం వల్ల చాలామందిలో చర్మానికి సంబంధించిన అలర్జీలు, ర్యాషెస్, దురద, ఆ ప్రదేశంలో చర్మం ఎరుపెక్కడం.. వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. మరికొందరిలో ఆ చర్మ భాగం నల్లగానూ మారుతుంటుంది. అయితే ఇలాంటి రసాయన పూరిత కుంకుమను ఉపయోగించడం వల్ల చర్మానికే కాదు.. ఆరోగ్యానికి హానికరమే అంటున్నారు నిపుణులు. ఇలాంటి కుంకుమను దీర్ఘకాలం పాటు వాడితే.. వీటి తయారీలో వాడిన హానికారక లోహాలు.. శ్వాస సంబంధిత సమస్యలకు దారితీయడంతో పాటు నాడీ, కణాలు, ప్రత్యుత్పత్తి వ్యవస్థలపైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది! ఫలితంగా ఆయా అవయవాలకు సంబంధించిన సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు.అటు ఆరోగ్యపరంగా, ఇటు సౌందర్య పరంగా ఆయా సమస్యలు రాకుండావారించుకోవాలంటే. కొనే ముందే కుంకుమలోని కల్తీని కనిపెట్టడం మంచిదంటున్నారు నిపుణులు. కొన్ని విషయాని చిట్కాలు మేలు చేస్తాయంటున్నారు కుంకుమ సహజ రంగులో కాకుండా గులాబీ, కాషాయం, మరీ ముదురుగా.. ఇలా విభిన్నంగా చాలంటే రంగుల్లో దొరుకుతుంది. ఇలాంటి కుంకుమ కృతిమ రంగులు ఉపయోగించి తయారు చేసిందే అని గుర్తించాలని నిపుణులు అంటున్నారు, అందుకే ఉన్న కుంకుమ కొనకపోవడమే మంచిదంటున్నారు. సహజసిద్ధంగా తయారుచేసిన కుంకుమ గాఢమైన వాసనను కలిగి ఉండడ! ఒక రకమైన ఆహ్లాదకరమైన వాసనను కలిగి ఉంటుంది. అలా కాకుండా రసాయనాలు కలిపినట్లుగా గాఢమైన వాసన వచ్చినా, ఒక రకమైన లోహపు వాసన వచ్చినా.. దీన్ని కల్తీ కుంకుమగా దించవచ్చు. నీటి పరీక్ష ద్వారా కూడా కల్తీ కుంకుమను కనిపెట్టవచ్చు! ఈ విధంగా ఒక గ్లాసు నీటిలో కొద్దిగా కుంకుమ వేసి కలపాలి. అసలు కుంకుమ అయితే అది పూర్తిగా నీటిలో కలిసిపోతుంది. అదే నకిలీదైతే... నీళ్లు ఆయా రంగులోకి మారి పదార్థపు అవశేషాలు అడుక్కి చేరతాయంటున్నారు.నిపుణులు.. ◻

బిల్వార్చన



'త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రం త్రియాయుధం త్రిజన్మ పాప సంహారమ్ ఏకబిల్వం శివార్పణం" అంటూ మహా దేవుడిని పూజిస్తారు. ఈ త్రిదళ బిల్వ పత్రంలో కుడివైపు విష్ణువు, ఎడమవైపు బ్రహ్మ, మధ్యలో శివుడు కొలువై ఉంటారట. హిందూ ధర్మంలో బిల్వ పత్రానికి అత్యంత విశిష్ట స్థానం ఉంది. దీనిని మారేడు దళం అని కూడా అంటారు. బిల్వపత్రం మహాదేవుడికి అత్యంత ప్రీతిపాత్రమైనది. సాధారణంగా ప్రతి శివాలయంలో బిల్వ వృక్షం ఉంటుంది.వ్యాస మహర్షి రచించిన శివమహాపురాణం ప్రకారం కార్తికమాసంలో బిల్వ దళంతో శివుని అర్చిస్తే మూడు జన్మల్లో చేసిన పాప దోషాలు తొలగి పోతాయని తెలుస్తోంది. యుద్ధంలో గెలవడానికి ఆయుధాలు ఎంత అవసరమో, పాపాలను తొలగించు కోవడానికి బిల్వ దళంతో శివారాధన చేయడం కూడా అంతే ముఖ్యం. పరమ శివునికి ప్రీతికరమైన బిల్వ వృక్షానికి ఎంతో విశిష్టత ఉంది. సాధారణంగా అన్ని వృక్షాలు మొదట పువ్వు పూచి, తర్వాత అది కాయగా మరుతుంది. కానీ బిల్వ వృక్షం మాత్రం మొదట కాయగానే మనకు కనిపిస్తుంది. హిందూ సంప్రదాయం ప్రకారం కాడ లేని పుష్పాలు, కాయలు, ఆకులు మాత్రమే దేవుని పూజలో ఉపయోగిస్తాం. కానీ బిల్వ దళాలను మాత్రం కాడ తోనే బిల్వ వృక్షం నుంచి సేకరించి శివున్ని ఆరాధిస్తే శుభ ఫలితాలు అందు తాయని శివ పురాణం ద్వారా తెలు స్తోంది. కోటికన్యా మహాదానం ఏకబిల్వం శివార్పణమ్ సాధారణంగా పూలు కానీ, ఆకులు కానీ ఎండితే పూజకు పనికిరావు కానీ మారేడు దళం ఆకులు ఎండినా కూడా పూజకు ఉపయోగి స్తారు. కోటి ఏనుగుల దాన ఫలం, నూరు యజ్ఞాల ఫలం, కోటి కన్యాదానాల వల్ల కలిగే ఫలం ఒక్క బిల్వపత్రం శివపూజకు సమర్పించడం వల్ల లభిస్తుందని శాస్త్రవచనం. కార్తిక మాసంలో బిల్వ పత్రాలతో నిత్యం శివ పూజ చేయడం ద్వారా అనంత కోటి పుణ్య ఫలాలు దక్కుతాయని శివమహాపురాణం ద్వారా తెలుస్తోంది. అంతేకాదు శ్రీ మహాలక్ష్మీ దేవి మారేడు దళాలలో స్థిరనివాసం ఉంటుంది. అందుకే కార్తిక మాసంలో శివుని మారేడు దళాలతో పూజిస్తే ఐశ్వర్య ప్రాప్తి కలుగుతుంది. ఆధ్యాత్మికమే కాదు ఆరోగ్యం కూడాఆయుర్వేద శాస్త్రంలో వివరించిన ప్రకారం బిల్వ వృక్షం కింద సేద తీరే సమయంలో ఆ చెట్టు గాలి మనపై వీస్తే శరీరంలో అనారోగ్యాలు, దోషాలు పోతాయని తెలుస్తోంది. ఈ కార్తికమాసంలో మారేడు దళాలతో శివుని పూజిద్దాం ఆయురారోగ్య ఐశ్వర్యాలను పొందుదాం. ◻

పాషకాల మురి'పాలు'



సోయాపాలు – సోయా బీన్స్ నుంచి తయారయ్యే ఈ పాలలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయంటు న్నారు నిపుణులు. ఆవుపాలతో సమానమైన పోషకాల్ని ఈ పాల నుంచి పొందచ్చంటున్నారు.

కొబ్బరి పాలు – పచ్చి కొబ్బరి నుంచి తీసిన ఈ పాలు చిక్కగా, క్రీమీగా ఉంటాయి. మంచి కొవ్వులు, విటమిన్ 'సి' పుష్కలంగా లభించే ఈ పాలలో క్యాలరీలు చాలా తక్కువ! అందుకే బరువు తగ్గాలనుకునే వారికి ఇది చక్కటి ఆహారం అంటున్నారు నిపుణులు.

ఓట్స్‌పాలు – ముడి ఓట్స్ లేదా ఓట్‌మీల్‌ను నీటితో కలిపి వీటిని తయారుచేస్తారు. క్రీమీగా ఉండే ఈ పాలు రుచికి కాస్త తియ్యగా ఉంటాయి. ఈ పాలలో పుష్కలంగా ఉండే ఫైబర్ జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. అంతేకాదు. పాల ప్రత్యామ్నాయాలనిననంటిలోకెల్లా ఇందులో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయని చెబుతున్నారు నిపుణులు.

బియ్యపు పాలు - మిల్లులో ఆడించిన బియ్యం, నీళ్లు.. ఈ రెండూ కలిపి ఈ పాలను తయారుచేస్తారు. ఆవు పాల కంటే పల్చగా ఉండే ఈ పాలు తియ్యటి రుచిని కలిగి ఉంటాయి. మాంగనీస్, సెలీనియం.. వంటి యాంటీ ఆక్సిడెంట్ల మిళితమైన ఈ పాలు అన్ని రకాల ఇన్ఫెక్షన్ల నుంచి శరీరాన్ని కాపాడతాయి. తద్వారా రోగనిరోధక వ్యవస్థ మెరుగుపడుతుంది. అంతేకాదు.. క్యాన్సర్ల ముప్పును తగ్గించడం లోనూ ఈ పాలు శ్రేష్ఠమని నిపుణులు చెబుతున్నారు. నట్ మిల్క్-బాదం, పల్లీలు, హేజల్‌నట్స్, జీడిపప్పు.. మొదలైన గింజ ధాన్యాలతో తయారుచేసిన పాలు కూడా ప్రస్తుతం మార్కెట్లో దొరుకుతున్నాయి. వీటిలో క్యాలరీలు తక్కువగా ఉండడంతో పాటు క్యాల్షియం, విటమిన్ 'డి', విటమిన్ 'బి 12' వంటి పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవిగుండె సమస్యల ముప్పును తగ్గించి ఎముకల దృఢత్వాన్ని పెంపొందిస్తాయి. ◻

తార

వెనుక ఉండి నన్ను ప్రేమించే నా ఫ్యాన్స్ అందరికీ కృతజ్ఞతలు. ఈ ఫంక్షన్‌ను ఇంత గ్రాండ్ సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ థాంక్యూ. నాకు దుల్కర్ గారంటే చాలా ఇష్టం.

'ఆకాశంలో ఒక తార' ప్రి రిలీజ్‌లో అల్లు అర్జున్



'ఆకాశంలో ఒక తార' నా కెరీర్‌లో చాలా స్పెషల్ సినిమా. మనమందరం గర్వపడే సినిమాగా నిలుస్తుందని నమ్ముతు న్నాను: హీరో దుల్కర్ సల్మాన్ వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ హీరోగా, క్రియేటివ్ డైరెక్టర్ పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న డిఫరెంట్ ఎమోషనల్ డ్రామా 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆకాశంలో ఒక తార నవంబర్ 20న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో థియేటర్ల లో విడుదల కానుంది ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మాట్లాడుతూ..

మీ అందరి ప్రేమ, అభిమానానికి థాంక్యూ. ఒక ఆర్మీలా నా మలయాళం, తమిళం, హిందీ, తెలుగు ఇలా అన్నీ భాషల్లో అద్భుత మైన సినిమాలు చేస్తున్నారు. 'మహానటి', 'సీతారామం','లక్కీ భాస్కర్' ఇలా ఆయన విజయాలు కొనసాగు తున్నాయి. హీరో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ... 'సీతారామం' తర్వాత ఈ కథ విన్నాను. కథ విన్నప్పుడే చాలా స్పెషల్‌గా అనిపించింది. కచ్చితంగా ఇది నా కెరీర్‌లో ఒక స్పెషల్ సినిమాగా నిలిచిపోతుందని నమ్ముతున్నాను. స్వప్నకు, అల్లు అరవింద్‌కి థాంక్యూ. అల్లు అరవింద్ చాలా డెడికేషన్‌తో వర్క్ చేస్తారు. ఆయన ఎంతో ఎనర్జీగా ఉంటారు. బహుశా బన్నీ కూడా అంత ఎనర్జీగా ఉండటానికి కారణం అరవింద్. గుణ్ణం గంగరాజుకి థాంక్యూ. ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ మాట్లాడుతూ.. బన్నీ ఫ్యాన్స్‌కు, దుల్కర్ ఫ్యాన్స్‌కు నమస్తే. మొన్న దుల్కర్ టూర్‌కు వెళ్లినప్పుడు అక్కడి ఆడియన్స్ ఇచ్చిన రెస్పాన్స్ అద్భుతంగా ఉంది.

'ది మేజ్" ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుంది: హీరో శ్రీరామ్



'ది మేజ్" ట్రైలర్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ సక్సెస్ అవుతుంది రాహుల్ రవీంద్రన్ డైరెక్టర్ తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించు కున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా "ది మేజ్". ఈ మూవీలో ప్రియాంక, ప్రాతిక ద్రినివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. డీవోపీ శివకృష్ణ మాట్లాడుతూ మా మూవీ శ్రీష మాట్లాడుతూ మా మూవీ ట్రైలర్ మీకు నచ్చిందని అనుకుం చాలా బాగా వచ్చింది. మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం. నటి టున్నాం. ఈ సినిమాలో హారిక పాత్రలో నటిస్తు న్నాను. నిర్మాత డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి మాట్లాడుతూ ఈ సినిమా కథ చెప్పిన వ్వటి కంటే స్క్రీన్ మీద చూసిన వ్వుడు ఎక్కువ థ్రిల్ అయ్యాను. ఈ సినిమా ప్రివ్యూ చూస్తున్నవ్వుడు సెకండ్ఫ్ చూపి ప్పుకోలేక పోయాను. నటుడు రవివర్మ మాట్లాడుతూ ఈ చిత్రంలో తల్వార్ సింగ్ అనే క్యారెక్టర్‌లో నటించాను. ఈ సినిమాలో థర్టీ ఇయర్స్ పృథ్వీతో కలిసి కొన్ని కామెడీ సీన్స్ చేశాం నటుడు కమల్ కామరాజు మాట్లాడుతూ టాలీవుడ్ లో ది మేజ్ లాంటి సరికొత్త థ్రిల్లర్స్ రావడం మనమంతా సంతోషించదగిన విషయం. ఇలాంటి సినిమా చేయడం సులువుకాదు.

ఘనంగా "కెరూబ్" ట్రైలర్ విడుదల




ఖుషీ ఎంటర్టైన్మెంట్ పతాకంపై విహాన్ కార్తీక్ హీరోగా లీరి నాయుడు దర్శకత్వం వహిస్తూ నిర్మించిన చిత్రం "కెరూబ్". గత, వర్తమాన, భవిష్యత్తు అనేవి ట్యాగ్ లైన్స్. ఈ చిత్రానికి సంగీతం సత్య రాధాకృష్ణ అందించగా, రమేష్ తోకల సినిమాటోగ్రఫీ అందించారు. సీనియర్ దర్శకుడు సముద్ర మాట్లాడుతూ... సినిమా టీజర్, ట్రైలర్ చూడగానే.. మన ఫారెస్ట్ లో చేసిన అవతార్ లాగా అనిపించింది. మన తెలంగాణ లో ఇంత అందమైన అడవుకున్నాయా అనిపించింది. ఈచిత్రం ట్రైలర్ ను ఈరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు, నిర్మాత లీ.రి.నాయుడు మాట్లాడుతూ... నాకు చాలా ఎమోషనల్ గా ఉంది. సక్సెస్ వచ్చినా, ఫెయిల్యూర్ వచ్చినా వాటితో సంబంధం లేదు అనిపిస్తోంది ఈ స్టేజ్ వరకు రావటంతో. కుటుంబం సపోర్ట్ తో ఈ సినిమా చేయగలిగాను. దాదాపు 16 ఏళ్లలో ఈ సినిమా తీయగలిగాను. నాకు సినిమాటోగ్రాఫర్ చిన్నప్పటి నుంచి ఫ్రెండ్. గతంలో నా షార్ట్ ఫిలింకి తనే చేశాడు. ఇప్పుడు ఈ సినిమా కు తనే అద్భుతమైన విజువల్స్ అందించారు. హీరో విహాన్ కార్తీక్ మాట్లాడుతూ.... సినిమాలోకి రావడానికి నాకు నా తల్లిదండ్రులు బాగా ప్రోత్సహించారు. మొదట్లో నేను ఓ తెలుగు సినిమాలో విలన్ పాత్రలో నటించా. అప్పుడే ఈ సినిమాలో నటించే అవకాశం వచ్చింది. దర్శకుడు ఎన్నో రకాలుగా ఆలోచించి ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చారు. ఆయనకు ఎంతో రుణపడి ఉన్న. ఓ కొత్త ఫేస్ కావాలని నన్ను ఎంచుకు న్నారు. దర్శకుడు ఎంతో డీటెయిల్‌గా ఈ సినిమాను తెరకెక్కించారు.

'మన డాక్టర్ బాబే' ప్రి రిలీజ్



'మన డాక్టర్ బాబే' ప్రి రిలీజ్ ఈవెంట్‌లో రాజ్ తరుణ్..మన డాక్టర్ బాబే సినిమాని అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రముఖ నటుడు అలీ..శరణ్య, సుధీక్ష సమర్పణలో స్కంద ఫిల్మ్స్ బ్యానర్ మీద కృతాక్షినిర్మాణంలో తెరు చలపతి కుమార్ పువ్వల తెరకెక్కిస్తున్న చిత్రం"మన డాక్టర్ బాబే. ఈ మూవీతో శ్రీ స్కంద హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాలో మోహన సిద్ధి, శృతి శంకర్, అలీ, రాజీవ్ కనకాల, శాంతి, కోటేశ్వరరావు ప్రముఖ పాత్రలను పోషించారు. ఈ మూవీని నవంబర్ 20న రిలీజ్ చేయబోతోన్నారు అలీ మాట్లాడుతూ.. 'చలపతి మీద నమ్మకంతో శ్రీ స్కంద తన సొంత డబ్బులు పెట్టి' మన డాక్టర్ బాబే చిత్రాన్ని నిర్మించాడు. చలపతి, శ్రీ స్కంద కష్టాన్ని నేను చూశాను. చిన్న చిత్రమా? పెద్ద సినిమానా? అని ఆడియెన్స్ పట్టించుకోరు. కథలో బలం ఉంటే, కంటెంట్ ఉండే ప్రేక్షకులు విజయాన్ని అందిస్తారు. రాజ్ తరుణ్ మాట్లాడుతూ.. .. మన డాక్టర్ బాబే చిత్రంతో నిర్మాతగా, హీరోగా వస్తున్న శ్రీ స్కందకి ఆల్ ది బెస్ట్. తెలుగు హీరోయిన్లను చూస్తుండటం ఆనందంగా ఉంది. అలీతో నటించే అదృష్టం రాకపోయినా.. ఆయనతో స్టేజ్ పంచుకునే అవకాశం ఇప్పుడు వచ్చింది. చలపతికి ఈ చిత్రంతో మంచి విజయం దక్కాలి. డైరెక్టర్ హర్ష చలపతి గురించి ఎంతో గొప్పగా చెప్తుంటాడు. ..హీరో శ్రీ స్కంద మాట్లాడుతూ.. .. మన డాక్టర్ బాబే సినిమాకి ప్రీమియర్లు వేశాం. చూసిన వారంతా అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. చలపతి ఈ మూవీని గొప్పగా తెరకెక్కించారు. నవ్విస్తూ మంచి సందేశాన్ని ఇచ్చేలా సినిమాని రూపొందించారు. దర్శకుడు చలపతి కుమార్ పువ్వల మాట్లాడుతూ.. శ్రీ స్కంద వల్లే మన డాక్టర్ బాబే సినిమా ఈ స్థాయి వరకు వచ్చింది. శృతి శంకర్, మోహన సిద్ధి చక్కగా నటించారు. నిర్మాణంలో కృతాక్షి ఎక్కడా, ఎప్పుడూ రాజీ పడలేదు.

'హే కన్నమ్మ' టీజర్ రిలీజ్



యశ్వంత్, ధనశ్రీ వర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న న్యూ ఏజ్ లవ్ స్టోరీ హే కన్నమ్మ. శశి కుమార్ ముత్తులూరి రచన, దర్శకత్వంలో, జీ స్టూడియోస్ సమర్పణలో, దిల్ రాజు ప్రొడక్షన్స్ LLP బ్యానర్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నా జీవితం నా కలలు నా ఆశలు నా ఇష్టాలు.. నాది నేను అని బ్రతికిన నాకు ఇప్పుడు నీ కళ్ళతో ప్రపంచాన్ని చూస్తుంటే.. నువ్వు కోరుకున్న ప్రేమ ఎలా ఉంటుందో నాకు అర్థం అవుతుంది కన్నమ్మ అనే వాయిస్ ఓవర్ తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. యశ్వంత్, ధనశ్రీ వర్మ పాత్రలని ప్రజెంట్ చేసిన తీరు సినిమాపై ఆసక్తిని పెంచింది. జయ్ కృష్ణ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాంపీ నందిగం సినిమాటోగ్రఫీ, గాంధీ నడికుడికర్ ప్రొడక్షన్ డిజైన్ సినిమాకు మంచి విజువల్ ఫీల్ తీసుకొచ్చాయి. దిల్ రాజు ప్రొడక్షన్స్ నిర్మాణ విలువలు టాప్ క్యాలిటీలో ఉన్నాయి. అందమైన ప్రేమకథగా తెరకెక్కుతున్న 'హే కన్నమ్మ' టీజర్ ప్రస్తుతం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది.

'హార్ట్ అక్రాస్ ది సీ' యానిమేటెడ్ షార్ట్ ఫిలిం ప్రీమియర్



ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ ప్రేమ, స్నేహం, సాహసంతో అమెరికా నుంచి ఇటలీ వరకు సాగే భావోద్వేగ ప్రయాణంరిట్జ్ ఆర్ట్ హౌస్, అమెరికా నిర్మించిన యానిమేటెడ్ షార్ట్ ఫిలిం 'హార్ట్స్ అక్రాస్ ది సీ' ప్రత్యేక ప్రీమియర్ హైదరాబాద్లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్ జరిగింది. ప్రముఖ సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ ప్రీమియర్ కి ముఖ్య అతిథిగా హాజరయ్యారు డా. అపర్ణ వొల్లారు (క్రియేట్ చేసిన మూలకథ, పాత్రల ఆధారంగా రూపొందిన ఈ చిత్రానికి ఆంటోనియో ఆండ్రియాజ్జో దర్శకుడిగా, నిర్మాతగా వ్యవహరించారు. ప్రసాద్ గారపాటి నిర్మాతగా, మణీంద్ర కుమార్ ఆర్ట్ డైరెక్టర్గా పనిచేశారు. ఈ చిత్రం నిడివి 24 నిమిషాల 48 సెకన్లు.అమెరికాలోని ఒరెగాన్ ప్రాంతంలో నివసించే బీవర్ కుటుంబం, వారి స్నేహితులు 'వ్యాలీ హార్ట్' అనే నౌకలో చేపట్టే సముద్రయాత్ర చుట్టూ ఈ కథ సాగుతుంది. ఇటలీలోని వెరోనా నగరాన్ని చూడాలన్న భార్య కలను నెరవేర్చేం దుకు భర్త చేసే ప్రయ త్నం... స్నేహం, ధైర్యం, అనుకోని సవాళ్లు, పరస్పర సహకారంతో కూడిన సాహస యాత్రగా మారుతుంది. ఒరెగాన్ నుంచి వెనిస్ మీదుగా వెరోనా వరకు సాగే ఈ ప్రయాణం ప్రేక్షకులను కొత్త ప్రదేశాలకు తీసుకెళ్తుంది. "ప్రేమ అనేది మనం అనుభూతి చెందేది మాత్రమే కాదు... మన చేతల్లో చూపించేది కూడా" అనే సందేశాన్ని ఈ చిత్రం అందిస్తుంది. మానవ కళాకారులు సృష్టించిన చిత్రాలకు ఏఐ సహకారంతో చలనరూపం ఇవ్వడం ఈ నిర్మాణంలోని ప్రత్యేకత. పాత్రల రూపకల్పన, పరిసరాలు, కెమెరా కూర్పులను కళాకారులే రూపొందించారని చిత్రబృందం తెలిపింది. అనంతరం ఏఐ ఆధారిత ఇమేజ్‌టు వీడియో సాంకేతికతతో వాటిని యానిమేట్ చేశారు. స్క్రీన్ప్లే, సంభాషణలు, సంగీతాన్ని జనరేటివ్ ఏఐ ఉపయోగించకుండా సృష్టించినట్లు పేర్కొన్నారు.



శాఫ్ ఫుట్‌బాల్ టోర్నీలో..

నేడు భారత్, పాక్ ఫైనల్ పోరు

ఢాకా (బంగ్లాదేశ్): చారిత్రాత్మక శాఫ్ ఫుట్‌బాల్ 2026, టైటిల్ పోరులో బ్లూటైగర్స్ పాకిస్థాన్‌తో తలపడనున్నారు. ఈ నెల 17వ తేదీన జరుగుతున్న పోరులో తొలి ఫైనల్‌కు పాకిస్థాన్ సన్నద్ధమవుతుండగా, భారత్ తన 10వ శాఫ్ టైటిల్‌ను లక్ష్యంగా పెట్టుకుంది. బ్లూ టైగర్స్ 1993, 1997, 1999, 2005, 2009, 2011, 2015, 2021, 2023లలో రికార్డు స్థాయిలో తొమ్మిది టైటిళ్లను గెలుచుకున్నారు. ద్వితీయ శ్రేణి జట్టును భారత్ బరిలోకి దింపుతున్నప్పటికీ, వారు మరోసారి ట్రోఫీని కైవసం చేసుకునే ఫేవరెట్లుగా ఉన్నారు. మరోవైపు, పాకిస్థాన్ తమ మొట్టమొదటి సాఫ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో అడుగుపెట్టనుంది. గతంలో నాలుగుసార్లు, చివరిసారిగా 2018లో సెమీఫైనల్స్‌కు చేరిన ఈ జట్టు, శనివారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్‌ను 1-0 తేడాతో ఓడించి ఒక కొత్త రికార్డును నెలకొల్పింది. 2003లో మాత్రమే భారత్ ఫైనల్‌కు చేరడంలో విఫలమైంది. ఈ నెల 5న జరిగిన గ్రూప్ బి మ్యాచ్‌లో భారత్, పాకిస్థాన్‌ను 3-2 తేడాతో ఓడించింది. ఆ మ్యాచ్‌లో సుహైల్ అహ్మద్ భట్ రెండు గోల్స్ చేయగా, మంగలెంథాంగ్ కిప్జెన్ మూడో గోల్ చేయడంతో భారత్ 3-0 ఆధిక్యాన్ని సాధించింది. స్టాపేజ్ టైమ్‌లో పాకిస్థాన్ రెండు గోల్స్‌తో స్పందించినప్పటికీ, బ్లూ టైగర్స్ మూడు పాయింట్లను నిలబెట్టుకుంది. ఆ తర్వాత పాకిస్తాన్, మాల్దీవులను 30 తేడాతో ఓడించి సెమీఫైనల్స్‌కు చేరుకుంది, అక్కడ వారు బంగ్లాదేశ్‌ను అధిగమించారు.



ఆర్‌సిబి కెప్టెన్ ఊచకోత

అసోంను చిత్తు చేసిన మధ్యప్రదేశ్

న్యూ చండీగఢ్: రజత్ పాటిదార్ కేవలం 48 బంతుల్లోనే అజేయంగా 135 పరుగులు చేయడంతో మధ్యప్రదేశ్ జట్టు అస్సాంను 131 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. అదే సమయంలో, సోమవారం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2026లో భాగంగా జరిగిన తమ తమ ఎలైట్ గ్రూప్ మ్యాచ్‌లలో జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్ కూడా విజయాలు నమోదు చేశాయి. ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్ ప్రతిష్టాత్మక దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మధ్యప్రదేశ్ తరపున(135 నాటౌట్) విధ్వంసకర శతకం నమోదు చేశాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన మధ్యప్రదేశ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 250 పరుగులు చేసింది. రజత్ పాటిదార్‌కు తోడుగా శివాంగ్ కుమార్(61) హాఫ్ సెంచరీతో రాణించాడు. అంకుష్ సింగ్ 23 పరుగులు చేయగా, అక్షత్ రఘువంశీ 19 పరుగులు చేశాడు. అస్సాం తరఫున ఆకాష్ సేన్‌గుప్తా 3, మృణ్మోయ్ దత్తా 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం అస్సాం 17.4 ఓవర్లలో 119 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. శివశంకర్ రాయ్ 32 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, సాహిల్ జైన్ 20, ప్రద్యున్ సైకియా 18 పరుగులు చేశారు. మధ్యప్రదేశ్ బౌలర్లు ప్రత్యర్థిని కట్టడి చేయగా, కుమార్ కార్తికేయ 3/17 గణాంకాలను నమోదు చేశాడు. ఆవేశ్ ఖాన్, రాహుల్ బథమ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.



ఐపిఎల్ వేలానికి నేడు రిటెన్షన్, రిలీజ్ జాబితాలు

రూ.10 కోట్లపై ప్లేయర్లకు ఫ్రాంచైజీల చెక్

న్యూఢిల్లీ: ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు ఈ నెల 17న ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్, రిలీజ్ జాబితాలను వెల్లడించనున్నాయి. ఇప్పటికే హార్దిక్ పాండ్యా, రిషభ్ పంత్ వంటి స్టార్ ఆటగాళ్లు ట్రేడ్ల ద్వారా జట్లు మారారు. ఇప్పుడు భారీ ధరకు కొనుగోలు చేసిన ఆటగాళ్లలో ఎవరిని ఉంచాలి, వదులుకోవాలనేదానిపై వాటి నిర్ణయం ఆసక్తికరంగా మారింది. రూ.10 కోట్లకు పైగా ధర ఉన్న ఐదుగురు ఆటగాళ్లకు చెక్ పెట్టాలని భావిస్తున్నట్ల సమాచారం. వారిలో 2026 వేలంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ కామెరూన్ గ్రీన్‌ను రూ.25.20 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది.

అతడిపై జట్టు చాలా ఆశలు పెట్టుకుంది. అయితే గత సీజన్‌లో 14 మ్యాచ్‌లు ఆడిన గ్రీన్ 322 పరుగులు చేయడంతో పాటు, 7 వికెట్లు తీశాడు. అయితే అతడి కోసం వెచ్చించిన భారీ మొత్తానికి తగ్గ ప్రదర్శన చేయలేదని ఆ ఫ్రాంచైజీ భావిస్తోంది. న్యూజిలాండ్ స్టార్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ ముంబై ఇండియన్స్‌కు కీలక బౌలర్. అతడి కోసం ఫ్రాంచైజీ రూ.12.50 కోట్లు ఖర్చు చేసింది. అయితే గత సీజన్‌లో బౌల్ట్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఐదు మ్యాచ్‌ల్లో కేవలం 2 వికెట్లు మాత్రమే తీశాడు. ఈసారి ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ముంబై అతడి కొనసాగింపుపై ఆలోచిస్తోంది. యువ ఆల్‌రౌండర్ ప్రశాంత్ వీర్‌ను చెన్నై సూపర్ కింగ్స్ రూ.14.20 కోట్లకు కొనుగోలు చేసింది. గత సీజన్‌లో అతడికి బౌలింగ్‌లో ఎక్కువ అవకాశాలు రాలేదు. బ్యాటింగ్‌లోనూ ఐదు ఇన్నింగ్స్‌ల్లో 90 పరుగులే చేశాడు.

తడి విషయంలో మరోసారి ఆలోచించవచ్చనే ప్రచారం జరుగుతోంది. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినిస్‌ను పంజాబ్ కింగ్స్ రూ.11 కోట్లకు తీసుకుంది. అయితే 2027 సీజన్‌కు ముందు ఆల్‌రౌండర్ల ఎంపికపై చర్చ మొదలైంది. స్టొయినిస్‌ను కొనసాగించడం లేక అతడిని వదులుకోవాలా అనేది యాజమాన్యం ముందున్న ప్రశ్న.

ఇక వికెట్ కీపర్ బ్యాటర్ జితేశ్ శర్మను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ.11 కోట్లకు కొనసాగిస్తోంది. అయితే గత రెండు సీజన్లలో అతడి నుంచి ఆశించిన స్థాయిలో పరుగులు రాలేదు. 31 మ్యాచ్‌ల్లో 377 పరుగులు మాత్రమే చేయడంతో అతడి బ్యాటింగ్‌పై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జోడార్‌పై జ్వెరెవ్

ఆధిపత్యం

కుమామోటో: ప్రపంచ నంబర్ వన్ అలెగ్జాండర్ జ్వెరెవ్, సీజన్ ముగింపు ఏటీపీ ఫైనల్స్ టోర్నమెంట్‌లోని తన తొలి మ్యాచ్‌లో, అరంగేట్రం చేస్తున్న స్పానిష్ ఆటగాడు రఫెల్ జోడార్‌ను 6-4, 6-4 తేడాతో సునాయాసంగా ఓడించాడు. 2018, 2021లో ఈ టోర్నమెంట్‌ను గెలుచుకున్న జ్వెరెవ్‌కు, ఈ సీజన్‌లో సంచలనం సృష్టించిన స్టార్‌ను అధిగమించడానికి కేవలం ఒక గంట 27 నిమిషాలు మాత్రమే పట్టింది. 10 ఏస్‌లు, బలమైన సర్వ్ రిటర్న్‌తో అతను జోడార్‌ను కట్టడి చేశాడు, ఫలితంగా జోడార్ మొదటి సెట్‌లోని ఏడవ గేమ్‌లోనూ, మళ్ళీ రెండవ సెట్‌లోని మూడవ గేమ్‌లోనూ తన సర్వ్‌ను కోల్పోయాడు. రౌండ్ రాబిన్ దశలో ఒకరితో ఒకరు తలపడాల్సి ఉన్న అమెరికన్ బెన్ షెల్టన్, ఫ్రెంచ్ ఆటగాడు ఆర్థర్ ఫిల్స్‌లను కూడా ఈ జర్మన్ ఆటగాడు ఎదుర్కోనున్నాడు. 2026లో తన తొలి రెండు గ్రాండ్ స్లామ్ టైటిళ్లను గెలుచుకున్న తర్వాత జ్వెరెవ్ నవంబర్ ప్రారంభంలో ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు, ప్రపంచ మూడో ర్యాంకులో ఉన్న స్పెయిన్ ఆటగాడు కార్లోస్ అల్కరాజ్, అమెరికన్ ఫ్రాన్సెస్ టియాఫోతో తలపడనున్నాడు. మణికట్టు గాయం నుంచి కోలుకుని టోక్యో, వియన్నా, పారిస్ మాస్టర్స్ అనే ఐదు టోర్నమెంట్లలో మూడు విజయాలు సాధించిన అల్కరాజ్ ఫేవరెట్‌గా పరిగణించబడుతున్నాడు.



సినియా, టేలర్‌కు డబుల్స్ టైటిల్

ఇండియన్ వెల్స్: ఫైనల్ మ్యాచ్‌లో ఇటలీకి చెందిన సారా ఎర్రాని-జాస్మిన్ పాలినిలను 6-4, 6-3 తేడాతో ఓడించిన కటెరీనా సినియాకోవా-టేలర్ టౌన్‌సెండ్ జోడీ తమ తొలి డబ్ల్యూటిఎ ఫైనల్స్ డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో టౌన్‌సెండ్ తన తొలి ఫైనల్స్ టైటిల్‌ను గెలుచుకోగా, 2021లో బార్బోరా క్రెజికోవాతో కలిసి సీజన్ ముగింపు ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న సినియాకోవాకు ఇది రెండో టైటిల్. ఈ టోర్నమెంట్‌లో వరుసగా మూడవసారి కలిసి పాల్గొన్న ఈ జంట టైటిల్‌ను కైవసం చేసుకుంది.

ఎర్రాని, పౌలినీ అద్భుతంగా ప్రారంభించి, తొలి సెట్‌లో 3-1 ఆధిక్యం సాధించడానికి ప్రారంభంలోనే ఒక బ్రేక్‌ను దక్కించుకున్నారు. కానీ సినియాకోవా-టౌన్‌సెండ్ 4-2తో వెనుకబడినప్పటికీ పుంజుకుని, వరుసగా నాలుగు గేమ్‌లు గెలిచి సెట్‌ను 6-4తో కైవసం చేసుకున్నారు. రెండవ సెట్ కూడా అదే రీతిలో సాగింది, ఇటాలియన్లు సర్వ్‌ను బ్రేక్ చేసి 2-1 ఆధిక్యంలోకి వెళ్లారు. అయితే, సినియాకోవా, టౌన్‌సెండ్ వెంటనే తిరిగి బ్రేక్ చేయడంతో వారు ఆ బ్రేక్‌ను నిలబెట్టుకోలేకపోయారు. చెక్ అమెరికన్ ద్వయం ఎనిమిదవ గేమ్‌లో మరో బ్రేక్‌ను సాధించి, 1 గంట 15 నిమిషాల పోరులో 6-4, 6-3 తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది.

స్టాక్ మార్కెట్ జోష్

బ్యాంకింగ్ స్టాక్స్‌కు లాభాల మద్దతు



న్యూఢిల్లీ, నవంబరు 16: ప్రపంచ పరిణామాలపై అప్రమత్తత, కొనసాగుతున్న ద్రవ్యోల్బణ ఆందోళనలు ఉన్నప్పటికీ, హెవీవెయిట్, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మార్కెట్ కోలుకోవడానికి సహాయపడటంతో, సోమవారం దేశీయ ఈక్విటీ బెంచ్‌మార్క్‌లు లాభాలతో ముగిశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 512.34 పాయింట్లు లేదా 0.63 లాభపడి 82,104.79 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 146.80 పాయింట్లు పెరిగి 25,291.10 వద్ద స్థిరపడింది. పెరిగిన బాండ్ దిగుబడులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, డిసెంబరులో ప్రధాన కేంద్ర బ్యాంకుల ద్వారా మరిన్ని వడ్డీ రేట్ల పెంపు అవకాశాల పట్ల పెట్టుబడిదారులు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, ఈ లాభాలు వచ్చాయి. అయితే, ఇటీవలి ముడిచమురు ధరల తగ్గుదల మార్కెట్లకు కొంత ఉపశమనం కలిగించింది. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ మాట్లాడుతూ, ప్రపంచ అనిశ్చితి, ద్రవ్యోల్బణ ఆందోళనలు పెట్టుబడిదారులను అప్రమత్తంగా ఉంచుతున్నందున, మార్కెట్ ఇటీవలి గరిష్ట స్థాయిల సమీపంలో స్థిరపడుతోందని అన్నారు. "బలహీ నమైన ప్రపంచ సంకేతాలు, నిరంతర ద్రవ్యోల్బణ ఆందోళనల కారణంగా భారత బ్రాడ్ మార్కెట్ ఇటీవలి గరిష్ట స్థాయిల సమీపంలో స్థిరపడుతోంది్ది అని నాయర్ అన్నారు. బ్యాంకింగ్, ఇతర హెవీ వెయిట్ స్టాక్‌లు బెంచ్‌మార్క్‌లకు మద్దతునిచ్చినప్పటికీ, ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో పెట్టుబడిదారులు ఎఫ్ఎంసిజి, ఆసుపత్రుల వంటి రక్షణాత్మక రంగాల వైపు కూడా మళ్లారు. భవిష్యత్తు గురించి మాట్లాడుతూ, స్వల్పకాలిక అస్థిరతకు అవకాశం ఉన్నప్పటికీ, విదేశీ పెట్టుబడిదారుల కొనుగోళ్లు, కార్పొరేట్ ఆదాయాల నుండి మార్కెట్‌కు కొంత మద్దతు లభించిందని నాయర్ అన్నారు. "అయిన ప్పటికీ, పునరుద్ధరించబడిన ఎఫ్ఐఐ ప్రవాహాలు, 2027 ఆర్థిక సంవత్సరం, 2028 ఆర్థిక సంవత్సరం అంచనాలకు పెద్దగా డౌన్‌గ్రేడ్ ప్రమాదం లేకుండా పటిష్టమైన ఆదాయాల ఊపు, సాపేక్షంగా అనుకూలమైన వాల్యుయేషన్‌లు నిర్మాణాత్మక దీర్ఘకాలిక దృక్పథానికి మద్దతు ఇస్తున్నాయ్ది అని ఆయన అన్నారు. పెట్టుబడిదారులకు, మార్కెట్ పునరుద్ధరణ కొన్ని స్వల్పకాలిక అడ్డంకులను ఎదుర్కొం టోందనేది ముఖ్యాంశం. విదేశీ నిధుల ప్రవాహాలు మరియు కార్పొరేట్ ఆదాయాలు సెంటిమెంట్‌కు మద్దతునిస్తున్నప్పటికీ, చిన్న స్టాక్‌లలో లాభాల స్వీకరణ మరియు వడ్డీ రేట్లపై అనిశ్చితి కారణంగా ఈ ర్యాలీ మార్కెట్ అంతటా ఏకరీతిగా ఉండకపోవచ్చని సూచిస్తున్నాయి.

ఆర్‌బిఐ కొరడా: 49 నాన్ బ్యాంకింగ్ సంస్థల లైసెన్స్ రద్దు

మరో 14 కంపెనీలు సరెండర్


ముంబై, నవంబరు 16: దేశంలోని బ్యాంకింగేతర ఆర్థిక రంగంలో పారదర్శకతను పెంచడం, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై ఉక్కుపాదం మోపడంలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మరోసారి కొరడా ఝులిపించింది. మొత్తం 63 ఆర్థిక సంస్థలపై నియంత్రణ పరమైన చర్యలు తీసుకుంటూ సోమవారం నవంబరు 16,2026న ఆర్‌బీఐ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా నిబంధనల ప్రకారం 49 నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను రద్దు చేయగా, మరో 13 ఎన్‌బిఎఫ్‌సిలు, ఒక హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ తమ లైసెన్సులను స్వచ్ఛందంగా అప్పగించడంతో వాటి రిజిస్ట్రేషన్లను కూడా రద్దు చేసింది. లైసెన్స్ రద్దయిన ఈ సంస్థలు ఇకపై ఎలాంటి ఆర్థిక, రుణ కార్యకలాపాలు నిర్వహించేందుకు వీలు లేదని ఆర్‌బిఐ స్పష్టం చేసింది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934లోని సెక్షన్ 45-1ఎ (6) కింద ఉన్న అధికారాలను ఉపయోగించి 49 ఎన్‌బిఎఫ్‌సిల సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ రద్దు చేసినట్లు తెలిపింది. ఈ 49 కంపెనీల రిజిస్ట్రేషన్ రద్దుకు సంబంధించిన ఉత్తర్వులను అక్టోబరు 1 నుంచి అక్టోబరు 29, 2026 మధ్య జారీ చేసినట్లు కేంద్ర బ్యాంక్ వెల్లడించింది. ఆర్‌బిఐ చట్టం సెక్షన్ 451 క్లాజ్ (ఎ) ప్రకారం, రిజిస్ట్రేషన్ రద్దయిన ఈ కంపెనీలు ఇకపై ఎలాంటి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ వ్యాపార లావాదేవీలు నిర్వహించకూడదు.



లైసెన్సులు అప్పగించిన 14 కంపెనీలు: మరోవైపు, ఆర్‌బిఐ చట్టం, నేషనల్ హౌసింగ్ బ్యాంక్ చట్టం 1987 నిబంధనల ప్రకారం 13 ఎన్‌బిఎఫ్‌సిలు, 1 హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ తమ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను అప్పగించడంతో వాటిని రద్దు చేశారు. ఇందుకు ఆర్‌బిఐ మూడు కారణాలు చెప్పింది. బ్యాం కింగేతర ఆర్థిక సంస్థ వ్యాపారం నుంచి వైదొ లగడం వల్ల 6 కంపెనీలు తమ లైసెన్సులను అప్పగించినట్లు తెలిపింది. వీటిలో మనీష్ సింథటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అమర్ ప్లాజా అండ్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వికోనిక్ వ్యాపార్ ప్రైవేట్ లిమిటెడ్, రైట్ ట్రెజర్ ఫైనాన్స్ అండ్ లీజింగ్ ఇండియా, బ్రావో క్యాపిటల్ సర్వీసెస్, సిజిఆర్ మర్కంటైల్ ఫైనాన్స్ కంపెనీలు ఉన్నాయి. నిర్దేశిత ప్రమాణాలను చేరుకోవడం వల్ల సెక్షన్ 45-1ఎ కింద రిజిస్ట్రేషన్ అవసరం లేని అన్‌రి జిస్టర్డ్ టైప్1 ఎన్‌బిఎఫ్‌సిలుగా వర్గీకరించిన 5 కంపెనీల రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు. విలీనం లేదా రద్దు లేదా స్వచ్ఛంద డ్రైవ్ ఆఫ్ కారణంగా చట్టపరమైన ఉనికిని కోల్పోవడంతో 3 సంస్థలు లైసెన్సులు రద్దయ్యాయని ఆర్‌బిఐ తెలిపింది. వీటిలో మణిభవనం హోమ్ ఫైనాన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సన్ సోర్స్ లీఫిన్, లియానర్ డిస్ట్రిబ్యూటర్స్ ఉన్నాయి.

పెరగనున్న లోన్ ఇఎంఐలు?

కొత్త సంవత్సరానికి ముందే మరో పిడుగు.. సామాన్యులకు కష్టమే



ముంబై, నవంబరు 16: గత నెలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్లను పెంచిన విషయం తెలిసిందే. గత నెలలో జరిగిన ద్రవ్య విధాన పరపతి సమీక్షలో రెపో రేటును 0.25 శాతం పెంచింది. దీంతో వడ్డీ రేట్లు 5.25 శాతం నుంచి 5.50 శాతానికి చేరుకున్నాయి. దాదాపు నాలుగేళ్ల తర్వాత తొలిసారి వడ్డీ రేట్లను ఆర్బీఐ పెంచగా దీని వల్ల లోన్లు తీసుకున్నవారికి నెలవారీ ఇఎంఐలు పెరగడం వల్ల వారిపై భారం పడుతోంది. అయితే ఈ క్రమంలో ఇఎంఐలు చెల్లించేవారికి షాకిస్తూ మరో వార్త వినిపిస్తోంది. వడ్డీ రేట్లను డిసెంబరులో మరోసారి పెంచే అవకాశముందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) తన ఆర్థిక నివేదికలో అంచనా వేసింది. డిసెంబరులో ఆర్బీఐ ద్రవ్య విధాన పరపతి సమీక్ష సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశంలో రెపో రేటును మరో 0.25 బేసిస్ పాయింట్లు పెంచే యోచనలో ఆర్బీఐ ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతుండటం, రూపాయి బలహీనపడటం, ముడి చమురు ధరల్లో మార్పుల క్రమంలో వడ్డీ రేట్లను పెంచే అవకాశముందని ఎస్బీఐ తన నివేదికలో పేర్కొంది. నవంబరులో ద్రవ్యోల్బణం 6 శాతానికి చేరుకునే అవకాశముందని అంచనా వేసిన ఎస్బీఐ.. ఆ తర్వాత తగ్గే ఛాన్స్ ఉందని అభిప్రాయపడింది. రూపాయి విలువ క్షీణిస్తుండటంతో దీనిని కట్టడి చేసేందుకు ఆర్బీఐ చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా వడ్డీ రేట్లను పెంచుతూ వస్తోంది. రెపో రేట్లను పెంచడం వల్ల ఫ్లోటింగ్ ఆధారిత వడ్డీ రేట్లు పెరుగుతాయి. దీని వల్ల ఫ్లోటింగ్ రేటుతో లోన్లు తీసుకున్నవారికి ఇఎంఐలు మరింత పెరుగుతాయి. దీని వల్ల ఇఎంఐలు మరింత చెల్లించాల్సి ఉంటుంది. ముఖ్యంగా హోమ్ లోన్లు ఫ్లోటింగ్ రేటుతో ముడిపడి ఉంటాయి. దీంతో గృహ రుణాలు తీసుకున్నవారికి ఇది చేదువార్తగా చెప్పవచ్చు. అయితే దీని వల్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసేవారికి అధిక ఆదాయం లభించనుండగా కొత్తగా లోన్లు తీసుకునేవారికి కూడా నష్టం చేకూరుస్తుంది. వడ్డీ రేట్లు పెరగడం వల్ల అధిక వడ్డీతో లోన్లు తీసుకోవాల్సి ఉంటుంది.

క్షీణిస్తున్న రూపాయి.. ఆర్బీఐ చర్యలు: కాగా ఆర్బీఐ తీసుకుంటున్న నిర్ణయాలు రూపీ విలువ క్షీణించకుండా చేయడంలో సహాయపడుతున్నాయి. అమెరికా డాలర్‌తో పోలిస్తే దేశీయ కరెన్సీ 94 కంటే దిగువకు చేరుకుంది. దీని వల్ల నగదు లభ్యతపై ఒత్తిడి కూడా తగ్గిందని చెప్పవచ్చు. అక్టోబరు చివరి వారంలో 5.8 శాతానికి చేరిన కాల్ మనీ రేటు.. తర్వాత మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటు 5.44 శాతం కంటే దిగువకు తగ్గిందని ఎస్బీఐ తన ఆర్థిక నివేదికలో పొందువరిచింది.


అక్టోబరులో భారత్ ఎగుమతులు 29.9శాతం వృద్ధి

గణాంకాలు విడుదల చేసిన వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, నవంబరు 16 : భారత ఎగుమతి రంగం అక్టోబరు నెలలో గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువుల నుండి రత్నాలు, ఆభరణాల వరకు అన్ని రకాల ఎగుమతులు భారీగా పెరిగాయి. ప్రపంచ వాణిజ్యం సవాళ్లతో కూడుకున్న ప్రస్తుత తరుణంలో ఈ వృద్ధినమోదు కావడం గమనార్హం. వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, అక్టోబరు 2026లో భారత్ మొత్తం వస్తు, సేవల ఎగుమతులు గత యేడాదితో పోలిస్తే 29.90శాతం పెరిగి, సుమారు 89.99 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత యేడాది ఇదే నెలలో ఈ విలువ 69.27బిలియన్ డాలర్లుగా ఉంది. అదేసమయంలో, దిగుమతులు కూడా పెరిగాయి. గత యేడాదితో పోలిస్తే దిగుమతులు 16.58 శాతం పెరిగి, 94.42 బిలియన్ డాలర్ల నుండి 110.07 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీనివల్ల అక్టోబరు నెలలో మొత్తం వాణిజ్య లోటు 20.09 బిలియన్ డాలర్లుగా నమోదైంది. (గత యేడాది అక్టోబరులో ఇది 25.15 బిలియన్ డాలర్లుగా ఉండేది). పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, రత్నాలు, ఆభరణాలు, రసాయనాలు, ఇంజనీరింగ్ వస్తువులతో సహా పలు విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరచడం వల్ల ఎగుమతులు వృద్ధి చెందాయి. **పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ రంగాలదే అగ్రస్థానం:** అక్టోబరు నెలలో భారత వస్తు ఎగుమతుల వృద్ధికి ప్రధాన చోదక శక్తులలో ఒకటిగా పెట్రోలియం ఉత్పత్తులు నిలిచాయి. ఈ విభాగంలో ఎగుమతులు 140.21శాతం పెరిగి 8.89 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత యేడాది అక్టోబరులో ఇవి 3.70 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా బలమైన పనితీరును కనబరిచాయి. గత యేడాది 4.08 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు, 62.70శాతం పెరిగి 6.64 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. భారతదేశ ఎగుమతుల బుట్టలో ఎలక్ట్రానిక్స్ వాటా పెరుగుతోందని ఈ పెరుగుదల స్పష్టం చేస్తోంది. రత్నాలు, ఆభరణాల ఎగుమతులు 40.06శాతం పెరిగి 3.21 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అక్టోబరు 2025లో ఈ సంఖ్య 2.29 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ పెరుగుదలకు రసాయనాలు, ఇంజనీరింగ్ వస్తువులు కూడా దోహదపడ్డాయి. సేంద్రీయ, అసేంద్రీయ రసాయనాల ఎగుమతులు 36.20శాతం పెరిగి 2.89 బిలియన్ డాలర్లకు చేరుకోగా, ఇంజనీరింగ్ వస్తువుల ఎగుమతులు 36.01శాతం పెరిగి, గత ఏడాది 9.37 బిలియన్ డాలర్ల నుండి 12.74 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. విలువ పరంగా చూస్తే, ఈ ప్రధాన ఎగుమతి విభాగాలలో ఇంజనీరింగ్ వస్తువులే అతిపెద్ద వాటాదారుగా నిలిచాయి. ఎగుమతులలో పెరుగుదల కేవలం ఐదు ప్రధాన విభాగాలకే పరిమితం కాలేదు. అక్టోబరు నెలలో అనేక ఇతర పరిశ్రమలు కూడా మంచి వృద్ధిని నమోదు చేశాయి.



మళ్లీ పెరిగిన సిఎన్‌జి ధర



న్యూఢిల్లీ, నవంబరు 16: ఆటో, క్యాబ్ డ్రైవర్ల జేబులకు మరోసారి చిల్లు పడింది. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్‌జి) ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. తాజా ముంబై, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్) పరిధిలో ఇంధన సరఫరా చేసే మహానగర్ గ్యాస్ లిమిటెడ్ (ఎంజిఎల్), సిఎన్‌జి ధరను మరోసారి పెంచింది. కిలోకు రూ.1.50 మేర పెంచడం గమనార్హం. అర్ధరాత్రి నుంచే ఈ పెరిగిన ధరలను అమలులోకి తెచ్చింది. ముంబై, థానే, నవీ ముంబై ప్రాంతాల్లో సిఎన్‌జి కిలో ధర రూ.90 నుంచి రూ.91.50కి చేరుకుంది. కేవలం 15 రోజుల వ్యవధిలోనే ఇది రెండోసారి ధర పెరగడం. అంతేకాదు, 2026 క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటి వరకు ఇది 8వ సారి ధరల పెంపు కాగా, జనవరి నుంచి చూస్తే కిలోకు ఏకంగా రూ.11 భారం పెరిగింది. **సిఎన్‌జీ ధరల పెంపు గణాంకాలు:** గత 11 నెలల్లో సిఎన్‌జి ధర క్రమంగా ఆకాశాన్ని తాకింది. నవంబరు 16, 2026 రోజున కిలోకు రూ.1.50 పెంపుతో కొత్త ధర రూ.91.50కి చేరింది. సెప్టెంబరు 2026లో రూ.2 పెరిగి రూ.88కి, అక్టోబరులో రూ.1 పెరిగి రూ.89కి, నవంబరు 1న రూ.1 పెరిగి రూ.90కి చేరిన సిఎన్‌జి ధర ఇప్పుడు నవంబరు 16 నాటికి రూ.1.50 పెరిగి రూ.91.50కి ఎగబాకింది. జనవరి 2026 ప్రారంభంలో ముంబైలో కిలో సిఎన్‌జి ధర కేవలం రూ.80.50 వద్ద ఉండేది. అప్పటి నుంచి చూస్తే ఏకంగా 8 సార్లు ధరలు పెంచారు. మొత్తం రూ.11 మేర ధర పెంచడం గమనార్హం. అంటే దాదాపు 13.66 శాతం మేర ధర పెంచారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.